thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 205 | కరీంనగర్ గురువారం, 2 అక్టోబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఢిల్లీ పెత్తనాన్ని ఎప్పటికీ అనుమతించం..

చెన్నై: ఢిల్లీ నుండి రాష్ట్రంపై పెత్తనం చెలాయించేం దుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్య మంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. సేలంలోని మోహన్‌కుమా రమంగళం ప్రభుత్వ వైద్యకళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సభలో రూ. 880 కోట్లతో నిర్మించనున్న జౌళి పార్కుకు, రూ. 100 కోట్లతో నిర్మించనున్న కొత్త గ్రం థాలయ భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. రూ. 225 కోట్లతో పూర్తయిన పథకాలకు ప్రారం భోత్సవం చేసిన ఆయన 1,01,203 మంది లబ్ధిదా రులకు సహాయాలు పంపిణీ చేశారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇటీవల మదురైలో పర్యటించిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కేంద్ర ప్రభుత్వం అమలు చేసే పథకాలకు విడుదలయ్యే నిధులను మళ్లించి రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు ఖర్చు చేస్తున్నట్లు అసత్య ఆరోపణలు చేశారన్నారు.




## ఈటల నుంచి ఇలాంటి వ్యాఖ్యలు దారుణం: కవిత




హైదరాబాద్, అక్టోబర్ 1: బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌పై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తీవ్ర స్థాయిలో విరుచుకు పడ్డారు. బుధవారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. బీసీలకు ఎంపీ ఈటల క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలపై కోర్టుకు వెళ్తానని ఈటల రాజేందర్ అనటం తప్పన్నారు. బీసీ రిజర్వేషన్లపై బీజేపీ చిత్తశుద్ధికి ఈటల వ్యాఖ్యలు నిదర్శనమన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం అవసరమైతే సొంత పార్టీ బీజేపీతో ఈటల కొట్లాడాలని అన్నారు. ఈటల ఫైటర్ అయి ఉండి.. గౌరవం తగ్గించుకునే విధంగా మాట్లాడారని విమర్శించారు. ఉద్యమకారుడు, బీసీ బిడ్డ ఈటల నుంచి ఇలాంటి వ్యాఖ్యలు దారుణమన్నారు. బీసీ రిజర్వేషన్లను బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు స్వాగతిస్తారని.. కానీ ఈటల మాత్రం ఎన్నికల తర్వాత కోర్టుకు వెళ్తానంటున్నారని మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్లపై కోర్టుకు వెళ్లిన వారు సీఎం రేవంత్ రెడ్డికి దగ్గర వ్యక్తులంటూ వ్యాఖ్యలు చేశారు. బీసీలకు రాజకీయంగా అవకాశం వస్తుంటే కోర్టుకు పోతామని ఈటల ఎలా అంటారని ప్రశ్నించారు. గవర్నర్ దగ్గర పెండింగ్‌లో ఉన్న ఆర్డినెన్స్‌ను బీజేపీ పాస్ చేపించాలని డిమాండ్ చేశారు కవిత. బీసీ రిజర్వేషన్ల కోసం బీజేపీకి చెందిన 8 మంది ఎంపీలు మోదీని కలవాలన్నారు. రాష్ట్రపతి దగ్గర పెండింగ్‌లో ఉన్న బీసీ బిల్లును పాస్ చేయించాలని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసిన కులగణన తప్పుల తడక అని విమర్శలు గుప్పించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ జనాభా లేని గ్రామాలను ఆయా వర్గాలకు రిజర్వ్ చేశారన్నారు. రిజర్వేషన్ల ఖరారులో కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేసిందని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ చేశామంటున్న రేవంత్.. రిజర్వేషన్ల కేటాయింపులో వర్గీకరణ పాటించలేదని ఫైర్ అయ్యారు. ఎస్సీల్లో మాదిగలకు ఎన్ని సీట్లు కేటాయించారో ఎందుకు చెప్పలేదని నిలదీశారు. గ్రామ పంచాయతీల వారీగా కులగణనను బయట పెట్టాలని జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు.

**మాకు అదే ముఖ్యం..** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతో ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు కవిత. ఉప ఎన్నికల్లో ఎవరు గెలిచినా పెద్ద తేడా ఏమీ ఉండదని తెలిపారు. జాగృతి టార్గెట్ బీసీ రిజర్వేషన్లు సాధించటమే అని.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కాదని స్పష్టం చేశారు. 8వ తేదీన కోర్టు తీర్పును బట్టి స్థానిక సంస్థల ఎన్నికలపై తమ స్టాండ్ చెప్తామన్నారు. పోటీ చేసే అంశంపై తమ నాయకులతో చర్చించి నిర్ణయిస్తామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టును రిపేర్ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం మంచిదే అని అన్నారు. బీసీ రిజర్వేషన్లపై బీఆర్ఎస్ సీరియస్‌గా ఫైట్ చేయాలని కవిత సూచించారు.



## తెలంగాణకు కొత్తగా నాలుగు కేంద్రీయ విద్యాలయాలు

హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు కొత్తగా మరో నాలుగు కేంద్రీయ విద్యాలయాలను కేటాయించిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే ఉన్న 35 కేంద్రీయ విద్యాలయాలకు తోడుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం (యాస్పిరేషనల్ డిస్ట్రిక్ట్), ములుగు జిల్లా కేంద్రం (గిరిజన ప్రాంతం), జగిత్యాల జిల్లా - జగిత్యాల రూరల్ మండలం చెల్గల, వనపర్తి జిల్లా - నాగవరం శివారులో ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు. ఈ నాలుగు విద్యాలయాలు మారుమూల ప్రాంతాల్లో.. నాణ్యమైన ప్రాథమిక, సెకండరీ విద్యను అందించడంలో కీలకం కానున్నాయని కిషన్ రెడ్డి విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

తెలంగాణలో విద్యాభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ధన్యవాదాలు చెప్పారు. గత రెండేళ్లలోనే కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో నాణ్యమైన సెకండరీ విద్యను అందించేందుకు రూ. 400 కోట్లతో 832 పీఎం-శ్రీ స్కూల్స్‌ను మంజూరు చేసిందని కిషన్ రెడ్డి తెలిపారు. దేశవ్యాప్తంగా పీఎం శ్రీ స్కూల్స్ కోసం ఎక్కువ కేటాయింపులు అందుకున్న రాష్ట్రం తెలంగాణనే కావడం విశేషమన్నారు. సమగ్రశిక్షా అభియాన్ కింద గత రెండేళ్లలో తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం దాదాపు రూ. 2వేల కోట్లు కేటాయించిందని వివరించారు. దాదాపు రూ. వెయ్యి కోట్లతో ములుగు జిల్లాలో సమ్మక్క, సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీని కూడా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు.


# రిజర్వేషన్లు మారేనా?

# సర్వత్రా ఇదే చర్చ!

## నోటిఫికేషన్ వచ్చినా దిక్కుతోచని పరిస్థితుల్లో ఆశావహులు!!




హైదరాబాద్ : స్థానిక సంస్థల రిజర్వేషన్ల అంశం హైకోర్టులో ఉన్న నేపథ్యంలో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన రిజర్వేషన్లలో అనుకూలంగా ఉన్న స్థానాలు ఎక్కడ మారుతాయోనని ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. రిజర్వేషన్లపై హైకోర్టులో ఈ నెల 8న వాదనలు ఉండగా, మరుసటి రోజు నుంచే ఎంపీటీసీ, జెడ్పీటీసీ మొదటి విడత ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కానుంది. అధికార యంత్రాంగం నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను మొదలు పెట్టేందుకు అంతా సిద్ధం చేసుకుంది. పరిషత్, సర్పంచ్ స్థానాలకు పోటీ చేయాలనుకుంటున్న వారిలో ఇదే చర్చ బంతి హైకోర్టులో ఉండడంతో ఏమవుతుందోననే ఉత్కంఠ నెలకొంది. స్థానిక సంస్థల రిజర్వేషన్లు.. షెడ్యూల్ విడుదల.. హైకోర్టులో కేసు.. సుప్రీం కోర్టుకు సైతం కేసు వెళ్లనుందనే వార్తల నేపథ్యంలో రిజర్వేషన్లు మారుతాయా? అనే చర్చ అన్ని పార్టీల శ్రేణుల్లో సాగుతోంది. ఎక్కడ చూసినా.. ఏ ఇద్దరు కలిసినా.. ఫోన్లలో మాట్లాడుకున్నా ఇవే సంభాషణలు జరుగుతున్నాయి. ఇక పోటీ చేయాలనుకుంటున్న వారిలో ఈ అంశం ఉత్కంఠను రేపుతోంది. వ్యవహారం హైకోర్టులో ఉండడం, దీనిపై ఈ నెల 8న వాదనలు జరుగనున్న నేపథ్యంలో ప్రతిఒక్కరిలో ఆసక్తి నెలకొంది. పైగా కోర్టు నుంచి ఎలాంటి ఆదేశాలు వస్తాయో అనే విషయమై ఆశా వహుల్లో ఆందోళన నెలకొనగా.. మరోవైపు మరుసటి రోజు నుంచే ఎంపీటీసీ, జెడ్పీటీసీ మొదటి విడత ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ మొదలు పెట్టేందుకు యంత్రాంగం సిద్ధం అయ్యింది. దీంతో పరిణామాలు ఎలా మారుతాయోనని ముఖ్యంగా ఎన్నికల బరిలో నిలవాలనుకుంటున్న ఆశావహులు పరేషాన్ అవుతున్నారు. ఇదిలా ఉండగా అధికార పార్టీ నేతల్లో నిరాశ ఏళ్ల తరబడి పార్టీ కోసం పనిచేసి, గత పదేళ్లలో పలు కేసులు ఎదుర్కొన్నప్పటికీ తమకు పోటీ చేసే అవకాశాలు దక్కలేదని పలువురు అధికార పార్టీ నాయకులు గగ్గోలు పెడుతున్నారు. ఎంపీపీ స్థానం దక్కించుకునే అవకాశం ఉన్నప్పటికీ ఎంపీటీసీ స్థానంలో పోటీ చేసేందుకు అనుకూలంగా రిజర్వేషన్లు దక్కకపోవడంతో ఆయా గ్రామాల కీలక నాయకులు నిట్టూరుస్తున్నారు. ఎంపీటీసీ స్థానం అనుకూలంగా వచ్చినప్పటికీ ఎంపీపీ పీఠంపై కూర్చునేందుకు అవకాశాలు లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొత్తంమీద షెడ్యూల్ వచ్చినప్ప టికీ బంతి హైకోర్టులో ఉన్నందున ఎన్నికల వాతావరణంలో గతానికి భిన్నమైన ప్రత్యేకత నెలకొంది.




# అమెరికాలో తీవ్ర సంక్షోభం..

## 7.5 లక్షల ఉద్యోగులు వేతనం లేకుండా ఇంటికే..

2014 తర్వాత మోడీ భారత ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశారు. అప్పటి నుంచి భారత్ తో కయ్యానికి కాలు దువ్వుతున్న ఏ దేశం కూడా అభివృద్ధిలో ముందుకు కదలలేదు సరికదా.. కనీసం ప్రశాంతంగా ఉన్న దాఖలాలు లేవు. మొదట శ్రీలంక తాము చైనాతోనే ఉంటామని చెప్పింది. ఆ దేశం ఏమైందో చూశాం. ఆ తర్వాత మాల్దీవులు.. అది కూడా, ఇక పాకిస్తాన్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు రొట్టెల పిండి కోసం కొట్లాటలు తప్పలేదు. పొరుగున బంగ్లాదేశ్ ఇక ఇప్పట్లో కోలుకునేలా లేదు. సమీపంలోని నేపాల్ ఇలా ప్రతీది నాశనం అవుతూనే ఉంది. ఇక ఇప్పుడు అగ్రరాజ్యం అమెరికా వంతు అన్నట్లు ఉంది.

**అమెరికాలో సంక్షోభం...** టారీఫ్ ల పేరుతో భారత్ ను వేధించినందుకు అమెరికా ఎప్పుడూ పశ్చాత్తాపపడలేదు. దాని పాపం దానికే అని మనం ఊరుకున్నాం.. కానీ అనతి కాలంలో అక్కడ కూడా సంక్షోభం ఎదురవుతుంది. అమెరికా వంటి అతిపెద్ద ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం తాత్కాలికంగా మూతపడడం ఆశ్చర్యానికి గురి చేసింది. ఆరేళ్ల తర్వాత అమెరికాలో సంక్షోభం చోటు చేసుకుంది. నిధుల బిల్లుపై కాంగ్రెస్‌లోని రిపబ్లికన్, డెమొక్రటిక్ పార్టీల మధ్య విభేదాలు తలెత్తాయి. ఫలితంగా ప్రభుత్వం షట్ డౌన్ అయ్యింది. అమెరికన్ల నిత్యజీవితానికి కీలకమైన సేవలు ఒక్కసారిగా నిలిచిపోయాయి. లక్షలాది ఉద్యోగుల వేతనం లేకుండా ఇంటికే పరిమితమవ్వడం ప్రజాస్వామ్య వ్యవస్థలోని లోపాలను, పార్టీల అహంకారాలను బహిర్గతం చేస్తోంది.

**అసలు కారణం ఇదే..** ప్రతి ఏటా అక్టోబర్ 1వ తేదీ అమెరికా ఫెడరల్ ప్రభుత్వం కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభిస్తుంది. దీనికి అవసరమైన నిధులను ఆ దేశ కాంగ్రెస్ ఆమోదించాలి. ఈసారి రిపబ్లికన్లు తాత్కాలిక నిధుల బిల్లును ప్రవేశపెట్టగా, డెమొక్రాట్లు ఆరోగ్య బీమా సబ్సిడీల పొడిగించాలని పట్టుబట్టారు. కానీ రిపబ్లికన్లు ఆ అంశం బడ్జెట్ చర్చల్లో కాకుండా వేరు చేయాలని పట్టుబట్టారు. రెండు వైపులా ఎవరూ తగ్గకపోవడంతో, బిల్లు ఆమోదం పొందలేదు. ఫలితంగా నిధుల విడుదల నిలిచిపోయింది.

**రాజకీయాల ఆట..** 'షట్‌డౌన్ వల్ల ఉద్యోగాలు పోతే, దానికి డెమొక్రాట్లే కారణం అవుతారు' అని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా చెప్తున్నారు. ఈ వ్యాఖ్యలు పరిస్థితిని మరింత దిగజార్చింది. దేశాధినేత ఈ వ్యాఖ్యలు చేయకుండా ఉండాలి. పరిస్థితిని చక్కదిద్దడం పోయి ఆందోళన, భయాలను ప్రజలపై రుద్దడంతో అమెరికన్లు ఖంగారు పడుతున్నారు.

**వీరిపై ప్రభావం పడే అవకాశం..** 7.5 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు వేతనం లేకుండా సెలవుపై వెళ్లాల్సిన పరిస్థితి రావచ్చు. అమెరికా మొత్తంగా పార్కులు, మ్యూజియంలు మూసి వేస్తారు. వీసా ప్రాసెసింగ్, రుణాల మంజూరు, పరిశోధనలు పూర్తిగా నిలిచిపోతాయి. పౌర సేవలైన తాగునీటి అందజేత, పారిశుధ్యం, ఇంకా చాలా వరకు సేవలు ఆలస్యం అవుతాయి. అయితే సైన్యం, సరిహద్దు భద్రత, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వంటి అత్యవసర సేవలకు మాత్రం ఎలాంటి భంగం వాటిల్లదు. కానీ ఉద్యోగులకు మాత్రం వేతనాలు కొంత ఆలస్యం కావచ్చు. దీని వల్ల ప్రజా జీవన ప్రమాణం దెబ్బతినడమే కాకుండా, ప్రభుత్వంపై విశ్వాసం దెబ్బతింటుంది.

**గతంలో షట్ డౌన్ల చరిత్ర..** 1981 నుంచి ఇప్పటి వరకు అమెరికా 15 సార్లు షట్‌డౌన్ ఎదుర్కొంది. సాధారణంగా ఇది కొన్ని రోజులు మాత్రమే కొనసాగాయి. 2018లో ట్రంప్ హయాంలో 'బోర్డర్ వాల్' డిమాండ్‌పై 35 రోజులపాటు షట్‌డౌన్ జరిగింది. ఇది అమెరికా చరిత్రలో సుదీర్ఘమైనదిగా చెప్తారు.

**ప్రపంచంలో ఎలాంటి మార్పులు జరగవచ్చు..** అమెరికా ఒక సూపర్ పవర్ నేషన్. అక్కడి ఆర్థిక వ్యవస్థలో తలెత్తే చిన్నపాటి ఆటుపోటు గ్లోబల్ ఫైనాన్షియల్ మార్కెట్లపై ప్రభావం చూపుతుంది. డాలర్ బలహీన పడితే.. వాణిజ్య అస్థిరత, పెట్టుబడులు తగ్గుతాయి. చైనా లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు దీనిని అవకాశంగా తీసుకోవచ్చు. కాబట్టి షట్‌డౌన్ అనేది కేవలం అమెరికా అంతర్గత సమస్య కాదు.. ప్రపంచానికి కూడా ఆర్థిక సంకేతాలు పంపుతుంది.



# హై అలర్ట్.. మరో 2 రోజులు దంచుడే

విశాఖ: పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతోంది. ఇది మరింత బలపడి పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ.. గురువారం తెల్లవారుజామున వాయుగుండంగా మారే అవకాశం ఉంది. అక్టోబర్ 3న దక్షిణ ఒడిశా – ఉత్తర కోస్తాల మధ్య తీరం దాటనుంది. ఈ కారణంగా ఇవాళ కోస్తాంధ్ర, తెలంగాణకు వాతావరణ శాఖ అధికారులు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. గురువారం, శుక్రవారం తెలుగు రాష్ట్రాలలో భారీ వర్షాలు ఉండే అవకాశం ఉందని చెప్పారు.

రాగల మూడు రోజులు తీరం వెంబడి 30 కిలోమీటర్లకు పైగా వేగంతో ఈదురు గాలులు వీస్తాయని తెలిపారు.

## జూబ్లీహిల్స్ అభ్యర్థి ఎంపిక.. నివేదిక ఇవ్వాలని మంత్రులకు సీఎం సూచన



హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించారు. దీనిపై నివేదిక ఇవ్వాలని ముగ్గురు మంత్రులకు ఆయన సూచించారు. తాజా రాజకీయ పరిస్థితులను వివరిస్తూ.. నివేదికలో అభ్యర్థుల పేర్లు, వివరాలు ఉండాలని పేర్కొన్నారు. గెలుపు గుర్రాన్ని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నిలబెట్టాలన్న కోణంలోనే నివేదిక ఉండాలని సీఎం పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికశాతం స్థానాలను కైవసం చేసుకోవాలని స్పష్టం చేశారు. ఈ అంశంలో ఇన్‌ఛార్జ్ మంత్రులతోపాటు ఎంపీల భాగస్వామ్యంతో వెళ్లాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డితో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కూడా సమావేశమై ఈ అంశంపై చర్చించారు.



## స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థంగా నిర్వహిస్తాం

హైదరాబాద్: రాష్ట్రంలో పోలీసు శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను త్వరగా భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరతామని నూతన డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. నూతన డీజీపీగా ఆయన లక్డీకపూల్‌లోని డీజీపీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. "రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. మాకు బలమైన జట్టు ఉంది. క్షేత్రస్థాయిలో సాంకేతికతను వినియోగించుకుంటాం. పోరాట మార్గం వీడేందుకు సిద్ధమని ఇటీవల నక్సల్స్ నేత లేఖ రాశారు. జనజీవన స్రవంతిలో కలిసిపోవాలని వారిని కోరుతున్నాం. మావోయిస్టుల సిద్ధాంతాలు ఆచరణలో విఫలమయ్యాయని భావిస్తున్నాం. లొంగిపోయిన వారికి అన్ని రకాలుగా అండగా ఉంటాం. రాష్ట్రంలో పోలీసుస్టేషన్ల సంఖ్య కంటే పోలీసుల్లో నైపుణ్యాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటాం. పోలీసు శాఖ ప్రత్యేక విభాగాల్లోని ఖాళీలను నిపుణులతో భర్తీ చేస్తాం" అని డీజీపీ తెలిపారు.

## ఆ రెండు పార్టీలకు ఓట్లు అడిగే అర్హత లేదు: రామచందర్‌రావు



కరీంనగర్: కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి పార్టీలకు ఓట్లు అడిగే అర్హత లేదని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించడంతోపాటు 2028 లో తెలంగాణలో అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఆయన చెప్పారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కేంద్రం రూ.40 వేల కోట్ల విలువైన ఎరువులను రాయితీపై ఇస్తుందని, ఎరువుల కొరతను అడ్డుకోలేని కాంగ్రెస్ ప్రభుత్వం.. కేంద్రంపై నెట్టడం సరికాదన్నారు. బీసీ రిజర్వేషన్లకు తాము కట్టుబడి ఉన్నట్లు చెప్పారు.



## శ్రీరామ సాగర్ ప్రాజెక్టుకు భారీగా వరద

నిజామాబాద్ జిల్లా శ్రీరామ సాగర్ ప్రాజెక్టుకు భారీగా వరద కొనసాగుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 3.40లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు 39 ప్రధాన గేట్లను ఎత్తి 2,59,937 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎస్కేప్ గేట్ల ద్వారా నాలుగు వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా నాలుగు వేల క్యూసెక్కులు, సరస్వతీ కాలువ ద్వారా 400 క్యూసెక్కుల వరదనీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,091 అడుగులు కాగా.. ప్రస్తుతం 1085.80 అడుగుల మేర నీటి నిల్వ ఉంది.




## పాక్‌సైన్యం భారీ ఆపరేషన్
# సొంత ప్రజలపైనే డ్రోన్లతో దాడులు

పాకిస్థాన్ భారీస్థాయిలో ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లు నిర్వహిస్తోంది. బలోచిస్థాన్ సొంత ప్రజల పైనే దాడులు చేస్తోంది. పాక్ సేనలు వాడుతోన్న శతఘ్నులు, మోర్టార్లతో కుజ్దార్ జిల్లాలోని జెహ్రీ ప్రాంత ప్రజలు వణికిపోతున్నారు.

నాలుగు రోజులుగా డ్రోన్లతో జరుగుతోన్న ఈ ఆపరేషన్‌తో ప్రజలు లాక్‌డౌన్‌లోకి వెళ్లిపోయారు. వారికి ఆహారం, ఇంధనం కొరత ఏర్పడిందని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. వరుస బాంబు దాడులతో పత్తి పొలాలన్నీ ధ్వంసమయ్యాయని, రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నాయి. ఛశ్మా ప్రాంతంలో శతఘ్నులు, మోర్టార్ల కారణంగా మరణాలు సంభవించినట్లు సమాచారం. ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడంతో పూర్తిస్థాయి సమాచారం అందుబాటులో లేదు. బలోచ్ లిబరేషన్ ఆర్మీ, బలోచిస్థాన్ లిబరేషన్ ఫ్రంట్ లక్ష్యంగా ఈ దాడులు జరుగుతున్నాయి. వాటి అధీనంలో ఉన్న జెహ్రీని తిరిగి స్వాధీనం చేసుకొనే లక్ష్యంతో పాక్ సేనలు ఈ దాడులు చేస్తున్నాయి. ఇటీవల కూడా పాక్ సొంత ప్రజలపై దాడులు చేసిన సంగతి తెలిసిందే. గతనెల ఖైబర్ పఖ్తున్‌ఖ్వాలోని మాత్రె దారా గ్రామంపై ఫైటర్ జెట్‌లు ఎల్ఎస్–6 రకం 8 బాంబులను జార విడిచాయి. దాంతో పదుల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయారు.

పాకిస్థాన్ చేపట్టిన ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లలో భాగంగా గతంలో ఈ ప్రావిన్స్‌లో దాడులు చేసింది. ఈ ఏడాది జనవరిలో అంతకుముందు నెలతో పోలిస్తే ఉగ్రదాడులు 42 శాతం పెరిగాయి. ఈ విషయాన్ని పాక్ ఇనిస్టిట్యూట్ ఫర్ కాన్ఫ్లిక్ట్ స్టడీస్ అండ్ సెక్యూరిటీ స్టడీస్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. బలోచిస్థాన్ తర్వాత అత్యధికంగా ఉగ్రదాడులు జరిగేది ఈ ప్రావిన్స్‌లోనే.



## మోదీ జీఎస్టీ సంస్కరణలు..
# తగ్గనున్న టారిఫ్‌ల ప్రభావం

ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ తీసుకువచ్చిన జీఎస్టీ, ఇతర సంస్కరణలు దేశ ఆర్థికవృద్ధిపై అమెరికా సుంకాల ప్రభావాన్ని కొంతమేర భర్తీ చేస్తాయని ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం రెండో భాగంలో సుంకాలకు సంబంధించిన పరిణామాలు తగ్గే అవకాశం ఉందన్నారు. 2026 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాలను 6.5 నుంచి 6.8 శాతానికి ఆర్బీఐ సవరించిందన్నారు. దీంతో అనుకూల పరిస్థితులు, తక్కువ ద్రవ్యోల్బణం, ద్రవ్య సడలింపుల ద్వారా ఆర్థిక వృద్ధి అంచనా స్థిరంగా ఉందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో దేశీయ ఆర్థిక కార్యకలాపాలు ఊపందుకున్నట్లు తెలిపారు.

మోదీ ప్రభుత్వం ప్రకటించిన వృద్ధిని ప్రేరేపించే విధాన సంస్కరణలు అమెరికా సుంకాల ప్రతికూల ప్రభావాలను ఎదుర్కోవడానికి సహకరిస్తాయని ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. సాఫ్ట్‌వేర్, సేవల ఎగుమతి బలంగా ఉందన్నారు. దేశంలోని 700.2 బిలియన్ డాలర్ల విదేశీ మారకపు (ఫారెక్స్) నిల్వలు 11 నెలల దిగుమతులను సరిచేయడానికి సరిపోతాయన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బలమైన చెల్లింపులు అవసరమన్నారు. ద్రవ్యోల్బణం గురించి మాట్లాడుతూ.. భారత ఆర్థికవ్యవస్థ అధిక వృద్ధిని నమోదు చేయడానికి సిద్ధంగా ఉందన్నారు.

**వడ్డీ రేట్లు యథాతథంగా ఉంచిన ఆర్‌బీఐ...** రూపాయి అంతర్జాతీయకరణకు ఆర్బీఐ మూడు ప్రతిపాదనలు. 1.రూపాయి ఆధారిత లావాదేవీలను పెంచే లక్ష్యంతో నేపాల్, భూటాన్, శ్రీలంకలోని ప్రవాసులకు భారత రూపాయిలలో రుణాలు ఇవ్వడానికి బ్యాంకులను అనుమతించాలని ఆర్బీఐ ప్రతిపాదించింది. 2. వాణిజ్యాన్ని సులభతరం చేయడానికి భారతదేశ ప్రధాన వాణిజ్య భాగస్వాముల కరెన్సీలకు పారదర్శక సూచన రేటును ఏర్పాటు చేయాలని సూచించింది. 3.అదనంగా, కార్పొరేట్ బాండ్లు, వాణిజ్య పత్రాలలో పెట్టుబడులను అనుమతించడం, ప్రాంతీయ వాణిజ్యంలో రూపాయి ఏకీకరణను ప్రోత్సహించడం ద్వారా స్పెషల్ రూపీ వోస్ట్రో ఖాతా బ్యాలెన్స్‌ల వినియోగాన్ని విస్తరించాలని సూచించింది.

## కేసీఆర్ రైతుబంధు పాలన రైతులకు స్వర్ణయుగం అని రుజువైంది: కేటీఆర్



హైదరాబాద్: పదేళ్లలో తెలంగాణలో రైతుల బలవన్మరణాలు తగ్గాయన్న జాతీయ నేర గణాంక విభాగం నివేదికపై భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. కేసీఆర్ రైతుబంధు పాలన రైతులకు స్వర్ణయుగం అని మరోమారు రుజువైందని పేర్కొన్నారు. అప్పటి ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు, ప్రాజెక్టుల వల్ల 2014 నుంచి 2023 మధ్య తెలంగాణలో రైతుల ఆత్మహత్యలు గణనీయంగా తగ్గాయని కేంద్ర ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయని వెల్లడించారు. "2014లో తెలంగాణలో రైతులు, కౌలుదారులు, రైతు కూలీల ఆత్మహత్యల సంఖ్య 1,347గా ఉంటే... అదే 2023లో 56గా ఉంది. 96 శాతం తగ్గుదల నమోదైంది. దేశంలోని రైతుల ఆత్మహత్యల్లో తెలంగాణ వాటా 2014లో 10.9 శాతం ఉంటే... 2023 నాటికి 0.51 శాతం తగ్గింది.

కానీ, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పరిస్థితి తారుమారైంది. రెండేళ్లలోనే సుమారు 700కు పైగా అన్నదాతల ఆత్మహత్యలు నమోదయ్యాయి" అని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు.

## కేటీఆర్ ప్రతీదీ రాజకీయం చేస్తున్నారు: ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి




బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రతిదీ రాజకీయం చేయొద్దని కాంగ్రెస్ పార్టీకి చెందిన జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అన్నారు. మీ పార్టీలో ఒక్క ఎమ్మెల్యే.. ఏ రోజైనా తనకు సంబంధించిన ఇష్యూ పైన మాట్లాడారా? అని ఆయన కేటీఆర్ ను సూటిగా ప్రశ్నించారు. ప్రజలకు కావాల్సిన అంశంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఏరోజైనా స్వేచ్ఛగా మాట్లాడారా? అని ఆయన నిలదీశారు. మా(కాంగ్రెస్) పార్టీలో, మా ప్రభుత్వంలో స్వేచ్ఛ ఎక్కువ అని చెప్పిన అనిరుధ్ రెడ్డి.. 'మా ప్రభుత్వానికి ప్రజలపై చిత్తశుద్ధి ఉంది. మీ పాలన.. నిరంకుశత్వ పాలన. మీది రౌడీయిజం పాలన. అది చూడలేకనే ప్రజలు మిమ్మల్ని.. మీ పార్టీని బొంద పెట్టారు. నేను పోరాటం చేసేది రైతుల కోసం, నా జడ్చర్ల నియోజకవర్గం ప్రజల కోసం. మీ ఎమ్మెల్యేలు రౌడీయిజం చేసేది ఫ్యాక్టరీల్లో వసూళ్ల కోసం, కమీషన్లు, భూకబ్జాల కోసం అని మీరు గమనించాలి' అని ఎమ్మెల్యే చెప్పుకొచ్చారు. తాను చెరువుల్లో చేపలు చనిపోతున్నాయని ముదిరాజుల కోసం ఫైట్ చేస్తున్నానని.. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు ఫ్యాక్టరీల్లో పొల్యూషన్ వచ్చినా వాళ్లకు కమీషన్ వస్తే చాలని, ఎప్పుడు కూడా ఈ సమస్య పై మాట్లాడలేదని మీరు గుర్తించాలని అనిరుధ్ రెడ్డి.. కేటీఆర్ ఉద్దేశిస్తూ వ్యాఖ్యానించారు.

# కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం

కాళేశ్వరం ప్రాజెక్ట్ పై రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. అన్నారం, సుందిళ్ల, మేడిగడ్డ బ్యారేజిలను మరమత్తు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో పునరుద్ధరణ డిజైన్ల కోసం టెండర్లకు ఆహ్వానం పలికింది. NDSA కమిటీ దర్యాప్తు ఆధారంగా రిహాబిలిటేషన్, రిపోర్టేషన్ డిజైన్లు చేయనుంది. డిజైన్ల కోసం అక్టోబర్ 15 మధ్యాహ్నం 3 గంటల వరకు గడువు విధించింది. కాగా అసెంబ్లీ ఎన్నికల ముందు మేడిగడ్డ బ్యారేజి కుంగిన సంగతి తెలిసిందే. కాళేశ్వరం ప్రాజెక్ట్ లో జరిగిన అవకతవకలపై కాంగ్రెస్ సర్కార్ విచారణకు ఒక కమిషన్ ను ఏర్పాటు చేసింది. ఇటీవల విచారణ ముగించిన ఘోష్ కమిషన్.. ప్రభుత్వానికి దాదాపు 600 పేజీలతో అందించింది. కమిషన్ ఇచ్చిన నివేదికను అసెంబ్లీలో చర్చకు పెట్టిన సీఎం రేవంత్ రెడ్డి.. నివేదిక ఆధారంగా కాళేశ్వరం స్కామ్ పై విచారణను సీబీఐ అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే ఈ కేసు విచారణను టేకప్ చేసిన సీబీఐ.. విచారణను ప్రారంభించింది. ఈ కేసులో విచారణలో భాగంగా FIR నమోదు చేసిన సీబీఐ.. త్వరలో కేసీఆర్, హరీష్ రావు, ఈటల రాజేంద్రతో సహా అధికారులను విచారిస్తుందనే వార్తలు వస్తున్నాయి. దీనిపై ఇంకా ఎక్కడ సీబీఐ అధికారిక ప్రకటన చేయలేదు.



చురకలు


# అంకుటిత దీక్షతో మెడికల్ సీటు సాధించిన అక్షర


## ఆత్మకూర్ గ్రామానికి గర్వకారణం - యాతాకుల కుటుంబానికి మరో విజయతాండవం






చురకలు ప్రతి నిధిహైదరాబాద్, అక్టోబర్, 01హైదరాబాద్ రాంనగర్ నివాసి, ఆత్మకూర్ గ్రామానికి చెందిన యాతాకుల కుటుంబపు ముద్దుబిడ్డ అక్షర మరో గొప్ప విజయాన్ని నమోదు చేసింది. పట్టుదలతో కృషి చేస్తూ, మెడికల్ ప్రవేశ పరీక్షలో అద్భుత ప్రతిభ కనబరిచి, రెండో దశ కౌన్సెలింగ్‌లో మల్లారెడ్డి మెడికల్ కాలేజీ (%CMRM%)లో ఎంబిబిఎస్ సీటు సంపాదించింది.యాతాకుల మంగమ్మ మనుమరాలు %-% చిన్నప్పటి నుంచే ప్రతిభ,యాతాకుల మంగమ్మ చిన్నకొడుకు అశోక్%-%ఉపేంద్రల కుమార్తె అక్షర, విద్యాభ్యాసంలో చిన్నప్పటి నుంచే ప్రతిభను ప్రదర్శించింది. కష్టపడి చదువుతూ %NEET% పరీక్షలో 360 మార్కులు, 2,92,382 ర్యాంక్ సాధించి వైద్యవిద్యలో అడుగుపెట్టే అవకాశం సొంతం చేసుకుంది.అక్షర విజయంతో ఆత్మకూర్ గ్రామానికి మరో మెడికల్ సీటు రావడం గ్రామ ప్రజలకు గర్వకారణంగా మారింది. గ్రామ పెద్దలు, బంధువులు, స్నేహితులు ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, "అక్షర కృషి, పట్టుదల, తల్లిదండ్రుల ప్రోత్సాహమే ఈ విజయానికి మూలం" అని అభిప్రాయపడ్డారు.డాక్టరై సమాజానికి సేవ చేయాలన్న అక్షర సంకల్పం.అక్షర మాట్లాడుతూ "నేను సాధించిన ఈ మెడికల్ సీటు వ్యక్తిగత విజయమే కాదు, నా కుటుంబం, నా గ్రామం, నా సమాజం కోసం సాధించిన విజయమని భావిస్తున్నాను. మంచి వైద్యురాలిగా ఎదిగి పేదలకు, గ్రామానికి సేవ చేయడం నా లక్ష్యం" అని తెలిపింది.కుటుంబ సభ్యుల ఆనందం, ప్రజల ఆశీర్వాదాలు,అక్షర సాధనతో యాతాకుల కుటుంబం సంతోషంలో మునిగిపోయింది. కుటుంబసభ్యులు ఆమె మరింత ఎత్తులకు చేరుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలు ఆమె విజయాన్ని ఘనంగా స్వాగతిస్తూ, భవిష్యత్తులో డాక్టరుగా వెలుగొందాలని ఆశీర్వదించారు.

# అక్టోబర్ 2...మద్రాసు ప్రెసిడెన్సీలో క్రిసెంట్ పత్రిక ప్రారంభ దినం




1844 అక్టోబరు 2న గాజుల లక్ష్మీనర్సు శెట్టి హిందువుల స్థితిగతులు మెరుగు పరిచేందుకు ఉద్దేశించిన పత్రిక క్రెసెంట్‌ను స్థాపించారు. మద్రాసు ప్రెసిడెన్సీలోకెల్లా భారతీయుని యాజమాన్యంలో మొదటి పత్రికగా ఇది చరిత్ర పుటల కెక్కింది. క్రెసెంట్‌ను ప్రారంభించింది మద్రాసులో స్థిరపడ్డ తెలుగువాడు కావడం విశేషం. గాజుల లక్ష్మీనర్సు శెట్టి లేదా గాజుల లక్ష్మీనరసింహ శ్రేష్టి (1806-1868) వ్యాపారి, భారత స్వాతంత్ర్య సమర యోధుడు, పౌరహక్కుల నాయకుడు, రాజకీయ నాయకుడు. దక్షిణ భారత దేశంలో ఆంగ్ల విద్య ప్రారంభానికి కృషిచేసిన వారిలో అత్యంత ముఖ్యులుగా గుర్తించ బడ్డారు. మద్రాసు ప్రెసిడెన్సీలో హిందువుల అణచివేత, క్రైస్తవ మత మార్పిడులు, ప్రభుత్వ మత పక్షపాతాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేసి విజయం సాధించిన నాయకుడు. 19వ శతాబ్ది మధ్య భాగంలో, క్రైస్తవ మిషనరీలు బహిరంగ మత మార్పిడులను మద్రాసు ప్రెసిడెన్సీలోని ప్రజా సంస్థల్లో, ప్రభుత్వ సంస్థల్లో చేపట్టేవి. వారి మత మార్పిడి కార్యకలాపాలు బ్రిటీష్ ఈస్టిండియా కంపెనీ అధికారుల అండతో జరిగేవి. ఆ క్రమంలోనే బ్రిటీష్ అధికారులు ఉద్యోగాల్లో ఉన్నత పదవుల నియామకంలో స్థానిక క్రైస్తవులనే హిందువుల కన్నా ఎక్కువగా ఎంచుకునే వారు. ఈ చర్య ద్వారా హిందువులను క్రైస్తవం వైపుకు ఆకర్షించేందుకు ప్రయత్నించే వారు. మద్రాసు ప్రభుత్వ మతవైఖరిని హిందువులు తరచుగా ఖండిస్తూండే వారు. వారిలో ఒకనిగా లక్ష్మీనర్సు హిందువుల వాదనను సమర్థిస్తూ మత మార్పిడులకు వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టారు. మద్రాసు ప్రభుత్వం మద్రాసు విశ్వ విద్యాలయ విద్యార్థులకు బైబిల్ ను ప్రామాణిక పాఠ్య గ్రంథంగా ప్రవేశపెట్టాలని ప్రయత్నించింది. విద్యార్థులను తరచుగా క్రైస్తవ మత సిద్ధాంతాలకు సంబంధించిన అంశాలపై బోధించే వారు. క్రైస్తవ గ్రంథ భాగాల విజ్ఞానం లేని వ్యక్తులను ప్రభుత్వ ఉద్యోగాల ఇంటర్వ్యూల్లో తిరస్కరించే వారు. ఈ ప్రమాణాలను మద్రాసు ప్రెసిడెన్సీలోని హిందువులు వ్యతిరేకించారు. ఆంగ్ల విద్య లేకపోవడం వలన భారతీయులు చెన్నపట్టణములో ఆంగ్లేయ అధికారులతో అనేక కష్టాలు పడ్డారని గాజుల లక్ష్మీనర్సు శెట్టి భావించారు. చెన్నపట్టణంలో ఉన్నవారిదే సర్వాధికారమని భారతీయులు భావిస్తూ, ఇంగ్లండులో వారికి పై అధికారులు ఉన్నారని తెలియక అన్యాయాలకు గురయ్యారు. లక్ష్మీనర్సు శెట్టి ఆ అన్యాయాల గురించి తెలుసుకొని వాటిని ఎదుర్కోవ డానికి చెన్నపట్టణ స్వదేశీ సంఘమును స్థాపించాడు. ఈ సంఘం యొక్క ముఖ్యోద్దేశం భారతీయులను ఆంగ్లేయుల అన్యాయాల గురించి చైతన్య వంతులను చేయడం. 1844 అక్టోబరు 2న లక్ష్మీనర్సు శెట్టి హిందువుల స్థితిగతులు మెరుగు పరిచేందుకు ఉద్దేశించిన పత్రిక క్రెసెంట్‌ను స్థాపించారు. మద్రాసు ప్రెసిడెన్సీలోకెల్లా భారతీయుని యాజమాన్యంలో మొదటి పత్రికగా ఇది చరిత్ర కెక్కింది. మద్రాసు రాష్ట్రంలో ఆంగ్ల పాలకుల దమన నీతిని నిరసిస్తూ, పక్ష పత్రిక ద్వారా ప్రజలను చైతన్య వంతులను చేసే ప్రయత్నం సాగింది. ఐతే స్థాపన నుంచి, పత్రిక ప్రభుత్వం నుంచి గట్టి వ్యతిరేకత ఎదుర్కోవలసి వచ్చింది. క్రిసెంట్ పత్రిక గురించి ప్రభుత్వ ప్రచురణయైన ఫోర్ట్ సెయింట్ జార్జ్ గెజిట్‌కు పంపిన ప్రకటన కూడా తిరస్కరించ బడింది. అనంతర కాలంలో, క్రైస్తవునిగా మత మార్పిడి పొందిన హిందువు తన పూర్వీకుల పరంపరా గతమైన ఆస్తిపై హక్కును కోల్పోడన్న చట్టం చేసేందుకు ప్రభుత్వం తీర్మానించింది. ఈ ప్రయత్నాన్ని లక్ష్మీనర్సు శెట్టి నాయకత్వంలో హిందూ సమాజం తీవ్రంగా ఖండిస్తూ, గవర్నర్‌కు 1845 ఏప్రిల్ 9న మెమోరాండం సమర్పించింది. ఆందోళన కారులతో జరిగిన సుదీర్ఘ చర్చల అనంతరం ఈ ప్రణాళి కలను గవర్నర్ విరమించు కున్నారు. 1846 అక్టోబరు 7న పచ్చయప్ప కళాశాలలో జరిగిన నిరసన సమావేశానికి లక్ష్మీనర్సు శెట్టి అధ్యక్షత వహించారు. ఈ సమావేశం మతవివక్ష, మత మార్పిడులకు ప్రభుత్వం అండగా వ్యవహరించడం వంటివి నిరసిస్తూ ఓ మెమోరాండం బ్రిటీష్ ఈస్టిండియా కంపెనీ కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్‌కు పంపుతూ తీర్మానించింది. వారి ప్రయత్నాలు సఫలీకృతమై క్రైస్తవ మత సిద్ధాంతాన్ని పాఠ్య ప్రణాళికలో చేర్చే ప్రయత్నాలు రద్దయ్యాయి. **రామ కిష్టయ్య సంగన భట్ల...9440595494**

# ప్రతిభా శాలియైన ఆర్థిక వేత్త సి.డి.దేశ్‌ముఖ్ - అక్టోబర్ 2... తొలి రిజర్వు బ్యాంకు గవర్నర్ సి.డి.దేశ్‌ముఖ్ వర్ధంతి



సి.డి.దేశ్‌ముఖ్ (జనవరి 14, 1896 – అక్టోబరు 2, 1982) పూర్తి పేరు చింతమన్ ద్వారకానాథ్ దేశ్‌ముఖ్ స్వతంత్ర భారత దేశపు తొలి రిజర్వ్ గవర్నర్‌గా నియమితులైన తొలి భారతీయుడిగా సిడి దేశ్‌ముఖ్‌ను ఎప్పటికీ గుర్తుంచు కుంటారు. భారతీయ నాటి కరెన్సీపై సిడి దేశ్ ముఖ్ సంతకాన్ని చూడవచ్చు. భారతీయ రిజర్వ్ బ్యాంక్ మూడవ గవర్నర్, 1943, ఆగస్టు 11 నుంచి 1949, జూన్ 30 వరకు ఆ పదవిని నిర్వహించారు. ఆ తర్వాత దేశ్‌ముఖ్ భారత దేశానికి ఆర్థిక మంత్రిగా నియమితులైనారు. అంతర్జాతీయ ద్రవ్యనిధిలో సంవత్సరానికి 30వేల డాలర్ల వేతనం కాదని దేశసేవకే తన జీవితాన్ని ఆయన అంకితం చేసిన గొప్ప సామాజిక సేవకుడు. ప్లానింగ్ కమిటీ సభ్యుడుగా ఉంటూనే ఆర్థికమంత్రిగా ఉన్నా ప్రతిభాశాలి. బొంబాయి నగరాన్ని కేంద్రం అధీనంలో ఉంచడం ఇష్టపడక దేశ్‌ముఖ్ మంత్రి పదవికి రాజీనామా చేసిన నిబద్ధత కలిగిన రాజకీయ నాయకుడు. భారత ఆర్థికమంత్రులలో సి.డి. దేశ్‌ముఖ్ అత్యంత ప్రతిభావంతుడు. ఆయన హయాంలో దేశంలో విదేశీ మారక కొరతలేదు. లోటు బడ్జెటు ప్రస్తావన రాలేదు. ద్రవ్యోల్బణం రేటు చెర్రితలు వేయలేదు. అంతర్జాతీయ మార్కెట్లో మన రూపాయి విలువ తగ్గలేదు. ఇండియన్ సివిల్ సర్వీస్ సభ్యుడైన దేశ్‌ముఖ్ కు 1939 నుంచే రిజర్వ్ బ్యాంక్తో సంబంధం ఉంది. 1941లో రిజర్వ్ బ్యాంక్ డిప్యూటి గవర్నర్ గా నియమించ బడ్డారు. 1943లో, ఆ తర్వాత జేమ్స్ టేలర్ నుంచి 3 వ గవర్నర్ గా బాధ్యతలు తీసుకున్నారు. దేశ్‌ముఖ్ గవర్నర్ గా ఉన్న సమయంలో ప్రపంచంలో ముఖ్యమైన ఆర్థిక పరిణామాలు సంభవించాయి. 1943లో రిజర్వు బ్యాంకు గవర్నర్ టెయిలర్ మరణించగా, డిప్యూటీ గవర్నరుగా ఉన్న సి.డి. దేశ్‌ముఖ్‌ని ఏకగ్రీవంగా గవర్నరుగా ఎన్నుకున్నారు. రిజర్వు బ్యాంక్ గవర్నరుగానూ దేశ్‌ముఖ్ దేశానికి ఎంతో సేవ చేశారు. జూలై 1944లో జరిగిన బ్రెట్టన్ వుడ్స్ సమావేశంలో అతడు కూడా భారత దేశం తరఫునన పాల్గొన్నారు. ఈ సమావేశమే అంతర్జాతీయ ద్రవ్య సంస్థ, ప్రపంచ బ్యాంకు ఏర్పడడానికి కారణమైంది. ఈ రెండు సంస్థల లోనూ దేశ్‌ముఖ్ బోర్డ్ ఆఫ్ గవర్నర్ గా పదేళ్ళ పాటు పనిచేశారు. 1950లో పారిస్లో జరిగిన ఈ రెండు సంస్థల వార్షిక సంయుక్త సమావేశానికి ఇతడు ఛైర్మెన్ గా వ్యవహరించారు. 1945లో సిమ్లా సమావేశంలో వైస్రాయ్ సభ సభ్యులంతా భారతీయులే ఉండాలని తీర్మానించారు. ఆ జాబితాలో ఆర్థిక సభ్యుడుగా దేశ్‌ముఖ్ పేరు చేయాలని ప్రయత్నించారు. కానీ దేశ్‌ముఖ్ తనకు రాజకీయాలు పడవని తప్పించు కున్నారు. 1950లో ప్లానింగ్ కమిషన్ ఏర్పడింది. ఆ బాధ్యత దేశ్‌ముఖ్ మీద పడింది. అదే సంవత్సరం డా. జాన్ మత్తయ్ ఆర్థికమంత్రిగా రాజీనామా ఇచ్చినప్పుడు దేశ్‌ముఖ్ ఆ స్థానం పొందారు. ప్లానింగ్ కమిటీ సభ్యుడుగా ఉంటూనే ఆర్థికమంత్రిగా ఉ న్నారు. 1953 జనవరి 22న దేశ్‌ముఖ్ వివాహం దుర్గాబాయి తో జరిగింది. అది దేశంలో గొప్ప సంచలనం సృష్టించింది. వారి పెళ్ళిపత్రంపై నెహ్రూ, కృపలానీ దంపతులు సాక్షులుగా సంతకాలు చేశారు. దుర్గాబాయితో వివాహం జరిగిన తర్వాత మొదటి జన్మదినాన్ని ఆయన తన ఇంట్లో చాలా నిరాడంబరంగా జరుపు కున్నారు. ఈ సంగతి నెహ్రూకు తెలిసి, తీరిక చేసుకొని నెహ్రూ వాళ్ళ ఇంటికి వెళ్లారట. 'ఏం దుర్గాబాయ్! దేశ్‌ముఖ్ నీ భర్తే కావచ్చు... నా కాబినెట్ మంత్రి సుమా!' అని చమత్కరించారట. ఆ దంపతులు ఇచ్చిన టీ బిస్కెట్ తీసుకుని నెహ్రూ మందహాసంతో వెళ్లిపోయారట. ఇలాంటి ఆప్యాయత ఈ రోజుల్లో కనిపించడం అరుదు. తన నియోజకవర్గం ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా బొంబాయి నగరాన్ని కేంద్రం అధీనంలో ఉంచడం ఇష్టపడక దేశ్‌ముఖ్ మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత ఆయన ఢిల్లీ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్‌గా ఆరేళ్లు చేశారు. దేశ్‌ముఖ్ సేవలను అంతర్జాతీయ ద్రవ్యనిధి వినియోగించు కోవాలని కోరినప్పుడు అందుకు ఆయన అంగీకరించలేదు. అప్పటికే దేశ్‌ముఖ్ దంపతులు సంక్షేమ కార్యక్రమాలను దేశమంతా విస్తరించి ఉన్నారు. సంవత్సరానికి 30వేల డాలర్ల వేతనం కాదని దేశసేవకే తన జీవితాన్ని ఆయన అంకితం చేశారు. ఇన్ని ఉద్యోగాలు చేసిన ఆయన ఎల్లప్పుడూ నిస్పృహ. కూడబెట్టిన ధనమంతా పూణేలో ఉన్న ఇల్లు మాత్రమే. 1952లో దేశ్‌ముఖ్ విద్యాభ్యసించిన కేంబ్రిడ్జి విశ్వ విద్యాలయపు జీసస్ కళాశాల నుంచి గౌరవ ఫెలోగా ఎన్నికైనారు. 1959లో ప్రభుత్వ సర్వీసు రంగంలో రామన్ మెగ్సేసే అవార్డును ఫిలిప్పీన్స్ కు చెందిన జోస్ అగ్యిలార్ తో కల్సి సంయుక్తంగా పొందారు. 1975లో భారత ప్రభుత్వం పద్మ విభూషణ పురస్కారంతో సత్కరించారు. అదే సంవత్సరం ఆయన సతీమణి దుర్గాబాయి దేశ్‌ముఖ్ కూడా పద్మ విభూషణ్ పొందడం, భార్యా భర్తలు ఇద్దరూ ఒకే ఏడాది పురస్కార గ్రహీతలు కావడం విశేషం. 1982, అక్టోబరు 2న మరణించారు.
**రామ కిష్టయ్య సంగన భట్ల...9440595494**

# దేవతలకు రూపాలిచ్చిన కళాతపస్వి రవి వర్మ - అక్టోబర్ 2... రాజా రవివర్మ వర్ధంతి



"రవివర్మకే అందని ఒకే ఒక అందానివో", "రవి చూడని పాడని నవ్య నాదానివో" అంటూ "రావణుడే రాముడైతే" చిత్రం (1980) కోసం, వేటూరి సుందర రామమూర్తి కలం నుండి జాలువారి, బాలు – జానకి గళాల నుండి అలవోకగా, సుమధురంగా గానం చేయబడిన పాట, సంగీత ప్రియులకు సుపరిచితమే. చిత్రకళకు ప్రపంచ వ్యాప్త గుర్తింపు తెచ్చిన చిత్రకారుడు రాజా రవివర్మ (29 ఏప్రిల్ 1848 – 2 అక్టోబర్ 1906 ). హైందవ సంస్కృతిలో అంతర్భాగమైన రామాయణ, మహాభారత ఆది పురాణాలలో ఘట్టాలను, చిత్రాలుగా మలిచి, గుర్తింపు పొందారు రాజా రవివర్మ. భారతావని లోని కేరళలో తిరువనంత పురానికి 25 మైళ్ల దూరంలోని కిలమానూరు, రాజ ప్రాసాదంలో ఉమాంబ తాంబుతాట్టి, నీలకంఠం భట్ట దంపతులకు 1848 ఏప్రిల్ 29న రవివర్మ జన్మించారు. చిన్నతనంలోనే ఈయన చూపిన ప్రతిభ వల్ల, ట్రావెన్కోర్ మహారాజా అయిల్యం తిరునాళ్ చేరదీసి, ప్రోత్సహించారు. అక్కడి ఆస్థాన చిత్రకారుడైన, శ్రీ రామ స్వామి నాయుడు వద్ద శిష్యరికం చేశాడు. చిత్రకళను బ్రిటిష్ దేశస్థుడైన, థియోడార్ జెన్సన్ వద్ద నేర్చుకున్నారు. పాశ్చాత్య చిత్రకళలోని శక్తి, కొట్టొచ్చినట్లున్న భావ వ్యక్తీకరణ, రవి వర్మను ఎంతగానో ప్రభావితం చేశాయి. అవి భారతీయ చిత్రకళా శైలికి ఎంతో భిన్నంగా కనిపించాయి. 1873 వియన్నా చిత్ర ప్రదర్శనలో, మొదటి బహుమతి పొందిన తర్వాత రవి వర్మ వెలుగులోకి వచ్చారు. ఆయన తన చిత్రాలను, దక్షిణభారత స్త్రీల లాగా ఊహించి, అందంగా చిత్రించే వాడు. ముఖ్యంగా మహాభారతం లోని నల దమయంతుల, శకుంతల దుష్యంతుల కథలలోని ఘట్టాలను, చిత్రాలుగా చిత్రించి ఎంతో పేరు సంపాదించారు. భారతీయుల ఊహలలో, తమ పురాణాలలో ఉన్న పాత్రలు రవివర్మ రూప కల్పన చేసిన చిత్రాల్లాగా మారి పోయాయి అంటే అతిశయోక్తి లేదు. రవివర్మ తరుచుగా తన శైలిలో ప్రదర్శ నాత్మకంగాను, చాందసంగాను ఉంటాడన్న విమర్శలను ఎదుర్కొన్నా, ఆయన పనితనం భారత దేశంలో ప్రశంసా పాత్రమై, కీర్తి గడించింది. 1894లో లితో గ్రాఫిక్ యంత్రాలు, చిత్రించడానికి అనువైన రాళ్లు, సాంకేతిక నిపుణులను, జర్మనీ నుండి ఆయన తెప్పించారు. దేశంలోనే మొదటిసారిగా అత్యాధునిక ప్రెస్ ను ముంబైలో ప్రారంభించారు. అయితే అక్కడ స్థలాభావం కారణంగా, భయంకరమైన ప్లేగు వ్యాపించడం వల్ల, కార్మికులు సరిగా లభించక పోవడం వల్ల 4 సంవత్సరాల తర్వాత, మహారాష్ట్ర లోని కొండా కోనల నడుమ ఉన్న, మలవాలి అనే గ్రామాన్ని పెంచుకున్నారు. పక్కనే తన నివాసాన్ని కూడా ఏర్పరచు కున్నారు. రవి వర్మ మరణించడానికి రెండేళ్ళ ముందు, తాను నెలకొల్పిన ప్రెస్ ను, తన స్నేహితుడైన ఒక జర్మన్ సాంకేతిక నిపుణునికి విక్రయించారు. దాంతోపాటు 100 చిత్రాలకు కాపీరైట్ కూడా ఇచ్చి వేసారు. అయితే 1972లో జరిగిన ఘోర అగ్ని ప్రమాదం కారణంగా, ప్రెస్ కు భారీ నష్టం వాటిల్లింది. ఆ తర్వాత మిగిలిన చిత్రాలను రాళ్ళను, ప్రెస్ చుట్టూ నివసించే వారికి పంచి పెట్టారు. ఆ తర్వాత ముంబై–పూణే ప్రభుత్వాలు కొన్నిటిని మాత్రమే భద్ర పరచ గలిగాయి. శ్రీకృష్ణ రాయబారము, రావణ జటాయు వధ, ఇంద్రజిత్ విజయము, శకుంతల, సుభ ద్రార్జునులు, దమయంతికి హంస సంవాదము, శంతనుడు మత్స్యగంధి, ప్రేమలేఖ వ్రాస్తున్న శకుంతల, కణ్వుని ఆశ్రమములో రుషి కన్యగా శకుంతల, ఇంద్రజిత్ విజయము, లేడీ విత్ ఫ్రూట్స్, హార్ట్ బ్రోకెన్, పల్లెపడుచు, భిక్షకుల కుటుంబము గుడి వద్ద దానాలు స్త్రీ లాంటి అపురూప చిత్రాలు రాజా రవివర్మ కు పేరు ప్రఖ్యాతులు తెచ్చి పెట్టాయి. **రామ కిష్టయ్య సంగనభట్ల**

# ప్రజలతో మమేకమైన నేత సోలిపేట - అక్టోబర్ 2... సోలిపేట రామలింగారెడ్డి జయంతి




తెలంగాణ ఉద్యమంతో మమేకమైన చిత్తశుద్ధి గల నాయకుడు సోలిపేట రామలింగారెడ్డి. నిత్యం ప్రజల మధ్యనే మనుగడ సాగించిన నిరాడంబర నేతగా ప్రజల హృదయాల్లో రామలింగారెడ్డి చెరగని ముద్రవేసారు. సోలిపేట రామలింగారెడ్డి (అక్టోబరు 2, 1961 – ఆగస్టు 6, 2020) తెలంగాణ రాష్ట్ర సమితికి చెందిన రాజకీయ నాయకులు, ప్రముఖ పాత్రికేయులు, జర్నలిస్టు సంఘ నేతగా సుపరిచితులు. తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ తరపున 2004, 2008 (ఉపఎన్నిక)లలో దొమ్మాట శాసనసభ నియోజకవర్గం నుండి 2014, 2018 ఎన్నికల్లో దుబ్బాక శాసనసభ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1962 అక్టోబర్ 2 న సిద్ధిపేట జిల్లాదుబ్బాక మండలంలోని చిట్టాపూర్ లోని సామాన్యరైతు కుటుంబంలో జన్మించిన రామలింగారెడ్డి విద్యార్థి దశ నుంచే ప్రజా ఉద్యమాల వైపు ఆకర్షితులయ్యారు. ప్రజల హక్కులను కాపాడడానికి పత్రికలు ఉపయోగపడతాయనే విశ్వాసంతో జర్నలిస్టు వృత్తిని ఎంచు కున్నారు. వామపక్ష భావాలతో ప్రేరితు లైన రామలింగారెడ్డి మెదక్ జిల్లాలో ఎగిసి పడిన ఉద్యమాలకు బాసటగా నిలిచారు. జర్నలిస్టు సంఘం నాయకుడిగా కూడా రామలింగారెడ్డికి ప్రత్యేక స్థానం పొందారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం రామలింగారెడ్డి రాజీలేని పోరాటాలు చేశారు. తను నమ్మిన ఆదర్శాలను ఆచరణలో పెట్టిన అభ్యుదయవాది సోలిపేట. వరకట్నం, తదితర ఆడంబరాల ప్రసక్తి లేకుండా సభావివాహం చేసుకున్నారు. ప్రజాకవి కాళోజితో పాటు, ఆనాటి సిద్ధిపేట శాసనసభ్యులైన నేటి తెలంగాణ ముఖ్యమంత్రి కేసిఆర్ సమక్షంలో చేతుల వివాహం జరిగింది. ఆదర్శాన్ని తనవరకే పరిమితం చేయకుండా తన పిల్లలకు కూడా అదే పద్ధతిలో వివాహాలు జరిపించిన ఆచరణశీలి సోలిపేట. పాఠశాల స్థాయిలోనే ఉద్యమాలపై ప్రేమ పెంచుకున్న రామలింగారెడ్డి, ఇంటర్ తరువాత అర్.ఎస్.యు. (రాడికల్ స్టూడెంట్స్ యూనియన్) జిల్లా అధ్యక్షుడిగా పని చేశారు. ప్రజా సమస్యల్లో పాలుపంచు కుంటూ వస్తున్న క్రమంలో పోలీసుల నుంచి కూడా ఎన్నో ఇబ్బందులు ఎదుర య్యాయి. 1991లో టాడా కేసు పెట్టారు. విప్లవ సాహిత్యంతో పాటు బాంబులు దొరికాయని, నక్సలైట్ గా పనిచేస్తున్నారని కేసు పెట్టి నిర్బంధంలో ఉంచి చిత్రహింసలకు గురి చేశారు. నాలుగు రోజులకు సెంట్రల్ జైల్ కు తరలించారు. ఈ క్రమంలోనే దేశ, రాష్ట్రంలో జర్నలిస్టులు, ప్రజా సంఘాలు ఉద్యమాలు చేపట్టాయి. లండన్ లో కూడా ఉద్యమాలు జరిగాయి. కేంద్ర మానవ హక్కుల కమిషనర్ రంగరాజన్ జోక్యంతో కోర్టు విచారణలో పోలీసులు తప్పుడు కేసు పెట్టారని తేలడంతో నిర్దోషిగా బయటకు వచ్చారు. 1983 తరువాత ఉదయం దినపత్రికలో రిపోర్టర్ గా చేరాడు. వార్త రిపోర్టర్ గా కొనసాగుతూ ఎపియుడబ్ల్యుజె (జర్నలిస్టు యూనియన్) జిల్లా అధ్యక్షుడిగా రెండుసార్లు పనిచేశారు. జహీరాబాదులో, సిద్ధిపేటలో వార్త విలేఖరిగా పనిచేశారు. సుమారు 25 ఏళ్ళు పాత్రికేయునిగా పనిచేసిన రామలింగారెడ్డి కేసీఆర్ పిలుపుమేరకు రాజకీయాల్లోకి వచ్చాడు. 2004లో తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ తరపున ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో దొమ్మాట శాసనసభ నియోజకవర్గం నుండి పోటిచేసి ఎన్నికై తొలిసారిగా శాసనసభలో అడుగుపెట్టారు. 2008 ఉప ఎన్నికల్లో కూడా ఎన్నికయిన రామలింగారెడ్డి, 2009 ఎన్నికల్లో ఓడిపోయారు. ప్రజాసేవలో నిమగ్నమౌతూనే, ఇతర మెదక్ జిల్లాలో తెలంగాణ ఉద్యమ నిర్మాణంలో రామలింగా రెడ్డి చురుకైన పాత్ర పోషించారు. సమైక్యవాద నాయకులు కల్పించే ప్రలోభాలకు లొంగకుండా చెదరని సంకల్పంతో పోరాటంలో నిలిచారు. ఉద్యమ ప్రయోజనాలకోసం నాయకత్వం నిర్దేశించినప్పుడు తన ఎంఎల్ఎ పదవికి రాజీనామా చేయడానికి ఇసిద్ధపడ్డారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత 2014లో దుబ్బాక శాసనసభ నియోజకవర్గం నుండి పోటిచేసి కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు ముత్యంరెడ్డిపై 37,925 ఓట్ల తేడాతో గెలుపొందారు. 2018లో జరిగిన ముందస్తు తెలంగాణ శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి మద్దుల నాగేశ్వరరెడ్డిపై 62,500 ఓట్ల తేడాతో గెలుపొందారు. శాసనసభ అంచనాల కమిటీ ఛైర్మన్‌గా కూడా పనిచేశారు. సిద్ధిపేటలోని జర్నలిస్టు కాలనీలో ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో కట్టుకున్న సాధారణమైన ఇంట్లోనే చివరిదాకా నిరాడంబరంగా జీవించారు. ఉదయం లేచింది మొదలు నియోజకవర్గ ప్రజల బాగోగులు చూడడం, సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం నిత్య కృత్యంగా పెట్టుకుని, ప్రజల కోసం పనిచేసే జీవన విధానంగా ఎంచుకున్న అరుదైన నాయకుడు రామలింగారెడ్డి. మధుమేహ వ్యాధితో బాధపడుతున్న రామలింగారెడ్డి కాలికి గాయమై అది ప్రమాదకరంగా పరిణమించడంతో గత ఆగస్టు 5 వ తేదీన అర్ధరాత్రి దాటాక గుండెపోటుతో తుది శ్వాస విడిచారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# గాంధేయ భావజాలానికి ప్రతిరూపం... ఖైదీల సంక్షేమ దినోత్సవం

## అక్టోబర్ 2... మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా జైళ్లలో ఖైదీల సంక్షేమ దినోత్సవం



అక్టోబర్ 2 మహాత్మా గాంధీ జయంతి సందర్భం దేశ ప్రజలకు స్వాతంత్ర్య స్ఫూర్తిని, సత్యం%-%అహింస సిద్ధాంతాలను మాత్రమే కాదు, మానవతా దృక్పథాన్ని కూడా గుర్తు చేస్తుంది. అదే సందర్భంలో దేశవ్యాప్తంగా జైళ్లలో ఖైదీల సంక్షేమ దినోత్సవం నిర్వహించడం విశేషం. గాంధీజీ జీవితం జైలు అనుభవాలతో ముడిపడి ఉంది. స్వాతంత్ర్య పోరాటంలో ఆయన ఎన్నో సార్లు నిర్బంధించ బడ్డారు. అయితే ఆయన దృష్టిలో జైలు శిక్ష కేవలం శిక్ష మాత్రమే కాదు, ఆత్మ పరిశీలనకు, నైతిక సవరింపులకు, సమాజాన్ని అర్థం చేసుకోవడానికి ఒక పాఠశాల. ఖైదీల పట్ల ద్వేషం చూపకుండా మానవతా విలువలతో వ్యవహరించడం సమాజాన్ని ఆరోగ్యవంతం చేస్తుందని ఆయన నమ్మారు. ఈ ఆలోచనలే నేటి ఖైదీల సంక్షేమ దినోత్సవానికి మూల ప్రేరణ. ప్రస్తుతం భారత దేశంలో సెంట్రల్ జైళ్లు, జిల్లా జైళ్లు, సబ్ జైళ్లు, ప్రత్యేక నిర్బంధ కేంద్రాలు కలిపి 1,300 పైగా జైలు సంస్థలు ఉన్నాయి. 2023 నాటి జైలు గణాంకాల ప్రకారం దేశంలో 5,54,000 మందికి పైగా ఖైదీలు ఉన్నారు. వీరిలో సుమారు 77 శాతం మంది ఇంకా తీర్పు వెలువడని అండర్ ట్రయల్స్ వర్గానికి చెందినవారే. అంటే వారు నేరం రుజువు కాకముందే దీర్ఘకాల నిర్బంధంలో ఉండి పోతున్నారు. జైళ్ల సామర్థ్యం సుమారు 4.5 లక్షల వరకు మాత్రమే ఉన్నందున ఆక్రమణ రేటు 120 శాతానికి పైగా ఉంది. దీని వలన మౌలిక సౌకర్యాల లోపం, ఆరోగ్య సమస్యలు, ఆహార లోపాలు, మానసిక ఒత్తిడి వంటి ఇబ్బందులు పెరుగుతున్నాయి. ఈ వాస్తవికతలో ఖైదీల సంక్షేమం, సవరింపులు, పునరావాసం మరింత అత్యవసరంగా మారాయి. అక్టోబర్ 2న జైళ్లలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఖైదీలకు ఆరోగ్య శిబిరాలు, కంటి పరీక్షలు, రక్తదాన కార్యక్రమాలు, మానసిక వైద్య సలహాలు అందిస్తారు. వృత్తి శిక్షణా కేంద్రాల్లో కొత్త కోర్సులు ప్రారంభించి, కొన్నిచోట్ల కంప్యూటర్ శిక్షణ, కుట్టు, చెక్కపని, ముద్రణల వంటి ఉపాధి అవకాశాలకు ఉపయోగపడే శిక్షణ ఇస్తారు. ఖైదీలు సృజనాత్మకతను ప్రదర్శించే హస్తకళల ప్రదర్శనలు, క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తారు. కుటుంబ సభ్యులను కలిసే అవకాశం ఇవ్వడం వల్ల మానసిక ఉపశమనం లభిస్తుంది. కొన్నిచోట్ల ప్రత్యేక భోజన ఏర్పాట్లు, నూతన దుస్తులు పంపిణీ కూడా చేస్తారు. ఇవన్నీ ఖైదీల మనసుల్లో ఆశాజ్యోతి వెలిగించే ప్రయత్నాలుగా నిలుస్తాయి. జైలు వ్యవస్థలో ఉన్న ప్రధాన సమస్యలు అధిక జనసాంద్రత, తీర్పు ఆలస్యం, మానసిక ఆరోగ్య సేవల లోపం, సామాజిక అవమానం. ఈ సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం రూపొందించిన Model Prison Manual (2016) ఒక మార్గదర్శకంగా ఉంది. ఇందులో ఖైదీల హక్కులు, మౌలిక సదుపాయాలు, పునరావాస విధానాలపై దృష్టి పెట్టబడింది. అయినప్పటికీ అమలు విషయంలో రాష్ట్రాల మధ్య తేడాలు కనిపిస్తున్నాయి. తిహార్ జైలు వంటి కొన్ని కేంద్రాలు పునరావాస కార్యక్రమాల్లో ముందంజలో ఉన్నాయి. అక్కడ గాంధీయ అధ్యయన కేంద్రం, వృత్తి శిక్షణా విభాగాలు, పుస్తక పఠనశాలలు ఏర్పాటు చేయబడ్డాయి. కొందరు ఖైదీలు అక్కడి నుంచి డిగ్రీలు, డిప్లొమాలు పూర్తి చేసి సమాజంలో తిరిగి స్థిరపడు తున్నారు. ప్రైవేటు సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు కూడా ఈ పనిలో భాగస్వామ్యం అవుతూ ఖైదీల పునరావాసానికి తోడ్పడుతున్నాయి. ఖైదీల సంక్షేమ దినోత్సవం ఒక రోజుకు పరిమితమయ్యే ఉత్సవం కాదు. ఇది సమాజానికి గుర్తు చేసే నినాదయిఖైదీ కూడా మానవుడే, అతనికి సవరించు కోవడానికి, తిరిగి సమాజంలో నిలబడడానికి హక్కు ఉంది. వేగవంతమైన న్యాయ సేవలు, చిన్న నేరాలకు సులభతరమైన బెయిల్ విధానం, మానసిక ఆరోగ్య సహాయం, వృత్తిపరమైన శిక్షణా అవకాశాలు, విడుదల అనంతరం ఉపాధి భరోసా ఇవన్నీ ఖైదీకి తిరిగి జీవనోపాధి కల్పించగల మార్గాలు. మహాత్మాగాంధీ చూపించిన సత్యం, అహింస, క్షమ అనే విలువలే ఖైదీల సంక్షేమ దినోత్సవానికి ఆత్మ. శిక్ష అనేది ప్రతీకార పద్ధతి కాక పునరుద్ధరణ సాధనం కావాలి. జైలు ఒక శిక్షా స్థలమే కాదు, జీవన పాఠశాల కావాలి. ఖైదీ సమాజంలో తిరిగి సత్పౌరుడిగా నిలబడేలా చేయడం ప్రభుత్వ, న్యాయ వ్యవస్థ, సమాజం అంతా కలసి భుజానికెత్తు కోవలసిన బాధ్యత. అక్టోబర్ 2న జరుపుకునే ఖైదీల సంక్షేమ దినోత్సవం ఈ మార్గంలో మానవత్వపు కాంతి దీపంలా నిలుస్తుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల...9440595494**

చురకలు

## సంపాదకీయం

# ఇళయ దళపతి విజయ్‌కి ఇప్పుడు అర్థమవుతోందా ?

రాజకీయాలు అంటే క్యాట్ వాక్ కావు. రీల్ లైఫ్ కి రియల్ లైఫ్ కి ఎంతో తేడా ఉంది. సినిమాల్లో ఒక హీరో ఏమైనా చేయగలడు. అదే రాజకీయాలు ప్రజా జీవితంలో రియల్ లైఫ్ లో చేయాలంటే చాలా కష్టాలు పడాలి. వెండి తెర అభిమానం ఓటర్ల ప్రేమగా కన్వర్ట్ కావాలంటే ఎన్నో చేయాలి. రీల్ హీరోతో ప్రజల కనెక్షన్ కేవలం మైండ్ వరకే. మరి రీల్ లైఫ్ లో నాయకుడుగా ప్రజల గుండెలలో స్థానం సంపాదించుకోవాలి. ఇదంతా ఎందుకు అంటే సినిమా స్టార్ల విషయంలో రాజకీయాల్లో వారి ఆసక్తి అనురక్తిని చూసినపుడు వచ్చే విశ్లేషణలు.

**అదే డిస్అడ్వాంటేజ్ గా :** సినిమా హీరోలకు జనాలు విపరీతంగా వస్తారు. అది వారికి ఒక దశ వరకూ అడ్వాంటేజ్‌గా ఉంటుంది. కానీ తరువాత డిస్ అడ్వాంటేజ్‌గా మారుతుంది. ఏపీలో చూస్తే పవర్ స్టార్ పవన్‌కి విపరీతమైన ఫాలోయింగ్ ఉంది. ఆయన కూడా ప్రజలలోకి వచ్చి సభలు నిర్వహించేటపుడు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటూంటారు. అయితే సరిగ్గా సభలు నిర్వహణ చేసుకోవడంలో జనసేన సక్సెస్ అయింది. అంతే కాదు జనసేన మొదటి నుంచి ఒక రాజకీయ పార్టీగా వ్యవహరించడం మొదలెట్టింది. విమర్శలకు ప్రతి విమర్శలు చేయడమే కాదు ఎక్కడ స్పందించాలి ఎలా ఎపుడు ఏమి చేయాలి అన్న దాని మీద ఒక క్లారిటీతో వ్యవహరించింది.

కానీ ఇక్కడే విజయ్ స్థాపించిన టీవీకే పార్టీ ఇబ్బందులు పడుతోంది అని అంటున్నారు.

**యువ నేతగా ఉంటూ :** ఇక విజయ్ విషయానికి వస్తే ఆయనకు ఇలయదళపతి అన్న బిరుదు ఉంది. దాని అర్థం యువ నాయకుడు అని. నిజానికి తమిళనాడుకు ఆయన యువ నేతగానే ఉన్నారు ఏడున్నర పదుల వయసులో సీఎం స్టాలిన్ ఉన్నారు. మిగిలిన నేతలు అంతా కూడా ఆరు పదులు దాటిన వారే. ఈ నేపథ్యంలో సీఎం సీటుకి పోటీ పడే 51 ఏళ్ల పిన్న వయసు కలిగిన నేతగా విజయ్ ఉన్నారు ఆయన పట్ల యువత అభిమానం ఆకర్షణ కూడా అదే స్థాయిలో ఉంది. అయితే ఈ జనాదరణను సరిగ్గా మల్చించుకుంటే ఆయన అద్భుతాలు చేసేవారేమో. కానీ కరూర్ దుర్ఘటన మాత్రం టీవీకే పార్టీని పూర్తిగా సంక్షోభంలోకి నెట్టేసింది అని అంటున్నారు.

**చెప్పలుడినట్లుగా :** అతి పెద్ద ఘటన జరిగింది. ఏకంగా 41 మంది దాకా మృత్యువాత పడ్డారు. ఇందులో మహిళలు చిన్నారులు పెళ్లి కావాల్సిన యువ జంటలు ఇలా ఎందరో ఉన్నారు. ఈ కన్నీటి విషాదం తరువాత టీవీకే స్పందించిన తీరు మాత్రం విమర్శల పాలు అవుతోంది. తిరుచ్చి ఎయిర్ పోర్టుకు వచ్చి అదే రాత్రి అక్కడ నుంచి చెన్నైకి చేరుకుని తన ఇంట్లో టీవీకే అధినేత విజయ్ గత కొన్ని రోజులుగా గడుపుతున్నారు. ఆయన మొదట ఈ విషాదం మీద ట్వీట్ ఒకటి చేశారు. తాజాగా ఒక వీడియో బైట్ వదిలారు. అందులో ఆయన సీఎం స్టాలిన్ మీద విమర్శలు చేశారు.

**గుండె బద్దలైంది అంటూ :** ఇక కరూర్ ఘటన తరువాత తన గుండె బద్దలైందని అసలు మాటలు రావడం లేదని విజయ్ అన్నారు. అంతే కాదు ఈ ఘటనకు సంబంధించి తాను ఏ తప్పు చేయలేదని స్పష్టం చేశారు. ఇక తన మొత్తం జీవితంలో ఇలాంటి పరిస్థితిని ఎప్పుడూ ఎదుర్కోలేదని చెప్పుకున్నారు ఇక తానూ మనిషినే అని అంటూ అక్కడ అంతమంది చనిపోయారని తెలిస్తే అక్కడ్నుంచి వెళ్లిపోతానా అని కూడా అన్నారు. ఇక తన పార్టీ ర్యాలీ కోసం ఎన్నో విధాలుగా జాగ్రత్తలు తీసుకున్నా కూడా ఇలాంటి ఊహించని ఘటన జరిగిందని వాపోయారు. ఇక ముఖ్యమంత్రి స్టాలిన్ తన మీద ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటే నన్ను ఏమైనా చేసుకోండి అని కూడా అన్నారు.

**త్వరలో పరామర్శిస్తా:** ఇక ఈ ఘటనలో బాధితులను తాను తొందరలో పరామర్శిస్తానని విజయ్ చెప్పారు. ఈ దుర్ఘటన మీద ఏమి జరిగింది ఏమిటి అన్న నిజాలు త్వరలోనే వెలుగులోకి వస్తాయని ఆయన చెప్పారు అంతే కాదు తాను తొందరలో తిరుపతి వెళ్లి శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకుంటానని విజయ్ తెలిపారు. ఇలా ఆయన భావోద్వేగమైన వీడియోనే రిలీజ్ చేశారు. అయితే ఆయన విస్మరించిన విషయం ఏమిటి అంటే ఇన్ని రోజులు అయినా బాధితులను పరామర్శించకపోవడం, బాధితులకు ఆయన పెద్ద మొత్తంలో ఆర్థిక సాయం ప్రకటించారు. కానీ ఒక ప్రజా నాయకుడిగా తన బాధ్యత మరచారని అంటున్నారు. ఈ నెల 27న ఈ దుర్ఘటన జరిగింది. బాధితులను వెంటనే పరామర్శించి వారికి ఓదార్పు ఇవ్వాల్సిన అవసరం ఉంది. కానీ టీవీకే డిఫెన్స్ మోడ్ లోకి వెళ్లిపోయింది అని అంటున్నారు. పైగా డీఎంకేని నిందిస్తున్నారు. తమ బాధ్యత లేదని చెబుతున్నారు. రాజకీయం అంటే ఇదేనా అన్న చర్చ సాగుతోంది. ఇళయ దళపతి ఇంకా నేర్చుకోవాల్సింది ఎంతో ఉందని అంటున్నారు. ఆయన ఇప్పటి కైనా లేట్ చేయకుండా బాధితులను నేరుగా కలసి కన్నీరు తుడవడం ప్రథమ కర్తవ్యం అని సూచిస్తున్నారు.



# చెడుపై విజయమే విజయ దశమి

నవరాత్రి పదంలో నవ శబ్దం తొమ్మిది సంఖ్యను సూచిస్తుంది. నవరాత్రులను నవ అహోరాత్రాలు అని ధార్మిక గ్రంధాలు వివరిస్తున్నాయి. అంటే తొమ్మిది పగళ్ళు, తొమ్మిది రాత్రులు నిర్వర్తించే దేవి పూజకు ఒక ప్రత్యక విధానం ఉంది. ఆశ్వయుజ శుక్ల పక్ష పాడ్యమి తిథి నుండి పూర్ణిమ వరకు తొమ్మిది రాత్రులు తొమ్మిది పగళ్ళు అమ్మవారిని పూజించడం ప్రశస్తంగా చెప్పబడింది. దీనినే 'శరన్నవరాత్రులు' లేదా 'దేవి నవరాత్రులు అంటారు. నవ రాత్రి వాస్తవానికి ఋతువుల సంధికాలం. అందుచేత సృష్టికి కారణమైన మహా మాయ తీవ్రవేగం కలిగి ఉంటుంది. పూజాదుల చేత ఆమెను ఆహ్వానించటం సులభ సాధ్యం. తొమ్మిది రోజులు నవ దుర్గలను నిష్ఠగా ఉపాసించే ఆరాధకులకు దేవి అనుగ్రహం లభిస్తుంది. నవ రాత్రులలో రాహుకాల వేళ రాహుకాల దీపం వెలిగించాలి. రాహు ప్రతికూల ప్రభావం తగ్గి, దోష నివారణ జరుగుతుంది. దేవి అర్చనలో లలితా సహస్రనామాలు, దుర్గాసప్తశతి పారాయణ చేసే భక్తుల కోరికలు నెరవేరుతాయి. రోగ పీడలతో బాధపడే వారు, జాతకంలో అపమృత్యు దోషం ఉన్నవారు ఈ తొమ్మిది రోజులు నియమం తప్పకుండా దేవి ఆరాధన చేయడం శుభకరం. సాధారణంగా విజయ దశమి నాడు శ్రవణ నక్షత్రం ఉంటుంది. నక్షత్ర మండలంలో శ్రవణ నక్షత్రం చెవి ఆకారంలో ఉంటుంది. అందుకే ఈ రోజు ఏదైనా కొత్త విద్యలు నేర్చుకోవాలనుకొనేవారు ఈ రోజు ప్రారంభిస్తే విశేషంగా లాభిస్తుంది. శమీ చెట్టు యొక్క పూజ ఈ రోజు విశేషంగా లాభిస్తుంది. జమ్మి చెట్టును పూజించడం లక్ష్మీప్రదమని పురాణాలు చెబుతున్నాయి. శమీ వృక్షం సువర్ణ వర్షం కురిపిస్తుందని శాస్త్రాల్లో ఉంది. విజయ దశమి రోజున పూజలు అందుకొన్న జమ్మి చెట్టు ఆకులను ఇంట్లోని పూజాస్థలంలో, ధన స్థానంలో నగదు పెట్టెల్లో ఉంచుతారు. దీనివల్ల ధనవృద్ధి జరుగుతుంది. పరమ శివునికి జగన్మాత దుర్గాదేవికి, సిద్ధి ప్రదాత గణపతికి శమీ పత్రి సమర్పించే ఆచారం అనాదిగా వస్తోంది. పూర్వం జమ్మి చెట్టు కాడల రాపిడి ద్వారా సృష్టించిన అగ్నితోనే యజ్ఞ యాగాదుల క్రతువులు నిర్వహించేవారు. ఇవాల్టికి దేశంలోని వివిధ ప్రాంతాల్లో శమీ వృక్షంలో అగ్ని ఉంటుందనే విశ్వాసం దృఢపడింది. అగ్ని వీర్యమే సువర్ణం కనుక జమ్మి బంగారం కురిపించే చెట్టుగా పూజార్హత పొందింది. ఈ రోజే శ్రీ రాముడు రావణునిపై విజయం సాధించాడు. విజయదశమి రోజునే శమీ పూజ కుడా నిర్వహిస్తారు. శ్రీరాముని వనవాస సమయంలో కుటీరం జమ్మి చెట్టు చెక్కతోనే నిర్మించారని చెబుతారు. శమి అంటే పాపాల్ని, శత్రువుల్ని నశింపజేసేది. పంచ పాండవులు అజ్ఞాత వాసానికి వెళ్ళే ముందు తమ ఆయుధాలని శమీ చెట్టుపై పెట్టడం జరిగింది. సామాన్యులే గాక యోగులు నవరాత్రులలో అమ్మవారిని పూజిస్తారు. ముఖ్యంగా శాక్తేయులు దీనిని ఆచరిస్తారు. ఆలయాలలో అమ్మవారికి విశేష అలంకరణలు, బొమ్మల కొలువు పెట్టడం ఒక ఆనవాయితీ. ఈ తొమ్మిది రోజులు ఒక్కో రోజు ఒక్కో అలంకారం చేసి, పూజిస్తారు. అమ్మవారు లోక కళ్యాణం కోసం ఒక్కోరోజు ఒక్కో అవతారం ధరించింది. అందువలన అలా అమ్మవారు అవతరించిన రోజున, ఆ రూపంతో అమ్మవారిని అలంకరించి ఆ నామంతో ఆరాధిస్తూ ఉంటారు. **రామ కిష్టయ్య సంగన భట్ల...9440595494**

# శమయతే పాపం... శమీ వృక్ష ప్రత్యేకత




శమీ శమయతే పాపం, శమీ శత్రు వినాశినీ, అర్జునస్య ధనుర్ధారీ, రామస్య ప్రియదర్శినీ, '...భారత, రామాయణాది పౌరాణిక గాథలలో శమీ వృక్షానికి విశేష ప్రాధాన్యత కల్పించ బడింది. శమీకే "అపరాజిత " అనిపేరు. అంటే ఓటమి నెరుగని మాతయని అర్థం. అమెయే విజయ, నామాంకితయైన జగజ్జనని, అపరాజితా దేవి. విజయానికి అధిదేవత.

శరన్నవరా త్రి వేడుకలలో భాగంగా, దుర్గా మాతను తొమ్మిది రోజులుగా కొలిచి నట్లయితే సర్వ శక్తులు సమకూరి, విజయ దశమినాడు విజయం చేకూర గలదని భక్తుల, ఆధ్యాత్మిక కార్యానురక్తుల ప్రగాఢ విశ్వాసం. అందులకై దసరా నవరాత్రి ఉత్సవాలలో ముగింపుగా విజయ దశమి పర్వ దినాన శమీ (జమ్మి) వృక్షాన్ని పూజించి, సర్వాభీష్ట నిద్దికై ప్రార్థించడం ప్రాచీన కాలంనుండి అనుసరిస్తున్న సత్సాంప్రదాయం. పూర్వకాలంలో రాజులు తమ విజయ యాత్ర సన్నాహక కార్యక్రమాలుగా ' ' అగ్నిపూజ, గుర్రాలు , ఏనుగులు ' ' మొదలైన వాటికి కొన్ని ఆర్చనలు చేయడాన్ని ఆచరించారు. దానిలో భాగంగానే శమీవృక్ష పూజ చేసి, యుద్ధానికి వెళ్ళేవారు. సంబంధిత కొన్ని విశేషాలను కాళిదాసు రఘువంశ మహా కావ్యమందు నాలుగవ సర్గలో సూచించారు. యజ్ఞ యాగాదులలో ఉపయుక్త శ్రౌతాగ్నిని మథించుటకై , జమ్మి కొమ్మ అవసరమైంది. అరనులలో ఆడుగు కర్ర జమ్మికర్ర. పై కర్ర రావి కర్ర వాడతారు. జమ్మిని స్త్రీ లింగం గా, రావిని పుం లింగంగా ( శమింతా, అశ్వత్థ:) అని ఆర్యులు పేర్కొన్నారు. అగ్ని శమీ గర్భాన కలదని ( శమీ గర్భా దగ్నిం మంద తి) అని శ్రుతి వచనం, కనుకనే శమీ పూజకు ప్రాధాన్యత ఏర్పడింది. విజయ దశమి నాడు శమీవృక్షాన్ని పూజించే క్రమంలో రామార్జున గాథలను స్మరించే సంప్రదాయం ఉంది. రాముడు , రావణునిపై విజయం సాధించిన దినంగా , పాండవులు వనవాసం వెళుతూ, శమీవృక్షం పైనుండి తమ ఆయుధాలను తిరిగి పొంది కౌరవులను జయించిన దినంగా విజయ దశమికి ప్రత్యేకత ఉంది. అర్జునినితో కూడిన పాండవులు అజ్ఞాత వాసం వెళ్ళే సమయాన తమ అస్త్ర శస్త్రాలను శమీ వృక్షంపై నిక్షేపించినట్లు భారత కథనం. శమీవృక్షం లేదా జమ్మి చెట్టు లను మాగ్నోలియో పైటా తరగతికి, ప్రోసో పిస్ జాతికి , ఫాబేసి కుటుంబానికి చెందినది. దీని శా స్త్రీయ నామం ప్రోసోపిస్ సైసిజెరా. వైదిక భాషలో "ఆరణి" అని పిలుస్తారు. అగ్నిని ఉద్భవించేందుకు కాష్టాంతరంచే మథింప యోగ్యమైన దారువు అని "ఆరణి" ' అర్థం. జమ్మి ఆకుల పసరు తీసి, పుళ్లకు రాస్తే కుష్టు వ్యాధి నశిస్తుందని, జమ్మి పూలను చక్కెరతో కలిపి సేవించడం వల్ల గర్భ స్రావం కాకుండా నిరోధించ బడుతుందని , జమ్మి చెట్టు బెరడు దగ్గు ఆస్తమా వ్యాధులకు ఔషధంగా పని చేస్తుందని ఆయుర్వేద వైద్యులు చెపుతారు. విజయ దశమి సాయంత్రం శమీవృక్షం వద్ద ఆపరా జితను పూజించి "శమీ శమయతే పాపం శమీ లోహిత కంటకా, ధారిణ్య అర్జున బాణానాం రామస్య ప్రియ వాదినీ , కరిష్యమాణ యాత్రాయాం యథా కాలం సుఖం మయా , తత్ర నిర్విఘ్న కర్తీత్వం భవ శ్రీరామ పూజితే," అని చిట్టీలపై రాని జమ్మి చెట్టు కొమ్మలకు తగిలిస్తే, దీని వల్ల అమ్మవారి కృపతో పాటు శని దోష నివారణ కాగలదని విశ్వాసం. మహారాష్ట్రులు శమీ వృక్షానికి తోడు పలాశ (మోదుగ) పత్ర పూజా చేస్తారు. హిందువుల శుభాశుభ కర్మలలో మోదుగ ప్రమేయం అధికం. ఉపనయనాలో వటువులు భిక్షా సమయాన ధరించేది పలాశ దండం, కాశీకి వెళ్ళి వచ్చిన నైష్టికులు మోదుగ ఆకుల విస్తళ్ళలో నే భోజనం చేసే వారు. పలా శప త్రాలను పోలిన బంగారు చిన్నచిన్న ఆకులను చేయించి , దేవు శృకు , స్నేహితులకు , బంధువులకు ఇవ్వడం విజయ దశమినాటి మహా రాష్ట్ర ప్రజల ఆచారం.

**రామ కిష్టయ్య సంగన భట్ల...9440595494**


# ద్వైత మత బోధకులు మధ్వాచార్యులు - విజయ దశమి మధ్వాచార్య 788వ జయంతి



త్రిమతాచార్యులలో మూడవ వారై, హనుమంతుడు, భీముడు, అనం తరం వాయుదేవునకు తృతీయ అవతారంగా భావించే మధ్వాచార్యులు ద్వైత మత బోధకులు. ఆయన సాంప్రదాయాలను పాటించే వారిని మాధ్వులు లేదా మధ్వ మతస్తులు అంటారు. క్రీ.శ.1238 ఆశ్వయుజ మాస శుక్ల పక్ష దశమి (విజ యదశమి) నాడు ఆయన కొంకణ - కేరళ మధ్యనున్న కనరా మండలంలోని ఉడిపి పట్టణ సమీపస్థ పాజక క్షేత్రంలో మధ్య గేహభట్ట, వేదవతి దంపతులకు జన్మించారు. ఉడిపిలోని అనంతేశ్వర స్వామిని చిరకాలం కొలిచిన ఫలితంగా శమున జన్మించి నందున ఆయనకు వాసుదేవు డని తల్లిదండ్రులు పేరు పెట్టారు. అనంతర కాలంలో "పూర్ణప్రజ్ఞ, ఆనందతీర్థ, మధ్యాచార్య" అనే నామాలతో ప్రసిద్ధులైనారు. 8వ ఏట ఉపనయన సంస్కారియై, 10ఏళ్లకే సర్వ విద్యా పారంగతుడైనారు. 11ఏళ్ల వయసులో సన్యాసంవైపు ఆకర్షితులై, అచ్యుత ప్రజ్ఞ అనే యతివర్యులైన ఆధ్యాత్మిక గురువు వద్ద సన్యాసాశ్రమాన్ని స్వీకరించి, "పూర్ణబోధ" పేరు నంది అనే గొప్ప పండితుని ఓడించి "మధ్వ, పూర్ణ ప్రజ్ఞుడు" బిరుదులు పొందారు. వేదాంత విద్యా రాజ్య పట్టాన్ని పొంది "అనంద తీర్థులు నామాంచి తులైనారు. యుక్త వయసులోనే దక్షిణ భారతా వనిలో కన్యాకుమారి, రామేశ్వరం, శ్రీరంగం తదితర క్షేత్రాలను సందర్శించారు. తాను పొందిన తత్వజ్ఞానాన్ని ఉపన్యాస రూపంలో ప్రజలకు వివరించారు. శ్రీశంకర భగవత్పాదుల ప్రస్థాన త్రయానికి ఒనర్చిన భాష్యాలను మధ్వాచార్య విమర్శించారు. దక్షిణ దిగ్విజయయాత్ర గావిస్తూ, తన ముఖ్య శిష్యుడైన సత్య తీర్థులతో కలిసి బదరి యాత్ర చేశారు. ఆ సందర్భంలోనే బ్రహ్మసూత్రాలపై భాష్యాలను పూర్తి చేశారు. స్వదేశానికి తిరిగి వస్తూ రాజమహేంద్రవరంలో శ్యామశాస్త్రి (నరహరి తీర్థులు)ని మాయావాదం గురించి ఓడించి, ప్రచండవాదం గావించి, శిష్యుడిని చేసు కున్నారు. అలాగే అక్కడే శోభనభట్టు (పద్మనాభ తీర్థులు) అనే పండితుడు శిష్యుడైనాడు. ఉడిపిలో భగవద్గీత, ఉపనిషత్తులకు భాష్యాలు రాసారు. రుగ్వేదం లోని 40సూక్తాలకు, భారత భాగవతాలకు వ్యాఖ్యానాలు రచించారు. శ్రీకృష్ణామృత మహార్ణవం కర్మనిర్ణయం, మహా భారత తాత్పర్యం లాంటి అనేక గ్రంథ రచనలు గావించారు. తర్కంతో పాటు 37గ్రంథాలను విరచించారు. మధ్వాచార్య ఆసేతు హిమాచల పర్యంతం పర్యటించి, ద్వైత మత విస్తృత ప్రచారం గావించి, వైష్ణవ మత వ్యాప్తికి, ప్రధానంగా కృష్ణభక్తి వ్యాప్తికి మధ్వమతం ద్వారా ఇతోధికంగా కృషి సల్పారు. భీమసేనుని అవతారమని భావించే ఆయన వృకోదర త్వాన్ని పలుమార్లు ప్రదర్శించి, విష్ణు మంగళ గ్రామాన 200 అరటి పళ్ళను ఆరగింప ప్రార్థితుడై అలవోకగా తినివేశారు. ఇషుపాతమనే మరో గ్రామంలో 1000 అరటి పళ్ళు తెచ్చి ఇవ్వగా, అన్నింటినీ ఒకే ఊపులో ఆరగించారు. అడవి మార్గాన సంచరిస్తుండగా, పొదలనుండి వచ్చి, శిష్యుని మీద దూకిన పులిని ఒకే గుద్దుతో హత మార్చారు. కదూరా మండలంలోని ముద్ర గ్రామ సమీప తుంగభద్రా నదీ తీరాన అంబుతీర్థమనే ప్రదేశాన ఒడ్డునుండి నదిలోనికి అడ్డంగా పడి ఉన్న పెద్ద బండరాయిని చూసి, విషయం కనుగొని, అవలీలగా ఒక్క చేతితో ఎత్తి అనుకున్న స్థలంలో అనువు పరిచారు. ఆయన అతిలోక బల సామర్థ్యానికి నిదర్శనంగా, ఆ బండ మీద (శ్రీ మధ్వాచార్యైరేక హస్తేన ఆనీయ స్థాపిత శిలా"అనే అక్షరాలు చెక్కబడినవై ఉన్నాయి. తమ 79వ ఏట క్రీ.శ.1817లో మాఘశుక్ల నవమి నాడు శిష్య సమేతులై బదరీ నారాయణుని దర్శించి, ఉత్తర బదరిని ఒంటరిగా చేరి, వ్యాస భగవానుని కైంకర్యాలలో నిమగ్నమైనారు. **రామ కిష్టయ్య సంగన భట్ల...9440595494**

# మహాత్ముడి మార్గం...సత్యం, అహింసలతో మలిచిన విప్లవం

## విప్లవాత్మక ఉద్యమ నాయకత్వానికి పునాది ...గాంధీ సత్యాగ్రహ స్ఫూర్తి



మోహన్ దాస్ కరంచంద్ గాంధీ భారత స్వాతంత్ర్య పోరాటంలో కేవలం ఒక రాజకీయ నాయకుడు మాత్రమే కాకుండా నైతిక, ఆధ్యాత్మిక శక్తికి ప్రతీకగా నిలిచిన మహనీయుడు. 1869 అక్టోబరు 2న గుజరాత్ రాష్ట్రంలోని పోర్ బందర్ పట్టణంలో జన్మించిన గాంధీ బాల్యం నుండే సత్యం, నియమ శీలత, త్యాగం వంటి విలువలతో పెరిగాడు. తల్లి పుత్లీబాయి భక్తి శ్రద్ధలతో నిండిన స్త్రీ కాగా తండ్రి కరంచంద్ కఠిన నైతిక విలువలతో కూడిన పరిపాలకుడు. ఈ ఇద్దరి ప్రభావం గాంధీ జీవనంలో లోతైన ముద్ర వేసింది. చిన్ననాటి నుంచి ఉపవాసం, నియమాలు, నిజాయితీ పట్ల అతనికి ఉన్న ఆకర్షణ తరువాతి కాలంలో ఒక విప్లవాత్మక ఉద్యమ నాయకత్వానికి పునాదిగా నిలిచింది. విద్యాభ్యాసం పూర్తి చేసిన తరువాత 1888లో గాంధీ లండన్ వెళ్లి న్యాయ విద్యాభ్యాసం చేశాడు. అక్కడ పాశ్చాత్య సంస్కృతి ఆకర్షించినప్పటికీ త్వరగానే తన భారతీయ మూలాలను గుర్తించి సాదాసీదా జీవనం, ఆచరణాత్మక ధర్మం వైపు మొగ్గు చూపాడు. 1891లో న్యాయవాది పట్టా పొంది స్వదేశానికి వచ్చినా, వృత్తిలో స్థిరపడలేక 1893లో దక్షిణాఫ్రికాకు వెళ్ళాడు. అక్కడే అతని జీవితం కొత్త మలుపు తిరిగింది. పీటర్ మారిట్జ్ బర్గ్ రైల్వే స్టేషనులో వర్ణ వివక్ష కారణంగా ట్రైన్ లోంచి బయటికి తోసేయ బడిన అవమానం గాంధీ మనసును కలచివేసింది. ఆ అవమానం ఆయనను ఒక న్యాయవాది నుంచి సామాజిక పోరాట యోధుడిగా మలిచింది. 1894లో నటాల్ ఇండియన్ కాంగ్రెస్ స్థాపించి భారతీయుల హక్కుల కోసం పోరాడాడు. ఇరవై సంవత్సరాల పాటు దక్షిణాఫ్రికాలో అహింస, సత్యాగ్రహ సిద్ధాంతాలను ప్రయోగించి వర్ణ వివక్ష వ్యతిరేకంగా సమూహాలను ఏకం చేశాడు. ఈ అనుభవమే భారత స్వాతంత్ర్య పోరాటంలో తరువాత ఆయన ఆయుధంగా మారింది. 1915లో స్వదేశానికి తిరిగి వచ్చిన గాంధీ గోపాలకృష్ణ గోఖలే సూచనల మేరకు ముందుగా భారతీయ సమాజ స్థితిగతులను సమీక్షించాడు. ప్రజల విశ్వాసాన్ని సంపాదించడానికి స్థానిక సమస్యలతో ప్రారంభించాడు. 1917లో బీహార్ చంపారన్‌లో రైతుల సమస్యలు పరిష్కరించడానికి మొదటి సత్యాగ్రహాన్ని చేపట్టాడు. అదే తరువాత అహ్మదాబాద్ మిల్లు కార్మికుల సమ్మె, ఖేదా రైతుల సత్యాగ్రహంతో కొనసాగింది. ఈ చిన్నచిన్న ఉద్యమాల ద్వారా ప్రజలు గాంధీ అహింసా మార్గం పట్ల నమ్మకం పెంచుకున్నారు. 1919లో రౌలట్ చట్టాల వ్యతిరేకంగా ఉద్యమం దేశ వ్యాప్తంగా ఉద్ధృతమైంది, అదే సమయంలో అమృత్‌సర్‌లో జలియన్ వాలా బాగ్ నరమేధం చోటు చేసుకుంది. జనరల్ డయర్ ఆదేశాలతో వందలాది మంది ప్రాణాలు కోల్పోయిన ఈ ఘటన గాంధీ మనసును కుదిపేసి సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం ఆయన పోరాటాన్ని మరింత దృఢం చేసింది. 1920లో సహకార నిరాకరణ ఉద్యమం ప్రారంభమైంది. లక్షలాది మంది ప్రజలు ప్రభుత్వ ఉద్యోగాలను, పాఠశాలలను, కోర్టులను వదిలి ఉద్యమంలో చేరారు. విదేశీ వస్తువులను దహనం చేసి స్వదేశీ వస్తువులకు ప్రాధాన్యం ఇచ్చారు. సుమారు రెండు కోట్ల మంది ప్రత్యక్షంగా ఇందులో పాల్గొన్నారు. అయితే 1922లో చౌరి చౌరా ఘటనలో హింస చెలరేగడంతో గాంధీ ఉద్యమాన్ని నిలిపి వేయడం ఆయన అహింస పట్ల నిబద్ధతకు నిదర్శనం. 1930లో ఉప్పు సత్యాగ్రహం గాంధీ జీవితంలో ఒక ముఖ్య ఘట్టం. సబర్మతి ఆశ్రమం నుంచి 78 మంది అనుచరులతో కలిసి 240 మైళ్ళ దూరం నడిచి దాండీ తీరంలో ఉప్పు చట్టాన్ని ఉల్లంఘించాడు. ఈ సంఘటన అంతర్జాతీయంగా విస్తృతంగా చర్చకు దారితీసింది. అరవై వేల మందికి పైగా జైలుకు వెళ్ళారు. గాంధీ ప్రపంచ దృష్టిని ఆకర్షించాడు. 1931లో లండన్ రౌండ్ టేబుల్ సమావేశానికి వెళ్లి భారత స్వాతంత్ర్య సమస్యను ప్రపంచ వేదికపై ఉంచాడు. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో 1940లో వ్యక్తిగత సత్యాగ్రహాన్ని చేపట్టి బ్రిటిష్ పాలనను సవాలు చేశాడు. 1942లో బాంబేలో భారత్ విడిచిపో ఉద్యమానికి పిలుపు నిచ్చాడు. ఈ ఉద్యమంలో లక్షలాది మంది జైలు పాలై వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. చరిత్రకారుల అంచనా ప్రకారం దాదాపు పదివేల మంది ఈ ఉద్యమంలో మరణించగా, లక్షన్నర మందికి పైగా జైలు శిక్షలు అనుభవించారు. ఈ సంఘటనలు స్వాతంత్ర్యానికి దారితీసే మార్గాన్ని వేగవంతం చేశాయి. 1947లో భారత్ స్వాతంత్ర్యం పొందినప్పటికీ దేశ విభజన గాంధీని తీవ్రంగా కలచి వేసింది. మత హింస ఆగిపోవాలని ఆయన నిరంతరం ఉపవాసాలు చేశాడు. చివరి వరకు ప్రజలను శాంతి, సామరస్య మార్గంలో నడిపించడానికి కృషి చేశాడు. కానీ 1948 జనవరి 30న నాథూరామ్ గోడ్సే కాల్పులకు బలై ప్రాణాలు కోల్పోయాడు. ఆయన మరణం కేవలం భారత దేశానికే కాకుండా మానవ జాతికే ఒక దారుణ నష్టమైంది. గాంధీ ఆలోచనలు కేవలం రాజకీయాలకే పరిమితం కాలేదు. స్వదేశీ, ఖాదీ ప్రోత్సాహం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేశాడు. స్వావలంబన, స్వచ్ఛత, క్రమశిక్షణ ఆయన ఆర్థిక ఆలోచనల కేంద్రము. ఆయన ఆశ్రమాలు సబర్మతి, వర్ధాసామాజిక సమానత్వానికి ప్రతీకలు. దళితుల హక్కుల విషయంలో అంబేద్కర్‌తో విభేదాలు ఉన్నప్పటికీ, చివరికి పూణే ఒప్పందం ద్వారా ఒక పరిష్కారం సాధించాడు. గాంధీ, రవీంద్రనాథ్ టాగోర్ మధ్య లేఖల మార్పిడి ఆయన మేధో గంభీరతను చూపిస్తుంది. టాగోర్ గాంధీని "మహాత్మా" అని మొదటగా సంబోధించగా, గాంధీ టాగోరును "గురుదేవ్" అని గౌరవించాడు. ఈ ఇద్దరి మధ్య అభిప్రాయ భేదాలు ఉన్నా పరస్పర గౌరవం కొనసాగింది. ప్రపంచ వ్యాప్తంగా గాంధీ ప్రభావం అపారమైనది. అమెరికాలో మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ పౌరహక్కుల ఉద్యమాన్ని గాంధీ అహింసా మార్గం ఆధారంగా నడిపాడు. దక్షిణాఫ్రికాలో నెల్సన్ మండేలా ఆయన ఆలోచనలతో ప్రేరణ పొంది వర్ణవివక్ష వ్యతిరేక పోరాటాన్ని నడిపాడు. మయన్మార్ నాయకురాలు ఆంగ్ సాన్ సూకీ, అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా వంటి నేతలు గాంధీని తమ ప్రేరణగా పేర్కొన్నారు. అల్బర్ట్ ఐన్‌స్టీన్ గాంధీని "భవిష్యత్ తరాలు ఇలాంటి మనిషి భూమిపై నడిచాడని నమ్మడం కూడా కష్టమవుతుంది" అని అన్నాడు. 1917 నుంచి 1942 వరకు గాంధీ నడిపిన ప్రధాన ఉద్యమాల్లో మూడు లక్షల మందికి పైగా జైలుశిక్షలు అనుభవించగా లక్షలాది మంది ప్రాణత్యాగం చేశారు. కాంగ్రెస్ పార్టీ 1920 నుండి 1947 మధ్య ఐదు మిలియన్లకు పైగా సభ్యత్వాన్ని సంపాదించి ఒక జాతీయ శక్తిగా ఎదిగింది. గాంధీ ఈ పెరుగుదలకు కేంద్రమూర్తి. ఆయన పేరు కేవలం భారత స్వాతంత్ర్యానికి ప్రతీక కాదు, ప్రపంచ మానవత్వానికి ఒక శాశ్వత మార్గదర్శకం. ఆయన జీవితం రాజకీయ పోరాటం, నైతిక శక్తి, ఆధ్యాత్మిక విప్లవం అన్నింటినీ ఏకం చేసింది. సత్యం, అహింస, స్వదేశీ, స్వావలంబన వంటి విలువలు నేటికీ ప్రపంచానికి దిక్సూచి. ఆయన మరణంతో ఆయన శరీరం కనుమరుగైనప్పటికీ ఆయన ఆలోచనలు, ఆదర్శాలు మానవజాతి చరిత్రలో శాశ్వతంగా నిలిచి ఉన్నాయి. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# వరదాయిని.. ఉరిమింది!

తాండూరు : వ్యాపార కార్యకలాపాలు ఒక్కసారిగా స్తంభించాయి. తాండూరు, వికారాబాద్, కొడంగల్, పరిగి పట్టణాలకు పరిసర గ్రామాల నుంచి పండగకు సరకులు కొనేందుకు వచ్చేవారు. వర్షాలతో రద్దీ బాగా తగ్గింది. దీంతో దుకాణాలు వెలవెలబోతున్నాయి. జిల్లాకు వరప్రదాయిని కాగ్నానది ఉగ్రరూపం దాల్చింది. భారీ వర్షాలకు బషీరాబాద్, యాలాల, తాండూరు, పెద్దేముల్ కాగ్నానది పరివాహక మండలాల్లోని పంట పొలాలు, ఇళ్లు నీట మునిగాయి. ప్రధాన రహదారులు పొదయ్యాయి. యాలాల మండలం కోకట్ వంతెన తెగిపోవడంతో సుమారు 35 గ్రామాలకు వెళ్లేందుకు సిబ్బందిగా మారింది. హాల్మోడ – నవాంద్గీ మధ్య వేసిన రోడ్డు కొట్టుకుపోయింది.

**10వేల ఎకరాల్లో పంటలకు నష్టం..**

నియోజకవర్గంలో 10వేల ఎకరాలకుపైగా పంటలకు నష్టం వాటిల్లిందని రైతులు, వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. బషీరాబాద్ మండలం జీవన్గీ, గంగ్వార్, మంతట్టి, క్యాద్గిరా, నవాంద్గీ, ఇందర్‌చేడ్, పెద్దేముల్ మండలంలోని కందనెల్లి, యాలాల మండలం బెన్నూరు, కోకట్, సంగెం, తాండూరు మండలం వీరశెట్టిపల్లి, గోనూరు, పాత తాండూరు పరిసరాల నుంచి కాగ్నానది ప్రవహిస్తుండడంతో వర్షాలకు అంది పొంగి కంది, పత్తి, వరి పంటలన్నీ నీటమునిగాయి. రూ.కోట్లలో



రైతన్నలకు నష్టం వాటిల్లడంతో తల్లడిల్లుతున్నారు.

**ట్రిప్పులు కుదించిన ఆర్టీసీ..**

వర్షాలకు ప్రధాన రహదారులు ధ్వంసం కావడంతో ఆర్టీసీ బస్సుల ట్రిప్పులు కుదించారు. తాండూరు నుంచి మహబూబ్‌నగర్‌కు 4, హైదరాబాద్ రూట్లో 5, చించోళి రూట్లో 4 ట్రిప్పులు తగ్గించామని తాండూరు డిపో మేనేజరు సురేశ్‌కుమార్ తెలిపారు.

**ఉపాధి కోల్పోయిన నాపరాతి కార్మికులు..**

మల్కాపూరు, ఓగిపూరు, కరణ్‌కోట గనుల్లోకి వరద నీరు భారీగా వచ్చి చేరింది. గౌతాపూరు, చెంగేష్‌పూరు, కోకట్, కొడంగల్ రోడ్డ వారగా ఉన్న పాలిష్ యూనిట్లలోకి వరద చేరడంతో పనులు స్తంభించాయి. దీంతో వేల మంది కార్మికులకు ఉపాధి లేకుండాపోయింది.

**ప్రభుత్వం ఆదుకోవాలి..**

– వెంకటేశం, నవాంద్గీ.

మా గ్రామం కాగ్నానదికి ఒడ్డున ఉంటుంది. ఊరి చుట్టూ నీటి ప్రవాహంతో రెండు వైపులా పత్తి, కంది, వరి పంటలన్నీ నీట మునిగాయి. నాకున్న పదెకరాల్లో పంటలు వరదలో మునిగిపోయాయి. ఊళ్లో సుమారు 300 ఎకరాలకుపైగా పంటలు పాడయ్యాయి. చేతికొచ్చిన పత్తి నేలమట్టమైంది. ప్రభుత్వం ఆదుకోవాలి.

# వేడెక్కిన పల్లె రాజకీయం

వికారాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలకు నగారా మోగనున్న వేళ పల్లెల్లో రాజకీయం వేడెక్కింది. ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసింది. దీనికి అనుగుణంగానే రిజర్వేషన్లను ఖరారు చేశారు. ముందుగా జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రధాన పార్టీలు క్షేత్రస్థాయిలో సమావేశాలు నిర్వహించి కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని అభ్యర్థుల ఎంపికకు కసరత్తు ప్రారంభించాయి. అభ్యర్థులు బీ-ఫారంపై పోటీ చేయాల్సి ఉండటంతో పార్టీల గెలుపు గుర్రాల కోసం అన్వేషిస్తున్నాయి.

**ఔత్సాహికుల సందడి..**

పల్లెల్లో ఔత్సాహికుల సందడి నెలకొంది. పోటీకి దిగే ఆలోచన కలిగిన వారు మద్దతు కూడగట్టుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. సర్పంచి ఎన్నికల ను పార్టీ రహితంగా నిర్వహిస్తారు. సర్పంచిగా పోటీ చేయాలనుకుంటున్న అభ్యర్థులు కులసంఘాలు, ఇతర పలుకుబడి ఉన్న వ్యక్తులను కలిసి మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. ఇక ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులు బీ-ఫారం ఇప్పించాలని జిల్లా నాయకులను కోరుతున్నారు.



**కొందరికి మోదం.. మరికొందరికి ఖేదం..**

రిజర్వేషన్ల ఖరారు కొందరికి మోదం, మరికొందరికి ఖేదం మిగిల్చాయి. ఎలాగైన ఈసారి పోటీ చేయాలని కొంతకాలంగా ప్రజాసేవలు చేసుకున్న పలువురికి రిజర్వేషన్లు అనుకూలంగా రాలేదు. మరి కొందరికి అనుకూలించడంతో ఎన్నికల బరిలో నిలవడానికి ఉవ్విళ్లూరుతున్నారు. ధారూర్, వికారాబాద్ మండలాల్లో రెండేళ్లుగా తాజా మాజీలు మళ్లీ అవకాశం వస్తుందన్న నమ్మకంతో ప్రజల్లో ఉన్నారు. తీరా రిజర్వేషన్లు అనుకూలించకపోవడంతో నిరుత్సాహపడుతున్నారు. మద్దతివ్వాలని రిజర్వేషన్లు కలిసి రానివారిని అనుకూలంగా వచ్చిన వారు కోరుతున్నారు.

# పిల్లల్లో ఊహాశక్తి పెంచే భూమిక

హైదరాబాద్: ఉదయం లేవగానే ఫోన్ ఎక్కడుందని వెతికే పెద్దలను చూస్తూ పిల్లలు కూడా సెల్‌ఫోన్ లేకుండా క్షణం ఉండటం లేదు. ఈ క్రమంలో చిన్నారుల్లో నైతిక విలువలు, ఊహాజనిత శక్తి పెంపొందించేలా కథలు చెబుతూ, నాటకాలు ప్రదర్శిస్తోంది నగరానికి చెందిన 'భూమిక థియేటర్ గ్రూప్'. రెండున్నరేళ్ల క్రితం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా ఇటీవలే 110వ వారం ప్రదర్శన పూర్తి చేసింది. ప్రతివారం 'స్టోరీ టెల్లింగ్ థియేటర్ ఫర్ చిల్డ్రన్' పేరుతో పిల్లల్లో మానసిక వికాసాన్ని పెంపుతోంది.

**ఎంపికలోనూ ప్రత్యేకం..** కథలు, అందులోని మూలార్థాన్ని చిన్నారులు తెలుసుకునేలా ప్రదర్శిస్తున్నారు. ఆయా వయసుల పిల్లల్లో కలిగే ఆందోళనలు, ప్రశ్నలకు సమాధానాలు దొరికేలా నాటకాలను ప్రదర్శిస్తున్నారు. పిల్లలందరినీ భాగస్వామ్యం చేస్తూ నాటకాలను ఎంపిక చేస్తున్నారు. ఏ ప్రదేశంలోనైనా ప్రదర్శించేలా వేర్వేరు వేషధారణలతో, లైవ్, సౌండ్ ఎఫెక్ట్‌తో పిల్లలను అందులో నిమగ్నం చేస్తున్నట్టు సంస్థ ప్రతినిధి ఉదయకిరణ్ గరికపాటి తెలిపారు.

# పాత ఇళ్లు.. పైసా వసూల్



హైదరాబాద్: సున్నా విస్తీర్ణం, సున్నా ఆస్తిపన్ను, రాయితీ కింద రూ.101 పన్ను చెల్లించే భవనాలు.. ఇలా మూడు కేటగిరీల్లోని ఇళ్లు బల్దియాలోని పలువురు అవినీతి అధికారులకు లక్ష్యంగా మారుతున్నాయి. బల్దియా చట్టంలోని సెక్షన్-213 కింద కొందరు ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు(టీఐ), బిల్ కలెక్టర్లు(బీసీ) పెద్దయెత్తున నోటీసులిస్తున్నారు. తాఖీదులతో యజమానులను భయాందోళనకు గురిచేస్తున్నారు. కొలతలు, జరిమానాలంటూ ఆస్తిపన్ను అంచనాలను భారీగా పెంచడం.. తక్కువ పన్ను విధిస్తామంటూ వసూళ్లకు పాల్పడటం అలవాటుగా మారింది.

**పాతబస్తీలోనే ఇంటికి రూ.లక్షన్నర..**

చార్మినార్ జోన్ పరిధి సంతోష్‌నగర్‌లోని ఓ పాత ఇంటికి టీఐ ఇమ్మాన్యుయేల్ మూణ్నెల్ల క్రితం నోటీసిచ్చారు. ప్రస్తుత విస్తీర్ణం ప్రకారం సవరించాల్సి ఉందన్నారు. మూడేళ్లకు రూ.1.5 లక్షలు ఇవ్వాలని భయపెట్టడంతో.. యజమాని నగదు రూపంలో చెల్లించారు. అనంతరం రెండు నెలలైనా టీఐ స్పందించలేదు. బాధితుడు కమిషనర్ ఆర్వీ.కర్ణన్‌కు ఫిర్యాదు చేయడంతో.. ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ హుటాహుటిన రూ.26 వేల పన్ను చెల్లించినట్లు యజమానికి రసీదు పంపారు. మిగిలిన డబ్బు గురించి వివరణ లేకపోవడంతో కమిషనర్ విచారణ చేపట్టి.. ఇమ్మాన్యుయేల్‌పై సస్పెన్షన్ వేటు వేశారు.

**ఇతర జోన్లలోనూ..:** ఇటీవల చందానగర్ సర్కిల్ పౌరసేవా కేంద్రంలో పని చేసే ఉద్యోగిని.. ఆస్తిపన్ను మదింపునకు పౌరులు చెల్లించిన రూ.56 లక్షలు దారి మళ్లించిన ఘటన వెలుగులోకి వచ్చింది. అదే జోన్‌లో భారీగా ఖాళీ స్థలాలకు ఇంటినంబర్లూ జారీ అయ్యాయి. శేరిలింగంపల్లి ఎల్బీనగర్, కూకట్‌పల్లి జోన్లలోనూ ఇదే దందా కొనసాగుతోంది.

**పాత భవనాలపై గురి..**

గ్రేటర్‌లో మొత్తం 25లక్షల భవనాలుండగా.. ఆస్తిపన్ను పరిధిలో ఉన్నవి 20 లక్షలే. అయ్యప్ప సొసైటీ, గోకుల్‌ఫ్లాట్స్ వంటి నోటరీ పేపర్లతో చలామణి అవుతోన్న కాలనీలు అనేకం ఉన్నాయి. రూ.100 లోపు పన్ను చెల్లిస్తున్న 20 వేల భవనాలు, తప్పుడు వినియోగపత్రాలున్న వ్యాపార కేంద్రాలు 2లక్షల మేర ఉన్నాయని అంచనా. వాటన్నింటినీ బల్దియా సిబ్బంది మామూళ్ల కోసం ఉపయోగించుకుంటున్నారని ఆరోపణలున్నాయి.

# చెదిరిన ఆనవాళ్లు..



హైదరాబాద్ : మూసీ వరద ప్రవాహం ఆదివారం తగ్గుముఖం పట్టింది. అయితే పరిసర కాలనీలు బురద, వ్యర్థాలతో నిండిపోయాయి. జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సహాయ బృందాలు రహదారులను శుభ్రం చేశాయి. జేసీబీలు, టిప్పర్లు, నీటి ట్యాంకులు, వందలాది మంది సిబ్బంది.. వ్యర్థాలను తొలగించారు. పునరావాస కేంద్రాల్లోని బాధితులకు అల్పాహారం, భోజనం, తాగునీరు అందించారు. అయినప్పటికీ దుర్గంధం కాలనీలను వీడలేదు. ఎండలు కాస్తేగానీ బాధిత కాలనీల్లోని మురుగు వాసన పోదని, అప్పటి వరకు వైద్య శిబిరాలు నిర్వహిస్తామని జీహెచ్ఎంసీ వెల్లడించింది. నార్సింగి వద్ద ఓఆర్ఆర్ సర్వీసు రోడ్లు, గౌరెల్లి వంతెన, మంచిరేవుల కాజ్‌వేలపై ఎప్పటిలాగే రాకపోకలు మొదలయ్యాయి.

**వ్యర్థాల గుట్టలు..**

పురానాపూల్, చాదర్‌ఘాట్ బ్రిడ్జిల పక్కనున్న ఆలయాల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. మూసానగర్, కమలానగర్, రసూల్‌పుర, అంబేడ్కర్‌నగర్‌లోని బాధిత ప్రజలు.. నిత్యావసరాలు, తాగునీటి సమస్య ఉందని వాపోయారు. ఎంజీబీఎస్ పరిసరాలను శుభ్రం చేసి.. కార్యకలాపాలను పునరుద్ధరించారు. నగరంలోని అన్ని వైపుల నుంచి మధ్యాహ్నం బస్సులు బస్టాండుకు పయనమయ్యాయి. దాంతో కాచిగూడ, కోఠి, రహదారులు కిక్కిరిసిపోయాయి.

**చక్కదిద్దాకే రాకపోకలు..**

వరద ఉద్ధృతికి చాదర్‌ఘాట్, ముసారాంబాగ్ వంతెనల రక్షణ గోడలు కొట్టుకుపోయాయి. వంతెనపై ఉండే తారు రోడ్డు బీటలు వారింది. పరిస్థితిని చక్కదిద్దాకే ఆయా వంతెనలపై రాకపోలకు అనుమతించాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. మూసీ నది ఒడ్డున ఉన్న పలు భవనాల పునాదులు పటిష్టమేనా అనే అనుమానం రేకెత్తుతోంది. వాటి పటిష్టతను పరిశీలించే విషయమై త్వరలో నిర్ణయం తీసుకుంటామని అధికారులు వెల్లడించారు.

# కల్లు తెరవండి.. కట్టడి చేయండి



హైదరాబాద్: నగరంలో కొన్ని కల్లు కాంపౌండ్లు నేరాలకు అడ్డాగా మారుతున్నాయి. ఓ వైపు కల్తీ కల్లు విక్రయాలు తాగిన వారి ప్రాణాలు తీస్తుంటే.. మరోవైపు దుకాణాల దగ్గర పరిస్థితులు నేరగాళ్లకు అవకాశంగా మారుతున్నాయి. తాజాగా కిస్మత్‌పూర్‌లో మహిళ హత్యాచారంతో ఇది మరోసారి నిజమైంది. హైదర్‌గూడలో కల్లు తాగేందుకు వచ్చిన అతివతో నేరగాళ్లు మాట కలిపారు. ఆ తర్వాత నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి దారుణంగా హత్య చేశారు.

**స్పృహ తప్పితే విసిరేయడమే..**

మత్తులో ఉన్న మహిళలతో నేరగాళ్లు మాటకలిపి నిర్మానుష్య ప్రాంతాలకు తీసుకెళ్లి బంగారం, సొత్తు దోచుకుంటున్నారు. ఇంకొందరు అత్యాచారం చేసి హత్య చేస్తున్నారు. పురుషులైతే ఫోన్లు, డబ్బు దోచుకుంటున్నారు. కొందరు మహిళలు పిల్లల్ని వెంటపెట్టుకుని తాగేందుకు వస్తుంటారు. వారికి కల్లుతాగించి చిన్నారులను ఎత్తుకెళ్లడం వంటి ఘటనలు నమోదవుతున్నాయి. కల్లులో మత్తు స్థాయిని పరిశీలించేందుకు నిర్వాహకులు వ్యసనపరులకు ఉదయాన్నే ఉచితంగా కల్లు ఇస్తారు. వారు రోజువారీలాగే ప్రవర్తిస్తే మత్తు సాధారణ స్థాయిలో ఉన్నట్లు. స్పృహ తప్పి పడిపోతే మోతాదు ఎక్కువైనట్లు. అప్పటికే అనారోగ్యంతో బాధపడే వీరంతా మత్తులో స్పృహతప్పి ప్రాణాలు విడుస్తుంటారు. వారిని దుకాణం నిర్వాహకులు సమీపంలోని కాలిబాటలు.. రోడ్ల వెంట విసిరేస్తున్న ఘటనలు తరచూ వెలుగులోకి వస్తున్నాయి. గతంలో రాజేంద్రనగర్‌లోని ఓ దుకాణం వద్ద అలాంటి ఘటన జరిగింది.


**మహిళలే లక్ష్యం** మహిళలే బాధితులుగా ఉంటున్నారు. కూలీ పనులు చేసుకునేవారు, గ్రామీణ ప్రాంతాల నుంచి ఉపాధి కోసం వచ్చిన అతివలే ఎక్కువగా దుకాణాలకు వెళ్తుంటారు. వారి ఒంటిమీద బంగారం, కొంత డబ్బు ఉండే అవకాశం ఉంటుంది. ఈ సొత్తు కోసం నేరగాళ్లు దారుణాలకు పాల్పడుతున్నారు. 2021 జనవరిలో కల్లు దుకాణాల దగ్గర మహిళల్ని హత్య చేస్తున్న సైకోను హైదరాబాద్, రాచకొండ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడు మొత్తం 18 మందిని హత్య చేశాడు. మత్తులో మహిళలతో మాట కలిపి ఒంటిమీదున్న సొత్తు దోచుకొని చంపేశాడు. గతేడాది మల్కాజిగిరిలో కల్లు తాగేందుకు వచ్చిన మహిళను అత్యాచారం చేసి చంపేశారు.

# మెట్రో రెండోదశకు మార్గం సుగమం

హైదరాబాద్: హైదరాబాద్ మెట్రోరైలు రెండోదశకు మార్గం సుగమమైంది. మెట్రో మొదటి దశను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని నిర్ణయించడంతో ఇప్పటివరకు నెలకొన్న ప్రతిష్ఠంభన తొలిగిపోయింది. ఈ మేరకు ప్రభుత్వం, మెట్రోరైలును నిర్వహిస్తున్న ఎల్ అండ్ టీ సంస్థ ఇటీవల ఒక అవగాహనకు వచ్చాయి. తదుపరి ప్రక్రియను ఇరు సంస్థలు ప్రారంభించాయి. ఇదే విషయాన్ని కేంద్రానికి నివేదించి రెండోదశ ఏ, బి డీపీఆర్‌లకు ఆమోదం తెలపాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరనుంది.

కేంద్రం అనుమతి కోసం..

మెట్రోరైలు మొదటిదశ మూడు మార్గాల్లో 69.2 కి.మీ. మేర ప్రస్తుతం అందుబాటులో ఉంది. దీనికి కొనసాగింపుగా మెట్రోరైలు 2(ఏ)లో ఐదు మార్గాల్లో 76.4 కి.మీ. ప్రతిపాదించారు. 2(బి)లో మూడు మార్గాల్లో 86.1 కి.మీ. ప్రతిపాదించారు. ఈ రెండోదశ విస్తరణను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ప్రాజెక్ట్‌గా చేపట్టాలని డీపీఆర్ రూపొందించారు. మొదటిదశ ప్రాజెక్ట్, ఆపరేషన్స్ రెండింటిని రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటే తమకు అభ్యంతరం లేదని కేంద్రం చెప్పింది. దీంతో సర్కారు ముందుకొచ్చింది. ఇదే విషయాన్ని కేంద్ర సర్కారుకు



లిఖిత పూర్వకంగా తెలపనుంది.

**పీటముడి వీడటంతో..**

ఎల్ అండ్ టీ నుంచి హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్ట్ రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలోకి వచ్చేందుకు వచ్చే ఏడాది మార్చి నెలాఖరు వరకు సమయం పడుతుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఎల్ అండ్ టీ, ప్రభుత్వం మధ్య అవగాహనను వెల్లడించి కేంద్రం అనుమతులు కోరనుంది. కేంద్ర మంత్రిమండలి ఆమోదం తెలిపితే ఆ మేరకు మార్గం సుగమం కానుంది.

# కోటా ఖరారు.. ఇక పోటీయేనా!

ఖమ్మం : స్థానిక ఎన్నికల నిర్వహణలో ప్రధానమైన రిజర్వేషన్ల ప్రక్రియ ముగిసింది. జడ్పీ ఛైర్‌పర్సన్ సహా జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీ సర్పంచి, వార్డు సభ్యుల స్థానాలకు సంబంధించి రిజర్వేషన్లపై ప్రభుత్వం అధికారికంగా గెజిట్ విడుదల చేసింది.

**ఎన్నికల వేడి పెరిగినా..**

రిజర్వేషన్ల ఖరారుతో జిల్లా వ్యాప్తంగా ఏ గ్రామంలో ఎవరు పోటీకి అర్హులో తేలిపోయింది. నిన్నమొన్నటి వరకు తాము ఆశించిన స్థానంలో పోటీ చేసే అవకాశం ఉందో లేదో తేటతెల్లమైంది. దీంతో ఒక్కసారి రాజకీయ వేడి మొదలైంది. ఏ స్థానంలో ఎవరు బరిలో నిలవాలో తేలిపోవటంతో సామాజిక వర్గాల వారీగా ఓట్ల గుర్తింపు, ఇతర లెక్కల్లో కొందరు నాయకులు నిమగ్నమయ్యారు. ఇదే సందర్భంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల జీవో కోర్టు విచారణ పరిధిలో ఉన్న నేపథ్యంలో



ప్రస్తుతం ఖరారైన రిజర్వేషన్లు అదేవిధంగా కొనసాగేనా అన్న సందేహాలూ దిగువ శ్రేణిలో వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం మాత్రం రెండు దశల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు, మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. వీటి ఆధారంగానే రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ జారీ చేయనున్నట్లు సమాచారం. నేడోరేపో స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

**తెల్లవారుజాము వరకూ..**

జిల్లాలోని 20 జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలకు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి కలెక్టరేట్‌లో శనివారం రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేశారు. అనంతరం ఖమ్మం ఆర్డీఓ నర్సింహారావు తన పరిధిలోని 14 మండలాల్లోని ఎంపీటీసీ స్థానాలు, పంచాయతీ సర్పంచి స్థానాల్లో రిజర్వేషన్ల ప్రక్రియ చేపట్టి అర్ధరాత్రి వరకు ముగించారు. కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ 6 మండలాల్లో ఈ ప్రక్రియను ముందుగానే పూర్తి చేశారు. మండల స్థాయిలో ఎంపీడీఓలు వారి పరిధిలోని పంచాయతీ వార్డులకు రిజర్వేషన్లు ముగించారు. వీటన్నింటినీ జిల్లా వారీగా కూర్పు చేసేందుకు అధికారులు, ఉద్యోగులు శనివారం రాత్రంతా పనిచేశారు. ఆదివారం ఉదయం 5 గంటలకు మొత్తం ప్రక్రియ ముగించి కలెక్టర్ సంతకాలు తీసుకున్నారు. గెజిట్(రాజపత్రం) విడుదల చేశారు. తర్వాత సీల్డ్ కవర్లలో హైదరాబాద్ తీసుకెళ్లి పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం అప్పగించారు. జడ్పీ సీఈఓ దీక్షారైనా, డీపీఓ ఆశాలత సహా ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు రాత్రంతా విధులు నిర్వహించారు.

# అరకొర వసతులు..

# అద్దె భవనాలు

ఖమ్మం : వెనకబడిన వర్గాలకు చెందిన విద్యార్థుల ఉన్నతికి వీలుకల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బీసీ సంక్షేమ వసతి గృహాలను నిర్వహిస్తోంది. మంచి వసతి, భోజన సదుపాయం సమకూరుస్తూ పిల్లల విద్యాభివృద్ధికి దోహదపడాలనే ఉద్దేశంతో వీటిని ఏర్పాటు చేశారు. జిల్లాలో ప్రభుత్వ ఉద్దేశానికి భిన్నంగా కొన్ని వసతి గృహాల పరిస్థితి ఉంది. ఉంటే శిథిల గదులు లేకుంటే అద్దె భవనాలు అన్న పరిస్థితి నెలకొంది. జిల్లాలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రీమెట్రిక్ వసతి గృహాలు 20 ఉన్నాయి. ఇందులో 18 సొంత భవనాలు ఉన్నాయి. 2 అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. కళాశాల వసతి గృహాలు 11 ఉన్నాయి. అందులో 8 అద్దె భవనాలు ఉండగా.. మూడు సొంత భవనాల్లో కొనసాగుతున్నాయి. అద్దె భవనాలకు ఏడాదికి సుమారు రూ.40 లక్షల వరకు చెల్లిస్తున్నారు. సొంత భవనాలు చాలా దశాబ్దాల క్రితం నిర్మించినవి కావటంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ముదిగొండలోని బీసీ వసతి గృహం అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. అది కూడా పాత భవనంలో మనుగడ సాగిస్తోంది.

ఖమ్మం నగరంలో అనేక బీసీ వసతి గృహాలు అద్దె భవనాల్లో మగ్గుతున్నాయి. సౌకర్యంగా లేవు. నయాబజార్ పాఠశాల ప్రాంగణంలోనే



బీసీ బాలుర వసతి గృహం కొనసాగిస్తున్నారు. దీన్ని నిర్మించి చాలాకాలమైంది. గుట్టల బజార్‌లో ఉన్న హాస్టల్ శిథిలావస్థకు చేరింది. నూతనంగా నిర్మించాల్సిన కొత్త భవనాల్లో దీన్ని చేర్చారు. కానీ ఇంతవరకు పనులు ప్రారంభించలేదు.

శిథిలావస్థకు చేరిన ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడు బీసీ వసతి గృహ భవనాన్ని మూసివేసి ఎస్సీ వసతి గృహంలోకి విద్యార్థులను తరలించారు. తల్లాడలో విద్యార్థుల లేకపోవడంతో మూసివేశారు.

'జిల్లాలో తిరుమలాయపాలెం, పెనుబల్లి, సత్తుపల్లి, చిన్నకోరుకొండి తదితర ప్రాంతాల్లో నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. పాత వాటి మరమ్మతులకు బిల్లులు మంజూరు కావాల్సి ఉంది. ప్రస్తుతం ఖమ్మం నియోజకవర్గంలోని వి.వెంకటాయపాలెం, ముస్తఫానగర్ బీసీ వసతి గృహాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి.'

జి.జ్యోతి, బీసీ సంక్షేమశాఖ డీడీ

# పెసర రైతుకు పెద్ద కష్టం

ఖమ్మం : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఈ ఏడాది పెసర పంట సాగు చేసిన రైతులు దారుణంగా నష్టపోయారు. పంట చేతికొచ్చిన సమయంలో భారీ వర్షాలు కోలుకోలేని దెబ్బతీశాయి. పక్షం రోజుల నుంచి విడువని వానలతో పంట పూర్తిగా రంగు మారింది. ఇదే అదునుగా వ్యాపారులు నాణ్యత పేరుతో ధరలు తగ్గించేశారు. కష్టకాలంలో ఆదుకోవాల్సిన మార్క్‌ఫెడ్ ముఖంచూపటమే మానేసింది. ఉమ్మడి జిల్లాలో సుమారు 19వేల ఎకరాల్లో పెసర సాగైంది. చింతకాని, కొణిజర్ల, ఏన్కూరు, ముదిగొండ తదితర మండలాల్లో దీన్ని ఎక్కువగా పండించారు. కేంద్రం ఈ ఏడాది పెసలకు క్వింటాకు రూ.8,768 కనీస మద్దతు ధర ప్రకటించింది. దిగుబడి చేతికొచ్చినా జిల్లాలో ఇంతవరకు మార్క్‌ఫెడ్ ఒక్క పెసల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయకపోవటంతో వ్యాపారులదే ఇష్టారాజ్యమైంది. నాణ్యత లేదనే సాకుతో ఎక్కువ సరకును క్వింటా రూ.2వేల నుంచి రూ.4వేల వరకు కొనుగోలు చేస్తున్నారు. మద్దతు ధర అటుంచి కూలీల ఖర్చు సైతం వచ్చే పరిస్థితి లేదు. సరకు బాగున్నా ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో రూ.6,500 మించి రావటం లేదు.

# హెచ్చరికలు కరవు

చిన్నకోడూరు : చుట్టూ పచ్చని అందాలు, పక్షుల కిలకిలరావాలకు తోడుగా జలసవ్వడులతో సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ శివారులోని రంగనాయకసాగర్ జలాశయం ప్రకృతి ప్రేమికులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఆ అందాలను తిలకిస్తూ జలాశయంలో కేరింతలు కొడుతూ ఆనందంలో మునిగి తేలాలని పర్యాటకులు ఉవ్విళ్లూరుతుంటారు. జలాశయం వద్ద కనీస సదుపాయాలు లేకపోవడంతో పాటు హెచ్చరికలు మచ్చుకైనా కానరావడం లేదు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో కలిసి సరదాగా గడిపేందుకు వచ్చే సందర్శకులు అజాగ్రత్త, నీటి లోతుపై అవగాహన లేక కొన్ని సందర్భాల్లో ప్రమాదంలో చిక్కుకుం



టున్నారు. ఈత, స్వీయ చిత్రాల కోసం జలాశయంలోకి దిగి ఇప్పటి వరకు సుమారు 20 మంది ప్రమాదవశాత్తు మృతి చెందారు. ముఖ్యంగా మెట్ల మార్గంలో ఎలాంటి కంచె నిర్మించలేదు. ఎక్కువ అధికారులు స్పందించి రక్షణ కంచె ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. వరంగల్‌కు చెందిన రెండు కుటుంబాల్లో మొత్తంగా 11 మంది ఈ ఏడాది మేలో రంగనాయకసాగర్ జలాశయం సందర్శనకు వచ్చారు. అందరూ జలాశయంలోకి దిగారు. ఈ క్రమంలో పదమూడేళ్ల బాలిక మునిగిపోతుండగా.. ఆమెను రక్షించేందుకు వెళ్లిన పదిహేనేళ్ల బాలుడు గల్లంతయ్యాడు. పోలీసు, ఫైర్ సిబ్బంది గంటసేపు వెతికి ఇద్దరిని బయటకు తీయగా అప్పటికే మృతి చెందారు. విషాద ఘటనలు జరుగుతున్నందున అధికారులు వెంటనే రక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# శిఖం చిక్కిపోతోంది!

మంచిర్యాల : హమాలీవాడలోని పోచమ్మ చెరువు విస్తీర్ణం ఆది నుంచి వివాదంలో ఉంది. నీటి పారుదల శాఖ రికార్డు ప్రకారం ఆ చెరువు శిఖం 64.39 ఎకరాలు ఉంది. రెవెన్యూ రికార్డు ప్రకారం అయిదెకరాలు ఉంది. ఆ రెండు శాఖల మధ్య సమన్వయ లోపంతో ఆ చెరువు చుట్టూ అనేక మంది అక్రమంగా భవనాలు నిర్మించుకొని నివాసం ఉంటున్నారు. మంచిర్యాల హైటెక్‌సిటీ–జన్మభూమినగర్ కాలనీల మధ్య 47.32 ఎకరాల్లో రాముని చెరువు విస్తరించి ఉంది. చెరువు శిఖంలో గతంలో హైటెక్‌సిటీ వెంచర్ యజమానులు అక్రమంగా రెండు రహదారులు నిర్మించారు. అప్పుడులో ప్రచురితమైన కథనానికి నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి రహదారులను తొలగించారు. రాజకీయ నాయకులు జోక్యం చేసుకొని ప్రజలకు సౌకర్యం పేరుతో మళ్లీ ఆ శిఖం భూమిలో ఆ రహదారులు నిర్మించారు. ఆ చెరువు శిఖం భూమిని కబ్జా చేయడానికి కొందరు గుడి నిర్మాణం పేరుతో చుట్టూ కంచె ఏర్పాటు చేశారు. రెవెన్యూ అధికారులు కంచెను



తొలగించారు. నేటికీ ఆ స్థలం వివాదంలోనే ఉంది.

మంచిర్యాల నగరంలో చెరువు శిఖం భూములు ఆక్రమణకు గురవుతున్నా.. రక్షణ కల్పించాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. భూ అక్రమార్కులు శిఖం భూములను కబ్జా చేయడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఇక్కడ ఎనిమిది చెరువులు ఉంటే ఇప్పటికే రాముని చెరువు, పోచమ్మ, సాయికుంట చెరువు శిఖం సరిహద్దు భూములు ఆక్రమణకు గురయ్యాయి.

ఆరేళ్ల కిందట అప్పటి కలెక్టర్ ఆర్వీ కర్ణన్ రాముని చెరువు, పోచమ్మ చెరువుల భూమి సర్వే కోసం రూ.8 లక్షలు కేటాయించారు. రాముని చెరువు కొలతలు వేయించి హద్దురాళ్ల (సిమెంట్ దిమ్మెలు) ఏర్పాటు చేయించారు. హమాలీవాడలోని పోచమ్మ చెరువును అధికారులు సర్వే చేయడానికి వెళ్తే అక్కడి కాలనీవాసులు అడ్డుకున్నారు. తర్వాత వచ్చిన కలెక్టర్లు శిఖం భూములకు రక్షణ కల్పించడంపై ఆసక్తి చూపించడం లేదు. జిల్లా నీటి పారుదల, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు సమన్వయంతో చెరువు శిఖం భూములకు రక్షణ కంచె లేదా సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# బేగంపేటలో అరుదైన విజ్ఞాన సంపద

హైదరాబాద్ : మాజీ ప్రధాని పీవీ నరసింహారావు తన అభీష్టం మేరకు సేకరించిన అరుదైన పుస్తకాలు, అపారమైన విజ్ఞానాన్ని అందించే అరుదైన గ్రంథాలతో బేగంపేట బ్రాహ్మణవాడిలోని పీవీ స్మారక గ్రంథాలయం విశేష పాఠకాదరణ పొందుతోంది. స్వాతంత్ర్యోద్యమం నుంచి పీవీ హయాం వరకు చోటుచేసుకున్న ఘటనలు, ప్రముఖుల జీవిత విశేషాలు, జాతీయ నేతల కీలక ప్రసంగాలు, వారి ఆలోచనల నుంచి జాలువారిన అక్షర సుమాలు, నాడు లోక్‌సభ, రాజ్యసభల్లో జరిగిన చర్చల విశేషాలు వంటి వేలాది పుస్తకాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. బహుభాషా కోవిదుడిగా గుర్తింపు పొందిన పీవీ తన కోసం సేకరించినవి, కొనుగోలు చేసినవి, రచయితలు బహుమతిగా ఇచ్చినవి వెరసి సుమారు పది వేలకుపైగా ఇందులో ఉన్నాయి. భారత రాజకీయ, సామాజిక చరిత్రలకు నిలువుటద్దాలుగా నిలుస్తున్నాయి. 1996లో ఏర్పాటైన ఈ భాండాగారం ఇతర గ్రంథాలయాలకంటే ఎంతో భిన్నమైనది. దీనిని పీవీ కూతురు, ఎమ్మెల్సీ వాణీదేవి నిర్వహిస్తున్నారు.

**ఎన్నో అరుదైన పుస్తకాలు..**

స్వాతంత్ర్యోద్యమంలో ప్రముఖుల ప్రసంగాలు, రచనలు వీటిలో ఉన్నాయి. నెహ్రూ, అంబేడ్కర్, బాబూ రాజేంద్రప్రసాద్, శాస్త్రవేత్తగా పనిచేసిన కాలంలో అబ్దుల్‌కలాం, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ ఆటోబయోగ్రఫీ, వారి కీలక ప్రసంగాలు, ఆర్థిక వ్యవహారాల విశేషాలు, లోక్‌సభ, రాజ్యసభల్లో చర్చకు వచ్చిన పలు కీలకాంశాలు, ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ కాంగ్రెస్ నేతల కార్యకలాపాలు, ఆర్థిక, గ్రామీణాభివృద్ధి వివరాలు, గాంధేయవాదం, విశ్వనాథ సత్యనారాయణ, పాటూరి ప్రభాకర్‌శాస్త్రి అక్షర సంపద ఉన్నాయి. పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అవసరమైన పుస్తకాలున్నాయి. దీన్ని స్టడీ సెంటర్‌గా తీర్చిదిద్దాలని, పరిశోధన కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రయత్నిస్తున్నట్లు కేంద్రం నిర్వాహకులు, సురభి సోలార్ ఎనర్జీ కేంద్రం డైరెక్టర్ శేఖర్ మారంరాజు తెలిపారు.

# వ్యాపారుల కొర్రీ.. వినియోగదారులు వర్రీ



మెదక్ : మెదక్‌లో జీఎస్టీ (వస్తుసేవల పన్ను) సంస్కరణల ప్రభావం నిత్యావసర వస్తువులకు వర్తించడంలేదు. ధరలు తగ్గించి విక్రయించాల్సి ఉండగా, పాత ఎంఆర్‌పీకే విక్రయిస్తున్నారు. దీంతో వినియోగదారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక భారం తగ్గుతుందని ఆశించిన వారికి నిరాశే ఎదురవుతోంది. పన్ను విధానం ఈనెల 22 నుంచి అమల్లోకి వచ్చినా, ఎక్కడా ధరలను తగ్గించి విక్రయించడం లేదు. పాతస్టాకే ఉందని చెబుతున్నారు. కంపెనీల నుంచి తగ్గిన ధరలు రాలేదని సాకులు చెబుతుండగా, సవరించిన వివరాలను సదరు కంపెనీలు ప్రకటిస్తాయని, ఆ ప్రకారం విక్రయించాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు. జిల్లాలోని ఆయా పట్టణాల్లో బృందం వస్తువులను పరిశీలించగా పాత ధరలకే విక్రయిస్తున్నారు. జిల్లాలో మెదక్, నర్సాపూర్, తూప్రాన్, రామాయంపేట పురపాలికలతో పాటు చేగుంట, పెద్దశంకరంపేట ప్రధాన పట్టణాలతో పాటు మండల కేంద్రాల్లో ఆయా రంగాల వ్యాపారం జోరుగా సాగుతుంది. ఆయా రంగాలకు సంబంధించి వ్యాపారం రూ.10 కోట్ల వరకు ఉంటుంది. జిల్లాలోని నాలుగు బల్దియాల్లో ప్రధాన సరకుల కేంద్రాలను పరిశీలిస్తే ఎక్కడా తగ్గింపు ధరలకు విక్రయించడం లేదు. పాత స్టాక్ అయిపోయాక, కొత్తవి వచ్చాకే అమలు చేస్తామని వ్యాపారులు చెబుతున్నారు. ఆయా వస్తువులకు ఎమ్మార్పీలు సైతం పాత ధరలే ఉన్నాయి. సిమెంట్ ధర రూ.330 ఉంటే రూ.20 వరకు తగ్గింది. పాల ప్యాకెట్ల ధరలు తగ్గలేదు. దుకాణాల్లో ఎక్కడా తగ్గింపు ధరల బోర్డులను ఏర్పాటు చేయకపోవడం గమనార్హం.

**ఫిర్యాదు ఇలా...**

మెదక్‌లోని వాణిజ్యపన్నుల శాఖ కార్యాలయం(ఎస్‌జీఎస్టీ), కేంద్ర జీఎస్టీ(సీజీఎస్టీ) కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చని అధికారులు పేర్కొన్నారు. లేదంటే టోల్‌ఫ్రీ నంబరు 1915 లేదా, 18004253787 హెల్ప్‌డెస్క్‌లో సంప్రదించాలని సూచించారు.

దేవేందర్, సహాయ కమిషనర్, వాణిజ్యపన్నుల శాఖ, మెదక్

కేంద్ర ప్రభుత్వం సవరించిన ధరల ప్రకారం వస్తువులను విక్రయించాలి. తగ్గించిన ధరల వివరాలు సదరు కంపెనీలు డీలర్లకు తెలియజేస్తాయి. జీఎస్టీ వసూలు చేస్తే ఫిర్యాదు చేస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

బోర్డులు ప్రదర్శించాలి: రవిగౌడ్, నర్సాపూర్

ఏయే వస్తువులపై ఎంత జీఎస్టీ తగ్గుతుందనేది వ్యాపారులకు సదరు కంపెనీలు ఇన్‌వాయిస్ అందించాలి. వాటిని దుకాణాల్లో బహిరంగంగా ప్రదర్శించాలి.

# చనాఖ.. ఆశలు నెరవేరక!



ఆదిలాబాద్ : తెలంగాణ స్వరాష్ట్రమైన తొలినాళ్లలో పురుడు పోసుకున్న చనాఖ–కోర్ట బ్యారేజీ పనుల్లో నెలకొన్న ప్రతిష్టంభన వీడటం లేదు. అప్పటి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ప్రాజెక్టు రిజర్వాయర్ ఆనకట్ట నిర్మాణానికి ఎకరాకు రూ.8 లక్షల చొప్పున పరిహారం చెల్లించింది. ఆ తర్వాత పరిహారాన్ని ఎకరాకు రూ.7 లక్షలకు పరిమితం చేయడంతో రైతులు భూములు ఇవ్వడానికి ముందుకురావడం లేదు. ఫలితంగా లోయర్ పెన్‌గంగా కాల్వ ద్వారా 35 వేల ఎకరాలకు నీరిచ్చేలా అవసరమైన పిల్ల కాల్వల భూ సేకరణ ఆగిపోయింది. వర్షాకాలంలో హత్తిఘాట్ నుంచి నీటిని ఎత్తిపోసేలా భీంపూర్ మండలంలో నిర్మించే పిప్పల్‌కోటి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఆనకట్ట కోసం 180 ఎకరాలను సేకరించారు. అయితే, నీటి నిల్వ సహా చనాఖ–కోర్ట బ్యారేజీ కాల్వ(సీకేబీసీ) కోసం సేకరించాల్సిన 820 ఎకరాలకు చెల్లించే పరిహారం ఎటూతేలడం లేదు. చనాఖ–కోర్ట బ్యారేజీని అంతర్రాష్ట్ర ప్రాజెక్టు అని ప్రకటించుకోవడం తప్పితే సాగునీరు అందించాలనే ఆశయం నెరవేరటం లేదు.

**ప్రధాన అంశాలు**

తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులో భూసేకరణ అవసరం లేకుండా ప్రభుత్వం పెన్‌గంగా నదిపై చనాఖ–కోర్ట బ్యారేజీని నిర్మించింది. ఇక్కడ కేవలం 0.8 టీఎంసీల నీరే నిలువ ఉంటుంది. వర్షాకాలంలో 5 టీఎంసీల పైబడి వచ్చే నీటి లభ్యతను సద్వినియోగం చేసుకునేలా ఎగువనున్న భీంపూర్ మండలంలో 1.4 టీఎంసీల సామర్థ్యంతో పిప్పల్‌కోటి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులు చేపట్టింది. 180 ఎకరాల విస్తీర్ణంలో 4.2 కి.మీ. పొడవుతో కట్ట నిర్మాణం చేస్తోంది.

ఎల్‌పీసీ పిల్ల కాల్వల కోసం 100 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉంది. ఎకరాకు కనీసం రూ.10 లక్షల చొప్పున పరిహారాన్ని పరిగణనలోకి తీసుకుంటే రూ.100 కోట్లు అవసరం.

పిప్పల్‌కోటి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కోసం మరో 820 ఎకరాల పరిహారం కోసం రైతులు ఎకరాకు రూ.30 లక్షల చొప్పున డిమాండ్ చేయడంతో ప్రతిష్టంభన నెలకొంది.

**కట్టకే పరిమితం**ఇది పిప్పల్‌కోటి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కట్ట.. ఈ ప్రాజెక్టు పంట చేలకు నీరందించలేక ఇలా అలంకారప్రాయంగా మిగిలింది. **పరిహారం అత్యల్పం..**నసీరుద్దీన్, భూ నిర్వాసితుడు, పిప్పల్‌కోటి–ాకున్న అయిదెకరాలు రిజర్వాయర్ కింద పోతోంది. రిజర్వాయర్ పక్కన భూముల ధరలు ఎకరాకు రూ.40 లక్షలు పలుకుతుంటే.. మాకేమో రూ.7 లక్షల చొప్పున ఇస్తామని అంటున్నారు. ముంపు ప్రాంతంగా ప్రభుత్వం నిర్ణయించడంతో వేరేవాళ్లు కూడా కొనడానికి ముందుకు రావడం లేదు.

# కలగానే ఉపాధి కల్పన




ఉట్నూరు : నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన కలగానే మిగులుతోంది. గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ అండ్ మార్కెటింగ్ మిషన్(ఈజీఎంఎం), ఐటీడీఏ ఆధీనంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్(వైటీసీ)లలో యువత ఆసక్తి, అభిరుచికి అనుగుణంగా నైపుణ్యాల శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పించాల్సి ఉంది. కానీ ప్రభుత్వం నిధులను కేటాయించడం విస్మరించింది. ఫలితంగా శిక్షణ లేక కేంద్రాలు వెలవెలబోతున్నాయి. యువతకు ఉపాధి కరవైంది. గ్రామీణాభివృద్ధిశాఖ ఈజీఎంఎం ద్వారా ప్రతి మూడు నెలలకోసారి ఉచిత భోజనం, నివాస వసతితో యువతకు కంప్యూటర్, ఇతర శిక్షణలను నిర్వహించేది. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఆయా కంపెనీలలో ఉపాధి కల్పించేది. శిక్షణల నిర్వహణకు ఏటా రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ నిధులను కేటాయించి కార్యక్రమాలు జరిగేలా పర్యవేక్షించేది. కానీ రెండేళ్ల నుంచి నిధులు కేటాయింపు లేక శిక్షణలు నిలిచిపోయాయి. ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉట్నూరు, బెల్లంపల్లి, ఇచ్చోడ, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ మండలాల్లో 2016లో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐదు వైటీసీలను నెలకొల్పింది. ప్రతి జిల్లాకు ఒక జాబ్ మేనేజర్, వార్డెన్, మొబలైజర్లు, బోధకులను నియమించారు. వైటీసీల నిర్వహణకు ప్రభుత్వం ఏటా రూ.3–4 కోట్ల నిధులను కేటాయించేది. దీంతో వైటీసీల పరిధిలోని మండలాల్లో నిరుద్యోగ ఆదివాసీ గిరిజన యువతీయువకులను ఎంపిక చేసి ఉచిత భోజనం, నివాస వసతి కల్పిస్తూ.. కంప్యూటర్ ప్రోగ్రామింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్, బ్యాంకింగ్, ఫైనాన్స్ తదితర కోర్సులలో శిక్షణ కల్పించేవారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉపాధి కల్పించేందుకు రాష్ట్రంలోని ప్రముఖ కంపెనీలను ఆహ్వానించి జాబ్ మేళాలు ఏర్పాటు చేసి అభ్యర్థులకు ఉద్యోగాలను కల్పించేవారు.

**ప్రస్తుత పరిస్థితి..**వైటీసీలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. ఐటీడీఏకు రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ నిధుల కేటాయింపులో తీవ్ర జాప్యం చేస్తోంది. 2023–24, 2024–25 ఆర్థిక సంవత్సరాల్లో నిధులు కేటాయిస్తామని ప్రకటించి ఆశలు రేకెత్తించారు. కానీ కేటాయింపు విస్మరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు మంజూరు చేసి శిక్షణలను పునరుద్ధరిస్తే నిరుద్యోగ గిరిజన యువత ఉద్యోగ, ఉపాధి పొందేందుకు అవకాశం ఉంటుంది.

**సర్కారీ కొలువుల కోసం..**

పీఈటీసీల్లో నైపుణ్యాల శిక్షణ, ఉపాధి కల్పించడంతోపాటు ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న గిరిజన యువతకు కానిస్టేబుల్, ఎస్ఐ, గ్రూప్–2, గ్రూప్–4, ఆర్ఆర్‌బీ, ఉపాధ్యాయ, అటవీశాఖ ఉద్యోగాల కోసం ప్రత్యేక శిక్షణ ఇచ్చేవారు. ఉచితంగా అభ్యాసన సామగ్రి అందజేస్తూ.. వారు ఉద్యోగాలు సాధించేలా ప్రోత్సహించేవారు.

# పల్లె పోరుకు సర్వసన్నద్ధం

ఖమ్మం : స్థానిక సంస్థల ఎన్నికలకు మరో అడుగు పడింది. బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై బీసీ సంక్షేమశాఖ జీఓ విడుదల చేయటంతో పల్లెల్లో ఎన్నికల వేడి రాజుకుంది. ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న అధికార కాంగ్రెస్ పార్టీ అడుగడుగునా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. మంత్రులు మల్లు భట్టివిక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తూనే పార్టీ బాధ్యులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలని భారాస ఉవ్విళ్లూరుతోంది. ఖమ్మం నియోజకవర్గ కార్యకర్తలతో మాజీ మంత్రి పువ్వాడ అజయ్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సమావేశమై దిశానిర్దేశం చేశారు.

**జీఓతో స్పష్టత**

నోటిఫికేషన్ ఎప్పుడొచ్చినా.. ఎన్నికలు నిర్వహించటానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. పంచాయతీ, పరిషత్తు ఎన్నికల ఓటరు, పోలింగ్ కేంద్రాల తుది జాబితాలను ప్రకటించారు. పోలింగ్ పెట్టెలను




మహారాష్ట్ర, గుజరాత్ నుంచి తెప్పించారు. తాజాగా ఎస్టీ, ఎస్సీ, బీసీ రిజర్వేషన్ల నిర్ధారణ ప్రక్రియ చేపట్టారు. వార్డు సభ్యులు, సర్పంచి, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులతోపాటు ఎంపీపీ రిజర్వేషన్లను జిల్లాస్థాయిలో రహస్యంగా కేటాయించి ఆమోదం కోసం పంచాయతీరాజ్‌శాఖకు పంపించారు. రిజర్వేషన్లపై స్పష్టత లేకపోవటంతో పాత విధానంలో ఎన్నికలు ఉంటాయా.. లేదంటే బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయా అనే సందేహం సర్వత్రా వ్యక్తమైంది. బీసీ సంక్షేమశాఖ జీఓతో స్పష్టత వచ్చింది.

**శిక్షణ షురూ..**

పంచాయతీ, పరిషత్తు ఎన్నికల రిటర్నింగ్ అధికారి(ఆర్ఓ), సహాయ రిటర్నింగ్ అధికారి(ఏఆర్ఓ)లుగా గెజిటెడ్ అధికారులు, మండల ప్రత్యేకాధికారులు వ్యవహరించనున్నారు. పంచాయతీ ఎన్నికలకు భద్రాద్రి జిల్లాలో 742 మంది ఆర్ఓలు, ఏఆర్ఓలకు కొత్తగూడెం క్లబ్‌లో, ఖమ్మం జిల్లాకు సంబంధించి 700 మందికి భక్తరామదాసు కళాక్షేత్రంలో మాస్టర్ ట్రైనర్లు శుక్రవారం శిక్షణనిచ్చారు. ఖమ్మంలో 200మంది గైర్హాజరవగా వీరికి శనివారం తర్ఫీదు ఇస్తారు. డీపీఓ ఆశాలత పాల్గొన్నారు. పరిషత్తు ఎన్నికల ఆర్ఓ, ఏఆర్ఓలుగా ఎంపికైన మండల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలకు భద్రాద్రి జిల్లాలో కలెక్టరేట్‌లో, ఖమ్మం జిల్లాలో టీటీడీసీ భవనంలో శిక్షణ ఇచ్చారు. అదనపు కలెక్టర్లు శ్రీజ, విద్యాచందన, జడ్పీ సీఈఓలు దీక్షారైనా, నాగలక్ష్మి పాల్గొన్నారు.

**జిల్లాలో..**పంచాయతీలు: 471 ఎంపీటీసీలు: 233
జడ్పీటీసీలు: 22 ఎంపీపీలు: 22

# భద్రాద్రి.. ఒడిసిపట్టింది

ఖమ్మం : వాననీటి సంరక్షణలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జాతీయ స్థాయిలో ప్రత్యేకతను చాటింది. కేంద్ర ప్రభుత్వం గురువారం ప్రకటించిన జల్ సంచయ్ జన్ భాగీదారీ–1.0 ర్యాంకుల్లో రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాలు గుర్తింపు పొందగా.. అందులో భద్రాద్రి జిల్లా రూ.25 లక్షల బహుమతి విభాగానికి ఎంపికైంది. నీటి వృథాను అరికట్టడానికి ఇంకుడుగుంతలు, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్, పంట కుంటలు, ఊట చెరువులు సహా 29,103 పనులు చేపట్టి భూగర్భజలాల సంరక్షణకు చేసిన కృషికి ఫలితం దక్కింది.

**ఖర్చు తక్కువ.. ఫలితం ఎక్కువ**

నీటి వనరులను సుస్థిరం చేయటానికి గతేడాది కేంద్ర ప్రభుత్వం జల్ సంచయ్ జన్ భాగీదారీ కార్యక్రమం చేపట్టింది. పథకం మార్గదర్శకాలపై ప్రభుత్వాధికారులతోపాటు ప్రజలకు కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ అవగాహన కల్పించారు. ఒక మీటరు చొప్పున పొడవు, వెడల్పు, లోతుతో తక్కువ ఖర్చుతో తవ్వుకునేలా ఇంకుడుగుంతలకు శ్రీకారం చుట్టారు. విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, కార్యాలయాలు, పార్కులు, రోడ్లకు రెండువైపులా, చేతిపంపుల చెంత, నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో అధికారులు వీటిని స్వచ్ఛందంగా నిర్మించారు. 2024 ఏప్రిల్ 1 నుంచి ఈఏడాది మే 31 వరకు భద్రాద్రి జిల్లావ్యాప్తంగా 24,421 ఇంకుడుగుంతలు తవ్వారు. ఉపాధి హామీ పథకం కింద మరో 2,358 ఇంకుడుగుంతలు, 806 పంట కుంటలు నిర్మించారు. 1,255 నీటివనరుల్లో పూడికతీత పనులు చేపట్టారు. 25 ఊట కుంటలు తవ్వించారు.

ఐటీసీ నిధులతో దుమ్ముగూడెంలో 50, చర్ల మండలంలో 183 పంట కుంటలు, సింగరేణి ఆధ్వర్యంలో ఐదు నీటి వనరులను కోల్‌బెల్ట్ ప్రాంతాల్లో నిర్మించారు. ఈ పనులను జేఎస్‌జేబీ ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదుచేయగా.. కేంద్ర నోడల్ అధికారి పృథ్వీరాజ్ పర్యవేక్షించి ఆమోదించారు. ఫలితంగా నగదు బహుమతి దక్కింది.

**స్ఫూర్తి కొనసాగేలా..**

ప్రభుత్వ కార్యాలయాలు, ఖాళీ స్థలాల్లో ఇంకుడుగుంతలు తవ్వించటంతో నీరు నిలిచే బదులు భూగర్భంలోకి ఇంకుతోంది. బహుమతి సాధించిన స్ఫూర్తితో 2.0లోనూ వ్యవసాయ భూములు, గ్రామాల్లో వాననీరు ఎక్కడికక్కడ భూగర్భంలోకి ఇంకటానికి గుంతలు తవ్వించాలని భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ నిర్ణయించారు. ఖమ్మం జిల్లాలో భూగర్భజలాలు అధికంగా ఉన్నాయి. పైగా గతేడాది పనులు ప్రతిపాదించకపోవటంతో 'జల్ సంచయ్ జన్ భాగీదారీ'లో భాగస్వాములం కాలేదని గ్రామీణాభివృద్ధి అధికారులు చెబుతున్నారు. ఈఏడాది రూఫ్ వాటర్ హార్వెస్టింగ్, ఇంకుడుగుంతలు నిర్మించటానికి సమాయత్తమవుతున్నామని తెలిపారు. 'భద్రాద్రి జిల్లాకు బహుమతి ద్వారా అందే రూ.25లక్షలను నీటిసంరక్షణ పనులు, ప్రజా చైతన్య సదస్సులకు వెచ్చిస్తాం. సాంకేతిక నైపుణ్యాలను పెంచుకునేందుకు వినియోగిస్తాం' అని డీఆర్డీఓ విద్యాచందన కు తెలిపారు.

# సామగ్రి కొనలేం.. ఇల్లు కట్టలేం!

కరీంనగర్ : దేవుడు కరుణించినా.. పూజారి కరుణించలేదనట్లుగా మారింది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల పరిస్థితి. నిరుపేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోంది. లబ్ధిదారులను ఎంపిక చేయడంతో వారు పనులను ప్రారంభించారు. దీనిని అదునుగా భావించి కొందరు భవన నిర్మాణ సామగ్రి వ్యాపారులు ధరలు పెంచుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే సొమ్ము సరిపోదని భయపడుతున్నారు.

**రూ.5 లక్షలు సరిపోతాయా?**

పైలట్ ప్రాజెక్టు కింద మొదట జిల్లాలోని 15 మండలాల్లో దాదాపు 477 ఇళ్లు మంజూరు చేశారు. నియోజకవర్గానికి 3500 ఇళ్ల చొప్పున జిల్లా వ్యాప్తంగా నాలుగు నియోజకవర్గాలతోపాటు హుస్నాబాద్‌లోని రెండు మండలాలను కలిపి దాదాపు 14 వేలకు పైగా ఇళ్లు కేటాయించాలని భావించారు. ఇందులో 8000కు పైగా మంజూరై..



చాలా చోట్ల పనులు ప్రారంభమయ్యాయి. మార్కెట్లో నిర్మాణ సామగ్రి ధరల పరిస్థితితో రూ.5 లక్షల వ్యయంతో ఇంటి నిర్మాణం పూర్తయ్యేలా లేదని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. మేస్త్రీలు నిర్మాణ ధరలు, కూలీల ధరలు కూడా పెంచారు.

**జిల్లా, మండల కమిటీల ఏర్పాటు..**

నిర్మాణ సామగ్రి ధరల నియంత్రణకు జిల్లాలో కమిటీలు వేయాలని ప్రభుత్వం కలెక్టర్లకు సూచించింది. జిల్లా స్థాయిలో కలెక్టర్ ఛైర్మన్‌గా, కన్వీనర్‌గా హౌసింగ్ శాఖ పీడీ, సభ్యులుగా అదనపు కలెక్టరు, ఇతర అధికారులు ఉంటారు. మండల స్థాయిలో తహసీల్దార్, ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్, తదితర అధికారులు ఉంటారు.

**నిర్మాణం పూర్తి చేసేదెలా?**

– గద్దం గీత, వెన్కేపల్లి

ఇల్లు మంజూరు కాకముందుతో పోలిస్తే ధరలు ఇప్పుడు చాలా పెరిగాయి. కంకర, సలాక, మొరం, సుతారి, కూలీ రేట్లు 40 శాతం వరకు పెంచారు. ఈ ధరలు తగ్గకపోతే ఇంటి నిర్మాణం పూర్తిచేయలేం.

# అనుమతులు వచ్చినా అంతులేని జాప్యం

ధర్మపురి : నిజామాబాద్–జగ్దల్‌పూర్ జాతీయ రహదారి–63ని పనులకు మొన్నటి వరకు రిజర్వు అటవీ అనుమతుల్లో జాప్యం జరిగింది. ఇటీవల దీనికి అనుమతులు వచ్చినా టెండర్లు ఖరారు చేయడంలో జాప్యం జరుగుతోంది. నిజామాబాద్–జగ్దల్‌పూర్ జాతీయ రహదారిని హామ్(హైబ్రిడ్ యాన్యూటీ మోడ్) పద్ధతిలో రూ.3,850 కోట్ల వ్యయంతో చేపడుతున్నారు. ఈ ప్రాజెక్టు పొడవు 131 కిలోమీటర్ల పొడవును 4 ప్యాకేజీలుగా విభజించారు. ఆర్మూర్–మెట్‌పల్లి, మెట్‌పల్లి–జగిత్యాల, జగిత్యాల–రాయపట్నం, రాయపట్నం– మంచిర్యాలగా పనులను విభజించారు. 2023 డిసెంబరు నుంచి టెండర్ తుది ప్రక్రియ జరుగుతోంది. దీన్ని పలుమార్లు పొడిగించినా ఖరారు కాకపోవడమే జాప్యానికి కారణం అని అధికారుల ద్వారా తెలుస్తోంది.

**కదలిక వచ్చినా.. నిలిచిన ప్రక్రియ**

రెండు నెలల కిందట ఈ జాతీయ రహదారి ప్రక్రియలో కొంత కదలిక వచ్చింది. పుణ్య క్షేత్రాలు, పట్టణాలైన ధర్మపురి, గూడెంలతోపాటు



జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలను కలపకుండా బయట నుంచి నాలుగు వరుసలుగా విస్తరించేందుకు అధికారులు కసరత్తు చేశారు. ఆర్మూర్–మెట్‌పల్లి మధ్య 35 కి.మీ, మెట్‌పల్లి–జగిత్యాల మధ్య 28 కి.మీలు, జగిత్యాల–రాయపట్నం 31 కి.మీలు, రాయపట్నం–మంచిర్యాల మధ్య 35 కి.మీల రహదారిని నిర్మించాలని ప్రతిపాదించారు. ఈ రహదారి భూసేకరణ ప్రక్రియ అంతా పూర్తయింది. 248 మంది రైతుల నుంచి 250 హెక్టార్ల భూమిని సేకరించే ప్రక్రియ పూర్తయింది. రైతులకు సంబంధించిన అభ్యంతరాలపై మరోమారు రెవెన్యూ అధికారులు సర్వే చేసి నివేదికలను సమర్పించారు. అయితే రెండు నెలల కిందటే బుగ్గారం, ధర్మపురి మండలాల్లోని గుట్టల్లోని రిజర్వు అటవీ భూములకు అనుమతులు వచ్చాయి. ఇక కదలిక వచ్చిందనుకున్న సమయంలో టెండర్లు ఓపెన్ కావడం లేదని తెలుస్తోంది. కోర్టు కేసులు లేనిచోట్ల పరిహారం కోసం అవార్డుల ప్రక్రియ పూర్తయింది. టెండరు ఓపెన్ చేయాల్సి ఉంటుందని, టెండరు పూర్తయితేనే పనులు ప్రారంభించే అవకాశముందని సమాచారం.

# జీవాలకు మందులేవీ?

గంభీరావుపేట : జిల్లాలో పశువైద్యం గాలిలా దీపంలా మారింది. పాడి రైతులు, పశు పోషకులకు ఆదరువుగా నిలిచే జీవాలు పలురకాల వ్యాధులతో బాధపడుతుండగా.. ప్రైవేటు వైద్యంతో ఆర్థికంగా నష్టపోతున్నారు. ఏటా వర్షాకాలం ఆరంభంలో గ్రామాల్లో పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేసేవారు. మేకలు, గొర్రెలు, పశువులకు నట్టల నివారణ మందులు అందించేవారు. 16 నెలల నుంచి జిల్లాలోని పశు వైద్యశాలలకు మందులు రావటం లేదు. సంవత్సరంలో నాలుగు సార్లు మందులు రావాల్సిన ఉండగా.. కొన్ని మాత్రమే వస్తున్నాయని.. అవి ఎటూ సరిపోవటం లేదని పశు వైద్యాధికారులు చెబుతున్నారు. దాదాపు రెండు సంవత్సరాల నుంచి మేకలకు, గొర్రెలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేయటం లేదని తెలుస్తోంది. దీంతో ప్రైవేటు దుకాణాల నుంచి మందులు తెచ్చుకుంటున్నారు.

**సిబ్బంది కొరత** జిల్లా వ్యాప్తంగా 17 ప్రాథమిక పశువైద్య కేంద్రాలు, 13 పశువైద్య ఉప కేంద్రాలు ఉన్నాయి. జిల్లాలో 17 మంది వైద్యులకు 13 మంది ఉన్నారు. నాలుగు పశు వైద్య కేంద్రాల్లో డాక్టర్లు లేరు. జిల్లాలోని పశు వైద్యశాలల్లో అటెండర్, కౌంపౌండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సిబ్బంది కొరతతో పశువులకు సరైన వైద్య అందక పశు పోషకులు ఇబ్బందులు పడుతున్నారు.

# ఆహారం విషయంలో మహాత్ముని ప్రయోగాలు - అక్టోబర్ 2... గాంధీ జయంతి



కొల్లాయి గట్టి, చేత కర్రబట్టి, నూలు వడకి, మురికివాడలు శుభ్రం చేసి, అన్ని మతాలూ, కులాలూ ఒకటే అని చాటి, రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడ లాడించిన జాతిపిత మహాత్మా గాంధీజీ. మహాత్ముడనీ, జాతిపిత అనీ పేరెన్నిక గన్న ఆయన ఆంగ్లేయుల పాలన నుండి భారత దేశానికి స్వాతంత్ర్యము సాధించిన నాయకులలో అగ్రగణ్యుడు. 20వ శతాబ్దిలోని రాజకీయ నాయకులలో అత్యధికంగా మానవాళిని ప్రభావితము చేసిన రాజకీయ నాయకునిగా గుర్తింపు పొందారు ఆయన. జాతిపిత మహాత్మాగాంధీ శారీరకంగా దుర్బలుడు అయినా, మానసికంగా మేరు నగధీరుడు. అహింస, సహాయ నిరాకరణ ఉద్యమం లాంటి విషయాల్లో ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, మార్టిన్ లూథర్ కింగ్, నెల్సన్ మండేలా, బరాక్ ఒబామా లాంటి ఎందరో మేధావులకు ప్రేరణగా నిలిచిన గాంధీ జీవితంలో ఆరోగ్య రక్షణ విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు, ఆచరణ పద్ధతులు ఉండేవి. దేశ స్వాతంత్ర్య సాధన యే ఏకైక లక్ష్యంగా, సత్యాగ్రహమే ఆయుధంగా, అహింసా మార్గంలో పయనించి, నిరంతరం అంకిత భావంతో పోరాటాలను నడిపించి, పలు మార్లు జైలు పాలైనా, ఆహారపు అలవాట్లను ఖచ్చితంగా ఆయన పాటించారు. అసలైన విలువ అనేది మన ఆరోగ్యంలోనే ఉంటుంది. అందుకే ఆరోగ్యమే మహాభాగ్యము" అని అంటుండే వారు.. గాంధీజీ ఐదేళ్ల పాటు పండ్లు, గింజలు, నట్స్ మాత్రమే తిన్నారు. కానీ ఆరోగ్య సమస్యలు రావడంతో శాకాహారం తీసుకోవడం ప్రారంభించారు. ఆహారం విషయంలో గాంధీజీ దశాబ్దాల పాటు ప్రయోగాలు చేశారు. "ది మోరల్ బేసిస్ ఆఫ్ వెజిటేరియనిజం, గాంధీ డైట్ అండ్ డైట్ రిఫార్మ్స్, కీ టు హెల్త్ " అనే పుస్తకాలు కూడా రచించారు. సాత్వికాహారంతో మనిషి బుద్ధి వికసిస్తుందని గాంధీగారు త్రికరణ శుద్ధితో విశ్వసించే వారు. లండన్ లోనూ గాంధీ శాకాహారి గానే ఉండేవారు. విధి లేక శాకాహారం తినడం కాదు, లండన్ లో స్వయంగా గాంధీ శాకాహారాన్ని ఎంపిక చేసుకున్నారని, తన రూమ్మేట్ సహాయంతో "లండన్ వెజిటేరియన్ సొసైటీ" ఉందనే వాస్తవం కూడా గాంధీజీ తెలుసు కున్నారని,చివరకు గాంధీ, ఆయన మిత్రుడు వారి నెం.52, సెయింట్ స్టీఫెన్స్ గార్డన్, బేస్ వాటర్ హౌమ్, లో మిత్రులకు పప్పుల చారు, అన్నం, ఎండు ద్రాక్షలతో విందు చేసేవారని "గాంధీ బిఫోర్ ఇండియా" అనే పుస్తకంలో చరిత్రకారుడు రామచంద్రగుహ వివరంగా రాశారు. ఇక గాంధీ డైట్ అండ్ డైట్ రిఫార్మ్స్, ది మోరల్ బేసిస్ ఆఫ్ వెజిటేరియనిజమ్, కీ టు హెల్త్ అనే పుస్తకాలు కూడా రచించారు. గాంధీజీ ఉద్దేశ్యంలో మంచి ఆహారపు అలవాట్లు అనేవి మంచి ఆరోగ్యానికి తప్పనిసరి. ఒక్కో వ్యక్తి శరీరం దాని తత్వాన్ని బట్టి, ఒక్కో రకమైన ఆహారానికి అలవాటు పడుతుంది. కాబట్టి, దానికి అనుగుణం గానే మనిషి ఆహారపు అలవాట్లను చేసు కోవాలి. తాను శాకా హారానికే ప్రాధాన్యం ఇస్తానని గాంధీజీ చెప్పేవారు. శాకాహారం లోకి పాలు, పాల ఉత్పత్తులను కూడా చేర్చాలని గాంధీజీ అనేవారు. పాలు, పాల ఉత్పత్తులను ఆరేళ్ళ పాటు సేవించక పోవడం వల్ల విరోచనాలతో బాధ పడ్డాననీ, కట్టె పోగులా తయారయ్యా ననీ, ఎంత మంది సలహా ఇచ్చినా మందులు తీసుకొన లేదని, మేక పాలను తాగడం వల్ల తాను మళ్ళీ మామూలు స్థాయికి చేరు కున్నాననీ, గాంధీజీ తన ఆత్మ కథలో వివరించారు. గాంధీ తొలుత పాల పదార్థాలకు దూరంగా ఉండేవారు. కేవలం ఒక వెజిటేరియన్‌గానే ఉండాలని కోరుకొనేవారు. అయితే సమయానుసారం తన ఆహారపు అలవాట్లలో మార్పులు సంభవించాయి. పాల ఉత్పత్తులను మానేయాలని గాంధీజీ భావించారు. కానీ ఆరోగ్యం దెబ్బ తినడంతో తన నిర్ణయాన్ని మార్చుకున్నారు. తర్వా మేకపాలు తాగడం ప్రారంభించారు. తాజా మేక పాల కోసం కొన్ని సందర్భాల్లో ప్రయాణాల్లోనూ ఆయన వెంట మేకను తీసుకెళ్లేవారు.. వైద్యుడి సలహా మేరకు మేక పాలను తన డైట్‌లో భాగంగా చేసు కున్నారు. ఆహారం అనేది ప్రాణాన్ని నిలబెట్టేందుకే అయినప్పటికీ, మితాహారం, సాత్వికాహారం వల్ల మనిషిలో ఆలోచనా శక్తి పెరుగుతుందని గాంధీగారు విశ్వసించేవారు. పాలు సంపూర్ణ ఆహారం కావడం వల్ల దేహం ఎదుగుదలకు కావల్సిన మాంస కృతులు, విటమిన్లు లభ్యమవుతాయని, అలాగే, తృణ ధాన్యాలు, వరి, జొన్న, రాగులు వంటివి కూడా శరీరానికి బలం ఇస్తాయని గాంధీజీ విశ్వసించేవారు. ఆయన ఆహారంలో ఒక లీటరు మేక పాలు, 150 గ్రాముల చిరు ధాన్యాలు, 75 గ్రాముల ఆకుకూరలు, 125 గ్రాముల కాయగూరలు, 25 గ్రాముల సలాడ్లు, 40 గ్రాముల నెయ్యి, 40 గ్రాముల పంచదార ఉండేటట్లు చూసు కున్నారు. భుక్తా యాసం వచ్చేవరకూ ఆహారం తీసుకోవడం, అతినిద్ర, అలసత్వం మనిషికి శత్రువులని ఆయన తరచూ అనే వారు. భోజనం వేళ దాటి పోయిన తర్వాత చిరు ఆకలి అనిపిస్తే ఆయన వేరుశనగ గుళ్ళు తినేవారు. సబర్మతిలో ఆహారం అంటే ఉడికించిన వంకాయ, బీట్రూట్, మరి కొన్ని కూర గాయలు, వెన్న లేని రొట్టె.. నెయ్యి కూడా ఉండదను, దాన్ని మందులాగా కష్టపడి తినే వారన్న విషయాలు గ్రంథస్థాలు. వెల్లుల్లిని పేదవారి కస్తూరి అని పిలుస్తారని గాంధీ పేర్కొన్నారు. చివరి దశకాల్లో గాంధీ చాలా ఆహారపు అలవాట్లను విడిచిపెట్టారు. మసాలా దినుసులు మానివేశారు. ఉడికించిన కాయ గూరలు మాత్రమే తినేవారు. ఉల్లి, వెల్లుల్లి లేకపోతే గ్రామీణులు ఇంకేం తింటారని కూడా ప్రశ్నిస్తారు. తల్లితండ్రులు తమ పిల్లలకు బలవర్ధకమైన ఆహారాన్ని పెట్టాలనీ, పిల్లల చదువు విషయంలోనే కాకుండా, ఆహార, విహారాల విషయంలో తగిన శ్రద్ధ తీసుకోవాలని గాంధీజీ ప్రబోధించారు. బాల్యం నుంచే వారికి మంచి అలవాట్లు అబ్బేట్టు చూడాల్సిన బాధ్యత తల్లితండ్రుల దేనని ఆయన అన్నారు. భారత స్వాతంత్ర్య సమరం సాగుతున్న సమయంలో మహాత్మ గాంధీ అనేకసార్లు నిరాహారదీక్షను పాటించారు. దాదాపు 17 సార్లు ఉపవాసాన్ని ఒక వ్రతంగా స్వీకరించారు. అత్యధికంగా 21 రోజులు కేవలం తక్కువ మోతాదులో ద్రవాలను మాత్రమే తీసుకుంటూ నిరాహారదీక్ష చేశారు. తన అహింస సిద్ధాంతాల్లో భాగంగా ఈ అంశం గురించి పేర్కొన్నారు. పలువురు ఆయుర్వేద వైద్య నిపుణుల ప్రకారం స్థూల కాయాన్ని తగ్గించుకోవడం, రక్తపోటును నియంత్రించు కోవడం, కొవ్వును తగ్గించు కోవడం లాంటివన్నీ కూడా పలు ఉపవాస నియమాల వల్ల సాధ్యమే. శారీరక శక్తి కోసం తినడం ఎంత అవసరమో, మానసిక శక్తికోసం మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలనీ, గాంధీజీ నిరంతరం ధ్యానంలో నిమగ్నమయ్యేవారనీ, ఆయన మానసిక శక్తిలోని అసలు రహస్యమని పలు సందర్భాలలో గాంధీ చెప్పేవారు. మనిషి తన మానసిక ప్రశాంతతతో పాటు శారీరక ప్రశాంతతను పెంపొందించు కోవడం కోసం ధ్యానం చేయడం అలవాటు చేసుకోవాలన్నది గాంధీ సిద్ధాంతం. ఆయన ప్రతీ రోజు ధ్యానం చేసేవారు. మరియు ఎక్కువ సేపు ప్రార్థన చేసేవారు. ఆయుర్వేదం ప్రకారం కూడా ధ్యానం చేయడం వలన మానసిక రుగ్మతలు దూరం అవుతాయని చెపుతారు. గాంధీజీ ప్రబోధించిన అనేక విషయాలను ఆరోగ్య వికాసానికి ముడి పెడితే కొన్ని మంచి విషయాలను తెలుసు కోవచ్చు. ఉదాహరణకు నిద్రలేమిని అరికట్టడం అనే విషయాన్ని గురించి తరిచి చూస్తే. గాంధీ కూడా తొలుత కేవలం నాలుగు నుండి అయిదు గంటలు మాత్రమే నిద్రకు కేటాయించేవారు. అయితే తర్వాత రాత్రిళ్లు ఎక్కువ సేపు మేల్కొని ఉండకుండా, వేగంగా నిద్రపోవడం మరియు వేగంగా నిద్రలేవడం అనే నియమానికి కట్టుబడి ఉండేవారు. సూర్యోదయానికి ముందు నిద్రలేచి ధ్యానం చేయడం వలన శరీరంలో ఒక ఉత్తేజం ప్రారంభమై, ప్రతికూల ఆలోచనలకు దూరంగా ఉండ గలుగుతామని ఈ ఉదాహరణ చెబుతోంది. అలాగే దండీ మార్చ్ చేసిన బాపూజీ జీవితం నుండి ఆ అంశాన్ని ఉదాహరణగా తీసుకుంటే, నడక వలన కలిగే ఉపయోగాలు తెలుసు కోవచ్చు. గుండె బలహీనతను తగ్గించు కోవడం, కొవ్వు కరిగించుకోవడం, పక్కటెముకలు పటిష్ట పడేలా చూసు కోవడానికి నడక ఎంతగానో ఉపయోగ పడుతుంది. కనుక ప్రతీ వ్యక్తి రోజుకు ఎంతోకొంత దూరం నడవడం తప్పని సరిగా భావించాలి. గాంధీజీ నూరు శాతం శాకాహారి. మితాహారి. మిత భాషణుడు. గాంధీజీ 46.7 కిలోల బరువు ఉండేవారు. ఎత్తు 1.64 మీటర్లు. 78వ ఏట ఆయన నాథూరామ్ గాడ్సే జరిపిన కాల్పుల్లో మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# శాస్త్రి మృతిపై తీరని సందేహాలు - అక్టోబర్ 2... లాల్ బహదూర్ జయంతి



భారత దేశ మలి ప్రధాని, స్వాతంత్ర్యోద్యమం లో ప్రముఖ పాత్రధారి, భారత జాతీయ కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడు, జై జవాన్ జై కిసాన్ నినాదంతో ప్రజల అభిమానాన్ని చూరగొన్న లాల్ బహదూర్ శాస్త్రి మరణంపై సందేహాలు తీరనే లేదు. తాష్కెంట్లో అతను గుండెపోటుతో మరణించినట్లు చెప్పబడినా, అది ప్రణాళికా బద్ధమైన హత్యగా చర్చకు తెర లేపింది. 1965 ఆగస్టులో, పాకిస్తాన్ తన సేనలను ప్రయోగించి జమ్మూ కాశ్మీరులోని కచ్ ప్రాంతాన్ని ఆక్రమించుకుంది. తద్వారా జమ్ము కాష్మీరులోని ప్రజలు ఉద్యమించి, భారతదేశం నుండి విడిపోతారని ఆశించింది. పాకిస్తాన్ ఆక్రమణ గురించి తెలుసుకున్న లాల్ బహదూర్ శాస్త్రి వెంటనే త్రివిధ దళాలకు నియంత్రణ రేఖను దాటి లాహోరును ఆక్రమించుకోవడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. భారత సైన్యం విజయానికి చేరువలో ఉండగా శాస్త్రి పై అమెరికా తీవ్ర ఒత్తిళ్లు తెచ్చింది. 1965 యుద్ధం తీవ్రస్థాయికి చేరిన సమయంలో పాకిస్థాన్– అమెరికా, భారత్–అమెరికా మధ్య జరిగిన పలు దౌత్య కార్యక్రమాలు జరిగాయి. యుద్ధంలో పాక్ ఓటమి దశకు చేరిన సమయంలో నాటి పాక్ అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్, విదేశాంగమంత్రి జుల్ఫికర్ అలీ భుట్టోలను పాక్‌లో అమెరికా రాయబారి వాల్టర్ ప్యాట్రిక్ మెక్‌కోటే కలిసి యుద్ధ విరమణకోసం చర్చలు జరిపారు. ఈ దశలో ఐక్యరాజ్య సమితి పాక్‌తో విరమణ ఒప్పందాన్ని ప్రతిపాదించింది. ఈ దశలో ఒప్పందానికి అంగీకరించే విధంగా శాస్త్రిపై తాష్కెంట్‌లో తీవ్ర ఒత్తిళ్లు వచ్చాయన్న ఆరోపణలున్నాయి. 1965 లో పాకిస్తాన్తో కాల్పుల విరమణ ప్రకటించిన తరువాత, శాస్త్రి, అయుబ్ ఖాన్ తాష్కెంట్ లో జరిగిన ఒక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొన్నారు. 1966 జనవరి 10న ఒప్పందాలపై సంతకాలు చేసిన మర్నాడే జనవరి 11న ఆయన హృద్రోగంతో అక్కడే మృతి చెందాడు. ఓ దేశాధినేత అదీ మరో దేశానికి అతిధిగా ఒప్పందాలపై సంతకాలు చేసేందుకు వెళ్ళి అక్కడే అసహజ, అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం చరిత్రలో అంతకు ముందెప్పుడూ లేదు. ఈ మరణం హృద్రోగం వల్ల సంభవించిందని సోవియట్ ప్రభుత్వం ప్రకటించింది. భారత ప్రభుత్వం దీన్నే ధ్రువీకరించింది. అనుమానాలు వ్యక్తం అయినా శాస్త్రి బౌతిక ఖాయానికి పోస్టుమార్టం నిర్వహించ లేదు. అంతకు ముందెప్పుడూ శాస్త్రికి ఎలాంటి అనారోగ్యం లేదు. విషప్రయోగం వల్లే శాస్త్రి మరణించారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. శాస్త్రి ఆఖరుగా ఆయన కుమార్తె సుమన్‌తో మాట్లాడాడు. పాలుతాగి పడుకుంటానని చెప్పాడు. ఈలోగా ఫోన్‌లైన్ డిస్కనెక్ట్ అయింది. తర్వాత దాదాపు పదిహేను నిమిషాలకు పైగా సుమన్ లైన్ కోసం ప్రయత్నించింది. ఆ తర్వాత లైన్ దొరికింది కానీ శాస్త్రి ఎత్తలేదు. సోవియట్‌కు చెందిన ఓ అధికారి ఫోన్ ఎత్తాడు. మీ తండ్రిగారు ఇప్పుడే మరణించారని సుమన్‌కు చెప్పాడు. అంతవరకు ఎలాంటి అరోగ్యకర ఇబ్బందుల్లేని వ్యక్తి 15 నిమిషాల్లో మృతి చెందినట్లు చెప్పాదంపై సందేహాలు ఇప్పటికీ వెంటాడుతూనే ఉన్నాయి. శాస్త్రి వెంట ఆయన వ్యక్తిగత వైద్యుడు ఆర్ఎన్ చుగ్ కూడా తాష్కంట్ వెళ్ళాడు. అతనూ పక్కగదిలోనే ఉన్నా, కనీసం శాస్త్రికి గుండెపోటు వచ్చిందన్న విషయాన్ని ఆయనకు కూడా సోవియట్ అధికారులు వెల్లడించలేదు. మరణించిన తర్వాతే ఆ విషయాన్ని చెప్పారు. భారత్‌కు తెచ్చిన శాస్త్రి భౌతిక కాయం నీలంరంగులోకి మారి ఉంది. శరీరంపై కొన్ని గాట్లు కూడా గమనించినట్లు ఆయన భార్య లలితాశాస్త్రి గుర్తించారు. శాస్త్రి విష ప్రయోగం వల్ల మరణించాడని ఆయన భార్య లలితా శాస్త్రి ఆరోపించింది. 1978 లో క్రాంత్ ఎం.ఎల్.వెర్మా హిందీలో "లలితా కె ఆంసు" పేరుతో పుస్తకాన్ని రాసి ప్రచురించాడు. ఈ పుస్తకంలో శాస్త్రి మరణం గురించి విషాద కథ లలిత శాస్త్రిచే వ్యాఖ్యానించ బడింది. ఆయన మరణం చుట్టూ ఇప్పటికీ సందేహాలు ఉన్నాయి. ఆయన కుమారుడు సునీల్ శాస్త్రి, తండ్రి మరణానికి వెనుక ఉన్న మర్మాన్ని తెలియ చేయ వలసినదిగా ప్రభుత్వాన్ని కోరాడు. 1966 లో ఆయన మరణం తరువాత భారత దేశానికి తీసుకువచ్చిన భౌతిక కాయంపై నీలం రంగు మచ్చలు, కొన్ని గాట్లు ఉన్నట్లు అనుమానాలను వ్యక్త పరిచాడు. పోస్టు మార్టం చేయ బడనప్పటికీ శరీరంపై గాట్లు ఏర్పడానికి కారణాన్ని గూర్చి అడిగాడు. 1977లో శాస్త్రి మరణంపై దర్యాప్తుకు ఓ కమిటీని నియమించారు. ఈ కమిటీ ముందు వాంగ్మూలం ఇచ్చేందుకు డాక్టర్ చుగ్ బయలు దేరాడు. కారులో ఢిల్లీ వైపు ప్రయాణిస్తుండగా ఎదురుగా ఓ లారీ వచ్చి ఢీ కొనగా, చుగ్ అక్కడి కక్కడే మరణించాడు. అలాగే శాస్త్రి వ్యక్తిగత సేవకుడు రామ్‌నాథ్ కూడా ఆయనతో పాటు తాష్కంట్ వెళ్ళాడు. మృతదేహం వెంటే ఆయనా తిరిగొచ్చాడు. ఆయనను కూడా కమిటీ సాక్షిగా పరిగణించింది. వాంగ్మూలం నమోదుకు పిల్చింది. మోతీలాల్‌నెహ్రూ మార్గ్‌లోని తన నివాసం నుంచి ఆయన ఒక్కడుగు బయటకేయగానే ఎదురుగా ఓ వాహనం వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రామ్‌నాథ్ రెండుకాళ్ళూ నుజ్జునుజ్జు అయ్యాయి. తలకు బలమైన గాయాలయ్యాయి. ఆయన గతాన్ని మర్చిపోయాడు. తాష్కెంట్ ఒప్పందం గూర్చి శాస్త్రి రష్యా వెళ్ళిన తరువాత పాకిస్థాన్ అధ్యక్షుడు ఆయూబ్ ఖాన్ నుండి పాకిస్థాన్ భవిష్యత్తులో భారత్ పై బలగాలను ఎప్పుడూ ప్రయోగించ రాదనే వాగ్దానాన్ని కోరాడు. కానీ చర్చలు కొనసాగలేదు. తరువాత రోజు శాస్త్రి మరణించాడు. భారత ప్రభుత్వం ఆయన మరణం గురించి ఎటువంటి సమాచారం అందించలేదు. అప్పుడు మీడియా నిశ్శబ్దంగా ఉంది. భారత దేశంలో ఈ కుట్ర జరిగే సాధ్యాసాధ్యాలను "అవుట్ లుక్ మ్యాగజైన్" ప్రచురించింది. 2009లో దక్షిణాసియాపై సిఐఎ దృష్టి పేరిట అనుజ్‌ధార్ అనే రచయిత పుస్తకం రాసేందుకు ఉపక్రమించాడు. ఇందుకోసం శాస్త్రి మరణానికి సంబంధించిన పత్రాలు కావాలంటూ సమాచారహక్కు చట్టం క్రింద భారత ప్రధాని కార్యాలయానికి దరఖాస్తు చేసుకున్నాడు. వీటి జారీకి పిఎమ్ఓ నిరాకరించింది. పైగా ఈ పత్రాల జారీ భారత సార్వ భౌమత్వానికి, అంతర్గత భద్రతకు, ఆర్థిక ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తుందని పేర్కొన్నారు. సిఐఎ ప్రమేయాన్ని కూడా తక్కువగా అంచనా వేయలేం. పైగా ఆ సమయంలో సిఐఎలో డైరెక్టర్ ఆఫ్ ప్లాన్స్‌గా ఉన్న రోబర్ట్ క్రోలీ అమెరికాకు చెందిన గ్రెగరీడగ్లస్ అనే జర్నలిస్ట్‌కు ఇంటర్వ్యూ ఇస్తూ శాస్త్రితో పాటు భారత అణు పితామహుడు డాక్టర్ హోమీబాబా మరణాలకు సిఐఎ ప్రణాళికలు రచించి అమలు చేసిందని వెల్లడించారు. అయితే తన మరణానంతరమే ఈ ఇంటర్వ్యూను ప్రచురించాలని ఆయన డగ్లస్‌ను కోరాడు. శాస్త్రి, హోమీబాబా మరణాలు ఒకే నెలలో జరిగాయి. రెండింటికి మధ్య రెండు వారాల వ్యవధే ఉంది. పైగా ఈ రెండు దేశానికి వెలుపలే చోటు చేసుకున్నాయి. 60వ దశకంలో అమెరికాకు సహకరించని వివిధ దేశాల నేతల్ని హతమార్చడం సిఐఎ పనిగా పెట్టుకుంది. దీనిపై కేంద్రం రాజ్‌నారాయణ్ కమిటీని నియమించింది. . ఈ కమిటీ అధ్యయనం నివేదిక ఇప్పటివరకు వెలుగు చూడలేదు. ఆఖరికి ఇది భారత పార్లమెంట్ లైబ్రరీలో కూడా అందుబాటులో లేదు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# ప్రతినెలా.. పారదర్శకంగా..!

ఖమ్మం : బ్లాక్ గ్రానైట్ రాళ్లకు ఖమ్మం జిల్లా ప్రసిద్ధి చెందింది. నాలుగు నెలలుగా ఆన్‌లైన్‌లో పారదర్శకంగా రాయల్టీ చెల్లింపులు జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ విధానం ప్రవేశపెట్టగా క్వారీలు, పరిశ్రమల యజమానులు ఆన్‌లైన్‌లో ప్రతినెలా రాయల్టీ సొమ్ము చెల్లించి క్వారీల నుంచి ముడి గ్రానైట్ రాళ్లను పరిశ్రమలకు తరలిస్తున్నారు.

**రాష్ట్రంలో ఎక్కడైనా.. ఏ క్వారీ నుంచైనా**

పరిశ్రమలో ముడి రాళ్లను కోసే ప్రతి బ్లేడ్ (కట్టర్)కు నెలకు రూ.16వేలను ఆన్‌లైన్‌లో చెల్లించి తమకు కావాల్సిన రాళ్లను కొనుగోలు చేసి పర్మిట్లు పొందుతున్నారు. నెలకు రూ.16వేలు చెల్లించి 16 క్యూబిక్ మీటర్ల రాళ్ల కొనుగోలు చేసుకోవచ్చు. అంతకుమించి ముడి రాళ్లు కొనాలంటే క్యూబిక్ మీటర్‌కు రాయల్టీ సొమ్ము రూ.5,500 చెల్లించి పర్మిట్ తీసుకోవాలి. ఆన్‌లైన్‌లో ముందుగానే రాయల్టీ సొమ్ము చెల్లించటం ద్వారా రాష్ట్రంలో ఎక్కడైనా, ఏ క్వారీ నుంచైనా గ్రానైట్ ముడి రాళ్లు కొనే అవకాశాన్ని సర్కారు కల్పించింది. జిల్లాలోని 318



పరిశ్రమలు ఆగస్టులో 18,960 క్యూబిక్ మీటర్ల ముడి రాళ్లను కొన్నాయి.

**జరిమానాల రూపంలో రూ.1.72 కోట్లు వసూలు**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు రూ.44.29 కోట్ల ఆదాయం లభించింది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.101 కోట్లు రాబడి సమకూరింది. వివిధ రకాల ఖనిజాలను అక్రమ మార్గంలో తరలిస్తున్న వారిని అధికారులు పట్టుకుని 340 కేసులు నమోదు చేశారు. వారి నుంచి జరిమానాల రూపంలో రూ.1.72 కోట్లు రాబట్టారు.గ్రానైట్ ముడి రాళ్ల కొనుగోలుకు రాయల్టీ సొమ్ము చెల్లింపులు, పర్మిట్ల జారీ వంటి ప్రక్రియ ఆన్‌లైన్‌లో సక్రమంగా సాగుతోంది. ఈ విధానంలో ఎవరూ నిరీక్షించాల్సిన అవసరం లేదు. బొగ్గు, బెరైటీస్, క్వార్ట్జ్ వంటి మేజర్ మినరల్స్‌కు సంబంధించి చెల్లింపులన్నీ నేరుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయా కంపెనీలు చెల్లిస్తాయి. మైనర్ మినరల్స్‌కు సంబంధించి రాయల్టీ వసూళ్లు తమ కార్యాలయం పరిధిలో సాగుతాయి. నిఘా పెంచి అక్రమ మార్గంలో తరలించే వారిని పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నాం. జరిమానాలు విధిస్తున్నాం. సాయినాథ్, ఏడీ, గనుల శాఖ, ఖమ్మం

# బారులు తగ్గేలా.. బాధలు తొలగేలా..!

ఖమ్మం: యూరియా ఎప్పుడొచ్చినా.. ఎక్కడ విక్రయిస్తున్నా.. రైతులు బారులుదీరి పడిగాపులు కాస్తున్నారు. ఈ సమస్యను గుర్తించిన రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు అధికారులు పాలేరు నియోజకవర్గాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని ఉప కేంద్రాలు ఏర్పాటుచేశారు. కేంద్రాలు పెరగటంతో బారులు తగ్గాయి. ఇదే విధానాన్ని యూరియా అవసరమున్న ప్రాంతాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (ప్యాక్స్) తక్కువ ఉన్న మండలాల్లో వానాకాలం సీజన్ వరకు అనుసరించనున్నారు. ఖమ్మం జిల్లాలోని రఘునాథపాలెం, కారేపల్లి, కొణిజర్ల, తల్లాడ, పెనుబల్లి, కల్లూరు మండలాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు తక్కువగా ఉండటంతో రైతులు బారులు తీరుతున్నారు. సమస్య నివారణలో భాగంగా ఆయా మండలాల్లో ప్యాక్స్‌కు అనుబంధంగా ఉపకేంద్రాల్లో యూరియా విక్రయాలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

**ఎందుకొచ్చింది కొరత..?**

ఖమ్మం జిల్లాలో గతేడాది కంటే ఎక్కువగా యూరియా బస్తాలు విక్రయించినా.. కొరత అంటూ రైతులు విక్రయ కేంద్రాల వద్ద ఎగబడుతుండటంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. గతేడాది ఆగస్టు 31 వరకు జిల్లాలో 24,120.92 మెట్రిక్ టన్నుల యూరియా విక్రయించారు. అప్పుడు ఎలాంటి సమస్య ఎదురుకాలేదు. ఈ సంవత్సరం ఆగస్టు 31 వరకు 24,324.89 మెట్రిక్ టన్నులు అంటే 203.97 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అదనంగా విక్రయించారు. జిల్లాలో మారుమూల గ్రామాలు, తండాల్లో రవాణా పేరిట అధికంగా డబ్బులు దండుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సత్తుపల్లి మండలంలో ఇద్దరు, చింతకాని, నేలకొండపల్లి, రఘునాథపాలెం మండలాల్లో ఒక్కొక్కరు చొప్పున వ్యాపారులు అదనంగా డబ్బులు తీసుకున్నట్లు వ్యవసాయాధికారుల దృష్టికి రావటంతో నలుగురి లైసెన్స్‌ను 15 రోజులపాటు సస్పెండ్ చేశారు. ఒక వ్యాపారి సొంతంగా లైసెన్స్ వదులుకున్నారు.



**అన్నీ సహకార సంఘాలకే..**

చింతకాని మండలం పందిళ్లపల్లి రైల్వే రేక్ పాయింట్‌కు 1,333.03 మెట్రిక్ టన్నుల యూరియా శుక్రవారం వచ్చింది. ఇందులో ఖమ్మం జిల్లాకు 483.03, భద్రాద్రి జిల్లాకు 500, మహబూబాబాద్ జిల్లాకు 250 మెట్రిక్ టన్నులను అధికారులు కేటాయించారు. ఖమ్మం నిల్వ కేంద్రానికి 100 మెట్రిక్ టన్నులు తరలించారు. మరో 2,598.75 మెట్రిక్ టన్నుల యూరియా శనివారం రానుంది. అందులో ఖమ్మం జిల్లాకు 918.75, భద్రాద్రి జిల్లాకు 1,000, మహబూబాబాద్ జిల్లాకు 480, ఖమ్మం నిల్వ కేంద్రానికి 200 మెట్రిక్ టన్నులు కేటాయించనున్నారు. 'ప్రస్తుతం వచ్చిన, రాబోయే యూరియా బస్తాలను సహకార సంఘాలు, వాటి పరిధిలో ఏర్పాటుచేస్తున్న ఉప కేంద్రాల ద్వారానే విక్రయిస్తాం. ప్రైవేటు కేంద్రాలకు కేటాయించటం లేదు'ధనసరి పుల్లయ్య, జిల్లా వ్యవసాయాధికారి

# బీమా లేక.. తగ్గిన ధీమా

ఎమ్మిగనూరు : ఉమ్మడి జిల్లాలో వందలాది కుటుంబాలు గొర్రెలు, మేకల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నాయి. వ్యవసాయ అనుబంధ రంగమైన జీవాల పెంపకం ద్వారా లక్షలాది గొర్రెలు, మేకలు పెంచుతూ జీవిస్తున్నారు. ప్రభుత్వం తక్కువ ప్రీమియంకు బీమా పెట్టినా.. జీవాల యజమానులు అవగాహన లేక బీమా చేయించుకోవడం లేదు. తాజాగా గొర్రెలు మృతి చెందిన యజమానులు బీమా చేయించుకోక పోవడంతో నష్టపరిహారం రాని పరిస్థితి నెలకొంది.

**ఉమ్మడి జిల్లాలో 20లక్షల జీవాలు**

ఉమ్మడి జిల్లాలో గొర్రెలు, మేకలు కలిపి 20 లక్షల వరకు ఉన్నట్లు పశుసంవర్ధకశాఖ అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా కర్నూలు జిల్లాలో మైదానం, బీడు భూములు, కొండలు, గుట్టలు అధికంగా ఉన్నాయి. చాలా మంది రైతులకు వ్యవసాయ భూమి లేక అనుబంధ రంగమైన జీవాల పెంపకం ద్వారా జీవనం సాగిస్తున్నాయి. ఈ రంగాన్ని బలోపేతం చేసేందుకు ఎమ్మిగనూరు మండలంలోని బనవాసిఫారం వద్ద రూ.6కోట్లతో మేకపోతుల వీర్య కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే చాలా నిర్మాణ పనులు పూర్తయ్యాయి.

**ఏడాదికి రూ.36 చెల్లిస్తే..**

గొర్రెలు, మేకల బీమా కోసం బీపీఎల్, ఎస్సీ, ఎస్టీలు ఏడాదికి రూ.36, రెండేళ్లకు రూ.54, మూడేళ్లకు రూ.75 కట్టాలి. ఇతర యజమానులు రూ.90లు, రెండేళ్లకు రూ.135లు, మూడేళ్లకు రూ.187లు చెల్లించాలి. ప్రకృతి వైపరీత్యాలు, ఇతర వ్యాధులతో చనిపోతే గొర్రె,



మేకు రూ.6వేల పరిహారం అందజేస్తారు.

**రైతులకు అవగాహన లేక**

జిల్లాలో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు సోగనూరులో 90గొర్రెలు, హాల్వి, కోసిగిలో దాదాపు 30కి పైగా గొర్రెలు చనిపోయాయి. సోగనూరులో జీవాల యజమానులు బీమా చేయించుకోలేదని పశుసంవర్ధకశాఖ సిబ్బంది తెలిపారు. జీవాల పెంపకందార్లు రూ.10లక్షల దాక నష్టపోయినా.. పరిహారం పొందలేని పరిస్థితి.

**అధిక వర్షాలతో మృత్యు గండం**

జిల్లాలో జీవాల పెంపకందార్లు అడవిలో మేపుకొచ్చి రాత్రి సమయంలో కంచెగా ఏర్పాటు చేసిన దొడ్డిలో ఉంచుతారు. వేసవి కాలంలో అయితే పొలాల్లో సేంద్రియ సత్తువ కోసం మంద కడతారు. అందుకు మందలోని గొర్రెల సంఖ్యను బట్టి రోజుకు రూ.1000 నుంచి రూ.5వేల వరకు ఇస్తారు. అధిక వర్షాలు మూగజీవాల పాలిట మృత్యుగండంగా మారుతోంది. ఎడతెరిపి లేకుండా కురిసిన వానకు అవి తడిసి చలిగాలులకు మేత లేక మృత్యువాతపడి పెంపకందార్లు నష్టపోతున్నారు. వేసవిలో అధిక ఎండలు ఉండే సమయాల్లో చెట్లు ఇతర చోట్ల మందను ఆపి కాపాడుకుంటారు. వర్షాకాలంలో వందలాది గొర్రెలు కాపాడుకోలేక రైతులు అవస్థలు పడుతున్నారు. బీమా ద్వారానైనా జీవాల పెంపకందార్లకు ధీమా కలిగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# నిధులొస్తేనే నీళ్లు

పార్వతీపురం: 'ఉమ్మడి జిల్లాలో చేపడుతున్న తోటపల్లి పనులు 95 శాతం పూర్తయ్యాయి, కేవలం అయిదు శాతం మాత్రమే మిగిలి ఉన్నాయి.'..ఇదీ ఇటీవల జలవనరుల శాఖ ప్రభుత్వానికి ఇచ్చిన నివేదిక. వాస్తవం..: తోటపల్లి జలాశయం నిర్మాణం అసంపూర్తి పనులతో నిలిచిపోయింది. పదేళ్లుగా కాలువల నిర్వహణ లేదు. లైనింగు పనులు చేపట్టే ప్రతిపాదనకు మోక్షం లేదు. ఉమ్మడి జిల్లా జీవనాడి అయిన తోటపల్లి జలాశయం కాలువల పనులు అడుగు ముందుకు.. ఆరడుగులు వెనక్కి అన్నట్లు సాగాయి.

రెండు లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టుకు నీరందించే ఈ ప్రాజెక్టుకు గత తెదేపా ప్రభుత్వంలో పార్వతీపురం డివిజనులో రూ.60 కోట్లు, విజయనగరం డివిజనులో దాదాపు రూ.70 కోట్ల పనులు మంజూరు చేశారు. తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వంలో ఈ పనుల్లో పురోగతి లేకుండా పోయింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం 25 శాతంలోపు జరిగిన పనులను రద్దు చేయాలని నిర్ణయించింది. పనుల అవసరాన్ని జలవనరులశాఖ ప్రభుత్వానికి నివేదించి, కొనసాగించేందుకు అనుమతి కోరింది. 2026 జూన్ వరకు నిర్వహించేందుకు గడువు ఉంది.

**అవుననక.. కాదనక..**

జలాశయాల పరిధి రద్దు చేసిన, కొనసాగించాల్సిన పనులకు సంబంధించి ప్రభుత్వం వేర్వేరు ఉత్తర్వులిచ్చింది. ఈ రెండు జాబితాల్లోనూ తోటపల్లి పనుల్లేవు. దీంతో నిర్మాణాలు చేపట్టాలా? ఆపేయాలా? అన్న సందేహం అధికారుల్లో వ్యక్తమవుతోంది. బిల్లుల చెల్లింపునకు పీఏవో కార్యాలయానికి సమర్పించినా, వారు అనుమతించడం లేదని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు.

పార్వతీపురం డివిజన్ పరిధిలోని 48.88 కిలోమీటర్ల పొడవున ప్రధాన కాలువ ఉంది. ఇందులో 20 కి.మీ.పరిధి పూడికలు తీయాల్సి ఉండగా.. 12 కి.మీ.వరకే పనులు పూర్తయ్యాయి. వీటికి ఎస్డీఎం నిధుల నుంచి రూ.2.93 కోట్లు మంజూరు చేశారు. గుత్తేదారులు మధ్యలో ఆపేశారు. ప్రధాన కాలువలో 1,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేసే సామర్థ్యం ఉన్నా 800 క్యూసెక్కులకు మించి విడుదల సాధ్యం కావడం లేదు. తక్కువ వదిలితే శివారు పొలాలకు నీరందని దుస్థితి. కాలువను పూర్తిస్థాయిలో లైనింగ్ చేయడానికి వీలుగా రూ.99 కోట్లతో ప్రతిపాదించారు. ఇవి మంజూరైతే నీరు సక్రమంగా పారుతుంది.

ప్రభుత్వ పరిశీలనలో ఉంది

తోటపల్లి పనులను కొనసాగించే అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉంది. ఉన్నతాధికారుల ఆదేశాలతో గడువు లోగా పూర్తిచేసేలా సిద్ధమవుతున్నాం. ఎస్డీఎం పనులు ఇంకా నాలుగు చోట్ల ప్రారంభం కాలేదు. రానున్న ఖరీఫ్‌కు తోటపల్లి పూర్తిస్థాయిలో సిద్ధమవుతుంది.

హెచ్.మన్మథరావు,ఈఈ, తోటపల్లి ప్రాజెక్టు

ఇదీ పనుల తీరు:

అంచనా విలువ: రూ.59.58 కోట్లు

ఒప్పందం కుదిరినది: రూ.52.52 కోట్లు

ఇప్పటి జరిగిన పనులు: 18 శాతం

వాటి విలువ: రూ.9.90కోట్లు

నిర్మించాల్సిన స్ట్రక్చర్లు: 530

నిర్మించినది: 138

# ప్రకాశించని పర్యాటకం!



కొత్తపట్నం : జిల్లాలో విశాలమైన కోస్తా తీరప్రాంతం ఉన్నా గత వైకాపా ప్రభుత్వం పర్యాటక రంగంపై నిర్లక్ష్యం వహించింది. గుండ్లకమ్మ జలాశయంతోపాటు బైరవకోన పర్యాటక ప్రాంతంగా గుర్తింపు ఉంది. 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వ హయాంలో వచ్చిన నిధులతో చేపట్టిన పనులే నేటికీ దర్శనమిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో ప్రాధాన్యమిస్తూ గతేడాది జిల్లాలో పర్యాటక అభివృద్ధికి రూ.33.50 కోట్లతో అంచనా రూపొందించింది. ఏడాది గడిచినా నేటికీ నిధుల ఊసేలేదు. నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

**సముద్రతీరాల్లో వసతుల లేమి**

జిల్లాలో కొత్తపట్నం, పాకల సముద్రతీరాలున్నాయి. ఇక్కడ విశ్రాంత గదులు గానీ, వ్యక్తిగత మరుగుదొడ్లు గానీ లేవు. 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వ హయాంలో పాకల సముద్రతీరంలో విశ్రాంతి భవనం, రెస్టారెంట్, సీసీ రోడ్డు, ఎల్ఈడీ దీపాలు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణ నిమిత్తం రూ.4 కోట్ల నిధులు మంజూరు కాగాబీ తొలి విడతగా రూ.1.60 కోట్లతో పనులు చేపట్టారు. అనంతరం నిధుల్లేక పనులు నిలిచిపోయాయి. 2024-25 సంవత్సరానికి అసంపూర్తి పనుల పూర్తికి రూ.3 కోట్లతో ప్రతిపాదించారు. పాకల సముద్రతీరం అభివృద్ధి నిమిత్తం మరో 15 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. కాటేజీలు, రెస్టారెంట్, పార్కు, బల్లల ఏర్పాటుతోపాటు సుందరీకరణగా తీర్చిదిద్దేందుకు రూ.8 కోట్లతో అంచనా వేశారు. ఈ ఏడాది కొత్తపట్నంలో అతిథి గృహం నిర్మాణ నిమిత్తం రూ.6 కోట్లతో ప్రతిపాదించారు.

**పుణ్యక్షేత్రాల్లో కానరాని ప్రగతి**

బైరవకోనలో త్రిముఖ దుర్గాంబదేవి కొలువై ఉన్నారు. పక్కనే జలపాతం ఉంది. 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వ హయాంలో అక్కడ పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కాగా, అందులో విశ్రాంతి గదులు, కాటేజీలు, పరిపాలన భవన నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి. అదనపు గదులు, రెస్టారెంట్ నిర్మాణ నిమ్తితం రూ.కోటితో అంచనా వేశారు. త్రిపురాంతకంలోని బాలాత్రిపురసుందరీదేవి ఆలయ అవరణలో కాటేజీలు, పార్క్ అభివృద్ధికి రూ.1.50 కోట్లతో అంచనా వేశారు.

**గుండ్లకమ్మ ఆహ్లాదమెన్నడో?**

గుండ్లకమ్మ జలాశయం వద్ద 2009లో బోటింగ్ ఏర్పాటు చేశారు. అన్నంగి వద్ద 13 ఎకరాలు కేటాయించారు. అయిదెకరాల్లో రూ.2.63 కోట్లతో 8 కాటేజీలు, రెస్టారెంట్, ఈత కొలను నిర్మించారు. మిగిలిన 8 ఎకరాల్లో ఒంగోలు గిత్త బొమ్మతోపాటు పార్క్, రోప్‌వేతోపాటు కొండ ఎక్కేందుకు వీలుగా రూ.8 కోట్లతో ప్రతిపాదించారు. దేవరంపాడులోని ఉప్పు సత్యాగ్రహ విజయస్తూపాన్ని పర్యాటక ప్రదేశంగా మార్చే క్రమంలో రూ.3 కోట్లతో అంచనా వేశారు.

# జల వృద్ధి.. రైతుకు లబ్ధి



నంద్యాల : ఉమ్మడి జిల్లాలో చిన్న నీటి పారుదలశాఖ పరిధిలోని చెరువులు నూతన కళను సంతరించుకోనున్నాయి. వీటిల్లో భూగర్భ జలాలు పెంపొందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ఆర్ఆర్ఆర్ పథకం పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయనుంది.

ఉమ్మడి జిల్లాలో మైనర్ ఇరిగేషన్ శాఖ పరిధిలోని అన్ని చెరువులను ఆర్ఆర్ఆర్ (మరమ్మతులు, ఆధునికీకరణ, నవీకరణ) పథకం కింద అభివృద్ధి చేయనున్నారు. ఇందులో భాగంగా కర్నూలు జిల్లాలో 310, నంద్యాల జిల్లాలో 326 చెరువులను గుర్తించారు. ఇప్పటికే వివరాలు సేకరించి అంచనాలు రూపొందించారు. డీపీఆర్‌ను చిన్న నీటిపారుదల శాఖ అధికారులు తయారుచేసి డీఎల్ఐ (డిస్ట్రిక్ట్ లెవల్ ఫర్ ఇంప్లిమెంటేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ)కి నివేదించారు.

**సమన్వయంతో..**

మైనర్ ఇరిగేషన్ శాఖ అధికారులు గత రెండు నెలలుగా భూగర్భజల శాఖతో సమన్వయం చేసుకుని చెరువులను వర్గీకరించారు. నంద్యాల జిల్లాలో 8 నుంచి 20 మీటర్ల లోపు నీరు ఉన్న చెరువులు 250 ఉండగా, 20 మీటర్లకుపైగా నీటిమట్టం ఉన్న చెరువులు 76గా ఉన్నట్లు గుర్తించారు. కర్నూలు జిల్లాలో 20 మీటర్ల లోపు నీటిమట్టం ఉన్న చెరువులు 201, ఆపై నీటిమట్టం ఉన్నవి 125 వరకు ఉన్నాయి.

**చేపట్టనున్న పనులివే..**

చెరువు కట్టలను బలోపేతం చేయనున్నారు. తూముల మరమ్మతులతోపాటు చెరువుల్లోకి సాఫీగా నీరు వెళ్లేలా ప్రణాళిక రూపొందించుకుని అమలు చేయనున్నారు. వాగులు, వంకలు ద్వారా వచ్చే నీరు తగ్గిపోతున్న ప్రాంతాలను గుర్తించి చెక్‌డ్యామ్‌లు, వాటర్‌షెడ్లు నిర్మించి భూగర్భ జల నీటిమట్టం పెంచనున్నారు. ఫీడర్ ఛానళ్లను ఆధునికీకరించనున్నారు. ప్రత్యేకించి నీటి మట్టం తక్కువగా ఉన్న కర్నూలు జిల్లాలోని కోసిగి, ఆస్పరి, ఓర్వకల్లు, ఎమ్మిగనూరు మండలాలతోపాటు నంద్యాల జిల్లాలోని బేతంచెర్ల, నందికొట్కూరు, ప్యాపిలి ప్రాంతాల్లో చెరువుల విస్తీర్ణం పెంచడంతోపాటు ఆయా మండలాల పరిధిలోని పలు ప్రాంతాల్లో చెక్‌డ్యామ్‌లు నిర్మించేందుకు ప్రతిపాదనలు తయారు చేశారు.

**రెండు విడతలుగా..**నంద్యాల జిల్లాలోని 326 చెరువులను రెండు విడతలుగా అభివృద్ధి చేయనున్నారు. మొదటి విడతగా రూ.22.87 కోట్లు, రెండో విడత కింద రూ.138.19 కోట్లు కేటాయించనున్నారు. కర్నూలు జిల్లాలో మొదట రూ.21.65 కోట్లు, రెండో విడతలో భాగంగా రూ.117.54 కోట్లు ఇవ్వనున్నారు.

# లయ తప్పుతోంది


కర్నూలు : ఉమ్మడి జిల్లాలో గుండె జబ్బు బారినపడుతున్న వారి సంఖ్య ఏటా పెరుగుతోంది. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఏడాదికి సుమారు 25 వేల మంది చికిత్స పొందుతున్నారు. బాధితుల్లో కొందరు సకాలంలో ముప్పును గుర్తించలేక ప్రాణాలు కోల్పోతున్నారు. ఒక్క కర్నూలు సర్వజన ఆస్పత్రికి ప్రతినెలా కొత్తగా 100- 120 గుండె జబ్బు కేసులు వస్తున్నాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ భారీగా నమోదవుతున్నాయి.

**నెలకు 1,400కుపైగా ఓపీ**

కర్నూలు సర్వజన ఆసుపత్రిలోని కార్డియాలజీ విభాగంలో నెలకు సుమారు 1,400 వరకు ఓపీ నమోదవుతోంది. 320 మంది ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. 50-70 యాంజియోగ్రామ్‌లు చేస్తున్నారు. 20-25 మందికి వైద్యులు స్టెంట్‌లు అమరుస్తున్నారు. 10-15 మందికి శస్త్రచికిత్సలు చేస్తున్నారు. కార్డియాలజీ విభాగంలో అందుతున్న వైద్యసేవల స్థాయిలో కార్డియోథొరాసిస్ విభాగంలో గుండె శస్త్రచికిత్సలు జరగడం లేదన్న విమర్శలున్నాయి.

**స్టెమి ప్రోగ్రాంతో అత్యవసర వైద్యం**

గ్రామీణ ప్రాంతాల ప్రజలకు గుండెపోటు వచ్చిందంటే పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రుల్లో ప్రాథమిక చికిత్స అందించే సౌకర్యాలు ఉండేవి కావు. ఈ నేపథ్యంలో 2023లో స్టెమి ప్రోగ్రాంను ప్రవేశపెట్టారు. సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల్లో త్రాంబోలైసిస్ విధానంలో భాగంగా ఒక్కోటి రూ.40 వేల ఖరీదైన టెనిక్టమి ప్లేజ్ అనే ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచారు. సీహెచ్‌సీలకు వచ్చిన బాధితులకు ఈసీజీ తీసి కర్నూలులోని టెలి మెడిసిన్ హబ్‌కు పంపిస్తారు. అక్కడి వైద్యుల సూచన మేరకు ఇంజెక్షన్ ఇస్తున్నారు.



గుండెపోటు వచ్చిన వారిని మొదటి గంటలోపు ఆసుపత్రికి తీసుకెళ్తే వెంటనే ఇంజెక్షన్ వేసి ప్రాణాలు కాపాడుతున్నారు. 2023లో 25, 2024లో 55, 2025లో 55 మందికి టెనిక్టమి ఇంజెక్షన్లు వేశారు.

**లక్షణాలు గుర్తించాలి - డాక్టర్ ప్రశాంత్, కార్డియాలజీ నిపుణులు**

చెమటలు పట్టడం.. ఎడమ చేయి లాగడం.. ఇతర లక్షణాలు కనిపిస్తే అప్రమత్తం కావాలి. గుండెలో నొప్పి వచ్చినప్పుడు కొందరు గ్యాస్ట్రిక్ సమస్య అని నిర్లక్ష్యం చేస్తుంటారు. రక్తపోటు, మధుమేహం ఉన్నవారికి గుండెజబ్బు ముప్పు ఎక్కువగా ఉంటుంది. 40 ఏళ్లు దాటినవారు కచ్చితంగా వైద్య పరీక్షలు చేయించుకోవాలి. ఈ జబ్బు బారినపడకుండా ఉండేందుకు నడక, యోగా, ధ్యానం చేస్తే కొంతవరకు మేలు జరుగుతుంది.

# అట్టకెక్కించారు

ఎమ్మిగనూరు : విద్యార్థులకు సాంకేతిక విద్య అందించే లక్ష్యంతో గత ప్రభుత్వ హయాంలో రూ.కోట్ల విలువ చేసే కంప్యూటర్లు, టీవీలు కొనుగోలు చేశారు. 'నాడు-నేడు' కింద పలు విద్యాలయాల్లో తరగతి గదుల నిర్మాణం పూర్తికాకముందే వీటిని సరఫరా చేశారు. పునాదుల స్థాయిలోనే ఉండగా వీటిని సరఫరా చేయడంతో మూలకు చేరాయి. ఫలితంగా రూ.కోట్ల విలువ చేసే టీవీలు, ఇతర సామగ్రి అట్టపెట్టెల్లోనే మూలుగుతున్నాయి. మరికొన్ని మరమ్మతులకు గురయ్యాయి.

**భారీగా నిధులు వెచ్చించి..**

ఉమ్మడి జిల్లాలోని పలు పాఠశాలలకు వీసీఆర్ (వర్చువల్ క్లాస్ రూం), డీసీఆర్ (డిజిటల్ క్లాస్ రూం)కు భారీ స్మార్ట్ టీవీలు, కంప్యూటర్లు, ఎల్‌సీడీ ప్రొజెక్టర్లు, యూపీఎస్, కీబోర్డు, మౌస్‌లు తదితరాలు పంపిణీ చేశారు. ఒక్కో యూనిట్ విలువ సుమారు రూ.2.40 లక్షలు ఉంటుంది. ఈ లెక్కన మొత్తం పాఠశాలలకు అందజేసిన పరికరాల విలువ రూ.కోట్లల్లో ఉంటుందని అంచనా.

**ఎక్కడెక్కడ ఎలా ఉందంటే..**గుడేకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 20 గదులు అసంపూర్తిగా ఉండటంతో 10 టీవీలను అట్టపెట్టెల్లో భద్రపరిచారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏడు టీవీలను గదిలో పెట్టి తాళాలు వేశారు. కోటేకల్లు, సోమప్పనగర్, నాగలాపురం, దైవందిన్నె, కందనాతి ఉన్నత పాఠశాలల్లో టీవీలు మూలకు చేరాయి.

నంద్యాల పరిధిలోని నందికొట్కూరు, నంద్యాల పట్టణం, బేతంచెర్ల, బనగానపల్లి, ఆళ్లగడ్డ పరిధిలో గదుల నిర్మాణాలు పూర్తికాక టీవీలను మూలన పెట్టేశారు.

**పక్కన పెట్టేసి..**ఎమ్మిగనూరు పట్టణంలోని మాచాని సోమప్ప బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలలో 3,600 మంది చదువుతున్నారు. ఈ విద్యాలయంలో 20 అదనపు గదుల కోసం రూ.2.40 కోట్లు మంజూరు చేశారు. ఆరు గదుల పనులు పూర్తి చేశారు. ప్రభుత్వం 35 టీవీలు మంజూరు చేసింది. మిగతా గదులు పునాదుల దశలో ఉండటంతో సుమారు 12 టీవీలు మూలన చేరాయి.

**గదులు సరిపోక..**

కొన్ని పాఠశాలల్లో గదులు సరిపోక ఆరుబయట కూర్చొని విద్యార్థులు పాఠాలు వింటున్నారు. ఈ నేపథ్యంలో వచ్చిన సామగ్రిని ఎక్కడ నిల్వ చేయాలో తెలియక ఉపాధ్యాయులు కొన్ని గదుల్లో భద్రపరిచారు. పిల్లలు కూర్చునేందుకు స్థలం లేని ప్రాంతాల్లో అట్టపెట్టెల్లో సామగ్రిని గదుల్లో నిల్వ చేశారు. నాడు-నేడు మొదటి విడతలో ఎంపికైన బడులు: 594

మంజూరైన నిధులు : రూ.166 కోట్లు

రెండో విడతలో ఎంపికైన పాఠశాలలు : 1051

నిధులు : సుమారు రూ.504.16 కోట్లు

ఉమ్మడి జిల్లాలో పాఠశాలలకు వచ్చిన టీవీలు: 3,256

మూలకు చేరినవి: 850కిపైగా వివిధ వస్తువులు

# వీసీ లేక పడకేసిన పాలన

పార్వతీపురం: తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో 20 రోజులకు పైగా ఉపకులపతి లేకపోవడంతో పాలన పడకేసింది. ఇన్‌ఛార్జి ఉపకులపతి కురుబ గోపాల్ గత నెల 31న ఉద్యోగ విరమణ చేశారు. సాధారణంగా వీసీ పదవీకాలం మూడేళ్లు మాత్రమే. కానీ వైకాపా హయాంలో నిబంధనలకు విరుద్ధంగా గత వీసీ జానకిరామ్ రెండోసారి పునర్నియామకం పొందారు. దీన్ని రద్దు చేస్తూ హైకోర్టు గతేడాది జూన్ 26న తీర్పునిచ్చింది. అనంతరం అనంతరాజుపేట ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ గోపాల్ వర్సిటీ ఇన్‌ఛార్జి వీసీగా నియమితులయ్యారు. ఆ సమయంలో దాదాపు 50 రోజులపాటు వర్సిటీకి వీసీ లేరు.జీవో 39ని సవాల్ చేస్తూ.. ఉన్నత విద్యా శాఖ పరిధిలోని విశ్వవిద్యాలయాల్లో పని చేసే ఆచార్యుల ఉద్యోగ విరమణ వయసును 62 నుంచి 65కి పెంచుతూ 2023 జులై 27న అప్పటి వైకాపా ప్రభుత్వం జీవో నం.39 విడుదల చేసింది. కానీ దానిని ఉద్యాన, వ్యవసాయ, పశువైద్య విశ్వవిద్యాలయాలకు వర్తింపజేయలేదు. దీనిని సవాల్ చేస్తూ తన ఉద్యోగ విరమణ వయసును 65కి పెంచాలని గోపాల్ గత నెల 28న హైకోర్టును ఆశ్రయించారు. కోర్టులో పెండింగ్‌లో ఉండటంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 4న ఆయన రిలీవ్ అయ్యారు. దీనిపై మరికొందరు కూడా పిటిషన్ దాఖలు చ్టేశారు. అందరిదీ ఒకే రకమైన పిటిషన్ కావడంతో ఈ నెల 25న విచారణ నిర్వహిస్తామని హైకోర్టు ప్రకటించినా.. జరగలేదు.


**ఉద్యోగుల వేతనాలపై ప్రభావం..**

రాష్ట్రీయ కృషి వికాస యోజన (ఆర్‌కేవీవై) ద్వారా వర్సిటీ పరిధిలోని పరిశోధనా స్థానాలు, కళాశాలలకు నిధులు మంజూరయ్యాయి. వీటి వినియోగానికి వీసీ అనుమతులు తప్పనిసరి. ఇవి సకాలంలో వినియోగించకపోతే వెనక్కి వెళ్లిపోతాయి. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలకు సైతం వీసీ అనుమతిలో బిల్లులు ప్రభుత్వానికి పంపించాలి. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి(ఐసీఏఆర్) ఆధ్వర్యంలో పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలు త్వరలో జరగనున్నాయి. వర్సిటీ విద్యార్థులు ఉన్నత చదువుల కోసం వెళ్లే సమయంలో విద్యార్హత ధ్రువపత్రాలు అవసరం. వీసీ లేకపోవడంతో వీటిని జారీ చేయడం లేదు.

# జోరందుకుంది.. పారాది వారధి

బొబ్బిలి: వేగావతి నదిపై బొబ్బిలి మండలం పారాది వంతెన పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఏడు స్తంభాలు పూర్తయ్యాయి. ఇరువైపులా రోడ్డును కలిపే స్తంభాలు నిర్మాణంలో ఉన్నాయి. ఓ వైపు పూర్తికాగా.. రెండోవైపు కాంక్రీటు వేస్తున్నారు. శ్లాబులకు ఐరన్ సెంట్రింగ్ సిద్ధం చేస్తున్నారు. వచ్చే మార్చికి పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి. రూ.6.50 కోట్ల పనులు జరిగినట్లు అధికారులు చెబుతున్నారు.

ఇటీవల వర్షాలు విరివిగా కురవడంతో నదిలో నీటి ప్రవాహం పెరిగి సమస్యతొస్తున్నాయి. వాహనాలు వెళ్లేందుకు వీలుగా నదిలో నిర్మించిన కాజ్‌వేపై నుంచి నీరు పారడంతో ఇబ్బంది ఎదురైంది. వచ్చే నెలలో వర్షాలు తగ్గే అవకాశం ఉన్నందున శ్లాబు శరవేగంగా జరిగే అవకాశాలు ఉన్నాయి.



**55 శాతం పూర్తి..**

గతేడాది అక్టోబరులో పనులు ప్రారంభమయ్యాయి. ఇంతవరకు 55 శాతం మేర పూర్తయ్యాయి. కీలకమైన బేస్మెంట్ పూర్తిచేసి స్తంభాల కాంక్రీటు పనులు చేపట్టారు. పిల్లర్ల మధ్య శ్లాబులు వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. శరవేగంగా సాగుతున్నాయని, దీనికి తగ్గట్లు బిల్లులు చెల్లిస్తే గుత్తేదారు గడువులోపు పూర్తిచేసే అవకాశాలు ఉన్నాయని ఎమ్మెల్యే బేబినాయన ఇటీవల అసెంబ్లీలో మాట్లాడారు.

**జాప్యం లేకుండా పనులు చేస్తున్నాం..:** పారాది వంతెన నిర్దేశిత వ్యవధిలోగా పూర్తిచేస్తాం. పిల్లర్ల నిర్మాణం పూర్తయింది. వాటి మధ్య శ్లాబులు వేసేందుకు సామగ్రి సిద్ధం చేస్తున్నాం. వర్షాలు పడుతున్నా జాప్యం లేకుండా పనులు చేస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నాణ్యతలో రాజీ లేకుండా చూస్తున్నాం.అప్పలరాజు, ఏఈ ర.భ.శాఖ, బొబ్బిలి సెక్షన్ శ్లాబు

# నిబంధనలు కట్టిపెట్టు.. గుత్తేదారులకు దోచిపెట్టు

పుట్టపర్తి : హిందూపురం మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు నిబంధనలను గాలికొదిలేశారు. టెండర్లు పిలవడంలో విధి విధానాలు పాటించడం లేదు. ఇది గుత్తేదారులకు వరంగా మారుతోంది. నీటి సరఫరాను మెరుగుపర్చడానికి రూ.5 కోట్లు ఖర్చు చేయడంలోనూ, వివిధ పనులకు సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదికలు(డీపీఆర్) తయారు చేసే కన్సల్‌టెంట్లను ఎంపిక చేయడంలోనూ ఇంజినీరింగ్ విభాగం అధికారులు విఫలం కావడం విమర్శలకు తావిస్తోంది.

**ఆఫ్‌లైన్‌లో పిలిచి..**

తాజాగా మున్సిపల్ కార్యాలయ నిర్మాణాన్ని రూ.18.3 కోట్లతో నిర్మించాలని నిర్ణయించారు. భవన నిర్మాణానికి సంబంధించిన డీపీఆర్ సిద్ధం చేయడం, సాంకేతిక అనుమతులు తీసుకురావడం తదితర పనులు చేయడానికి కన్సల్‌టెంట్ల ఎంపికకు టెండర్లు పిలిచారు. ఆన్‌లైన్ టెండర్లు పిలవాలని నిబంధనలు ఉంటే ఆఫ్‌లైన్‌లో పిలిచారు. సమగ్ర ప్రతిపాదనల తయారు చేసే వారికి పని విలువలో 1 శాతం లోపే చెల్లించాలి. ఒక్క శాతం లోపు సొమ్ముకు టెండర్ వేసిన వారినే ఖరారు చేయాలి. అంటే మున్సిపల్ కార్యాలయ భవన సముదాయ ప్రణాళికను సిద్ధం చేసే వారికి రూ.18లక్షల లోపు చెల్లించాలి. ఇప్పుడు మున్సిపల్ అధికారులు ఖరారు చేసిన కన్సల్‌టెంటు సంస్థకు రూ.51 లక్షలు




చెల్లిస్తున్నారు. ఏకంగా రూ.33 లక్షలు అదనంగా వారికి దక్కుతుంది. అందులో ఎంత దక్కనుందోనని స్థానికులు చర్చించుకు ంటున్నారు.

**గతంలో ఇలాగే..**

గతంలోనూ సమగ్ర ప్రతిపాదనలు తయారు చేసే సంస్థలకు దోచి పెట్టినట్లు తెలుస్తోంది. పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పనకు కేటాయించిన రూ.92.5 కోట్ల పనులకు సంబంధించి సమగ్ర ప్రతిపాదనలు తయారు చేయడంలోనూ కన్సల్‌టెంట్‌కు అవగాహన లేక సమగ్ర ప్రాజెక్టు నివేదిక తయారీ ఆలస్యమైంది.

**నిబంధనలు ఉల్లంఘిస్తే రద్దు చేస్తాం –మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్**వెంటనే ఇంజినీరింగ్ విభాగం అధికారులతో చర్చిస్తా. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా టెండర్లు ఖరారు చేస్తే అవి ఏ దశలో ఉన్నా రద్దు చేస్తా. కరవు నిధుల పనులు నేను బాధ్యతలు తీసుకోకముందు జరిగాయి. వాటిలో ఏవైనా అక్రమాలు ఉంటే బిల్లుల చెల్లింపు నిలిపివేస్తా. అవసరమైతే విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకుంటా.

# ఒంటి గంట.. వైద్యుల ఇంటి బాట!

అనంతపురం : మధ్యాహ్నం దాటితే ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం దైవాదీనంగా మారిపోయింది. ఒంటి గంట తర్వాత కొన్ని ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల స్థానంలో ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి. రాత్రి వేళల్లో డ్యూటీ డాక్టర్లు ఇళ్లకే పరిమితమవుతున్నారు. అత్యవసరమైతేనే ఫోన్ చేయాలంటూ నర్సులు, సిబ్బందికి ఆదేశాలిచ్చి బయోమెట్రిక్ వేసి వెళ్లిపోతున్నారు. గత తీవ్ర అనారోగ్యంతో ఉరవకొండ ఆసుపత్రికి వచ్చిన బాలుడికి నర్సుతో వైద్యం చేయించారు. ఆ సమయంలో డ్యూటీ డాక్టర్ అందుబాటులో ఉన్నా.. ఏమీ పట్టకుండా పైన గదిలో నిద్రపోయారు. సరైన వైద్యం అందక బాలుడు చనిపోయాడని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు.

**అన్నింటికీ అనంతపురమే..**

టెక్నీషియన్లు కూడా వైద్యులు వెళ్లిపోయిన తరువాత ఉడాయిస్తున్నారు. అత్యవసర కేసు వస్తే ఎక్స్‌రే, ఈసీజీ తీయడానికి సిబ్బంది అందుబాటులో ఉండటం లేదు. అత్యధిక శాతం కేసులను అనంతపురం సర్వజన వైద్యశాలకు రెఫర్ చేస్తూ చేతులు దులుపుకొంటున్నారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి వస్తే ప్రాథమిక చికిత్స అందించకుండా పెద్దాసుపత్రికి పంపిస్తున్నారు.

**3 గంటలే సేవలు..!**

నిబంధనల మేరకు పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో వైద్యులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓపీ సేవలు



అందించాలి. డ్యూటీ డాక్టర్ 24 గంటలు అందుబాటులో ఉండాలి. కళ్యాణదుర్గం, ఉరవకొండలో ఉదయం 10 గంటల తర్వాతే ఓపీ ప్రారంభమవుతోంది. మధ్యాహ్నం ఒంటి గంటకు వైద్యులు వెళ్లిపోతున్నారు. రోజులో 3 గంటలు ఆసుపత్రిలో సేవలందిస్తున్నారు. డ్యూటీ డాక్టర్లు సక్రమంగా విధులకు హాజరు కావడం లేదు. రాయదుర్గం, గుంతకల్లు ప్రాంతీయ ఆసుపత్రుల్లోనూ మధ్యాహ్నం తర్వాత సక్రమంగా విధుల్లో ఉండటం లేదు.

**నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు** –డేవిడ్ సెల్వన్‌రాజ్, జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి

డ్యూటీ డాక్టర్ 24 గంటల పాటు విధుల్లో ఉంటారు కాబట్టి నిద్రపోవడంలో తప్పులేదు. కేసులు వచ్చినప్పుడు నర్సులు సమాచారం ఇస్తే వచ్చి చికిత్స చేస్తారు. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో వైద్యులు మధ్యాహ్నం తర్వాత ఉండటం లేదనే విషయంపై విచారణ జరుపుతాం. నిర్లక్ష్యంగా ఉన్నవారిపై తగిన చర్యలు తీసుకుంటాం.

# తవ్వేసి.. దోచేస్తూ..!



పుట్టపర్తి : మట్టి మాఫియా చెలరేగిపోతోంది. కొండలు, గుట్టలు, వంకలు, చెరువుల్లో మట్టి తవ్వేసి.. రవాణా చేస్తూ.. అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా భారీ యంత్రాలతో టిప్పర్లలో నింపి.. ప్రకృతి వనరులను కొల్లగొడుతున్నారు. అక్రమార్కులు టిప్పర్ మట్టిని రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు విక్రయిస్తున్నారు. ఈ తంతు యథేచ్ఛగా సాగుతున్నా పట్టించుకునేనాథులే కరవయ్యారు. అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు... ఆటువైపు కన్నెత్తి చూసిన పాపానపోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మాకు సంబంధం లేదన్నట్లు రెవెన్యూ, పోలీసు శాఖలు వ్యవహరిస్తుండటం పలు విమర్శలకు తావిస్తోంది. మట్టి మాఫియా దెబ్బకు కొండలు, గుట్టలు, కుంటలు కనుమరుగు అవుతున్నాయి. అధికారాన్ని అడ్డుపెట్టుకొని కొందరు నాయకులు ఇష్టారాజ్యంగా మట్టిని యంత్రాలతో తవ్వి తరలించేస్తున్నారు. జిల్లా కేంద్రం పుట్టపర్తితో పాటు కొత్తచెరువు, ముదిగుబ్బ తదితర ప్రాంతాల్లో ఈ దందా సాగుతోంది.

**ఎక్కడ.. ఎలాగంటే..**

పుట్టపర్తి సమీపంలోని కర్ణాటకనాగేపల్లి, కోవెలగుట్లపల్లి, కప్పలబండ వద్ద గుట్టలను తవ్వేసి టిప్పర్లలో తరలిస్తున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా రవాణా సాగుతోంది. రోజు 100 నుంచి 150 టిప్పర్ల మట్టి పుట్టపర్తితోపాటు పరిసర ప్రాంతాల్లోని లేఅవుట్‌లు, ఇతరత్రా వినియోగాలకు తరలిస్తున్నారు.

కొత్తచెరువులోని ప్రభుత్వ కార్యాలయాలకు కూతవేటు దూరంలోని పాములగుట్ట, పెనుకొండ రహదారిలోని నల్లగుట్ట నుంచి ఇష్టారాజ్యంగా రవాణా సాగిస్తున్నారు. కొంత మంది నేతలు అధికారం ఉంది కాదా అని దందా చేస్తున్నారు.

ముదిగుబ్బ నుంచి కోడూరు వరకు చేపడుతున్న నాలుగు వరసల రహదారి నిర్మాణానికి సమీప గుట్టల నుంచి అనుమతులు లేకుండానే మట్టి వినియోగిస్తున్నారు.

**అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తాం..**

– ఓబుళరెడ్డి, జిల్లా మైనింగ్ అధికారి

జిల్లాలో మట్టి అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాం. మట్టి తరలిస్తున్నారని ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందిస్తున్నాం. ఇప్పటికే కొన్ని చోట్ల కేసులు నమోదు చేయించాం. రెవెన్యూ, పోలీసు శాఖల సహకారంతో ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

# ధర దక్కక.. పంట కాపాడుకోలేక!



కళ్యాణదుర్గం : సాగు సమయంలో ఆశాజనకంగా ఉన్న మొక్కజొన్న ధర తాజాగా తగ్గుముఖం పట్టడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోగా.. విపణిలో దళారులు కనీస మద్దతు ధర కంటే రూ.400 తగ్గిస్తుండటంతో పంటను ఎలా విక్రయించుకోవాలో తెలియక పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో సుమారు 64 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగైంది. అత్యధికంగా రాయదుర్గం, కణేకల్లు, గుమ్మఘట్ట, డి.హీరేహాళ్, బ్రహ్మసముద్రం, బొమ్మనహాళ్, కళ్యాణదుర్గం, పెద్దపప్పూరు తదితర ప్రాంతాల రైతులు మొక్కజొన్నపై ఆశలు పెట్టుకున్నారు.

**పెట్టుబడి భారమై..**

రైతులు నాలుగు కిలోల విత్తన ప్యాకెట్ రూ.3,500 చొప్పున కొనుగోలు చేసి పంట సాగు చేశారు. అన్ని కలిపి ఎకరాకు సుమారు రూ.35 వేలకు పైగా ఖర్చు చేశారు. సగటున 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చినా.. ధర తగ్గుముఖం పట్టడంతో కనీసం ఖర్చులైనా వచ్చేలా లేవని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

**'మద్దతు' ప్రకటించినా..**

ప్రభుత్వం క్వింటాలుకు రూ2,400 చొప్పున మద్దతు ధర ప్రకటించినా.. విపణిలో దళారులు రూ2,000 నుంచి రూ2,100 మాత్రమే చెల్లిస్తామంటున్నారు. ఈ నేపథ్యంలో కొందరు రోడ్డు పక్కన, పొలాల్లోనే పంటను ఆరబోసి ఎదురుచూస్తున్నారు. మరోవైపు వర్షాలు కురుస్తుండటంతో పంటను కాపాడుకోలేక పడరాని పాట్లు పడుతున్నారు.

**ఖర్చు కూడా వచ్చేలా లేదు – రామాంజిని, యర్రగుంట**

దిగుబడులు వచ్చినా మద్దతు ధర దక్కక ఎకరాకు రూ.10 వేలు నష్టపోవాల్సిన దుస్థితి. మార్కెట్‌కు తెచ్చాక ధర తగ్గించి ఇస్తామని చెబుతుండటంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నాం.

**రోడ్డపైనే ఆరబోస్తున్నాం.. – శ్రీరామప్ప, బోరంపల్లి**

రెండెకరాల్లో సాగుకు రూ.65 వేలకు పైగా పెట్టుబడి పెట్టాం. పంట ఆశాజనకంగా ఉన్నా ధర తగ్గింది. రోడ్డుపైనే పంట ఆరబోశాం. వర్షాలు కురుస్తుండటంతో కవర్లు కప్పి రక్షించుకోలేకపోతున్నాం. మొక్కజొన్న తడిస్తే ఎందుకూ పనికిరాకుండా పోతుంది.

**త్వరలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు – రాఘవేంద్రకుమార్, ఏడీ, పెన్నేశ్వరి, మార్క్‌ఫెడ్ అధికారిణి**త్వరలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరతో కొంటాం. ఈ మేరకు సన్నాహాలు చేస్తున్నాం. పంటలో తేమశాతం ఎక్కువగా ఉన్న రైతులు ఆరబెట్టుకొని తీసుకొస్తే మద్దతు ధర లభిస్తుంది.

# పీజీ కోర్సులకు తగ్గిన క్రేజీ

పుట్టపర్తి : పీజీసెట్ రాయడానికి విద్యార్థులు పోటీ పడేవారు. సీటు సాధించడం ఆషామాషీ విషయం కాదు. ఇదంతా ఒకప్పుటి మాట. వర్సిటీలో పీజీ చేయడానికి చాలా మంది ఆసక్తి చూపడం లేదు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో 33 పీజీ కోర్సులకు గాను 1,100 సీట్లు ఉన్నాయి. ప్రస్తుతం ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతోంది. మొదటి విడతలో 213 సీట్లు భర్తీ అయ్యాయి. సైన్స్‌లో 18 విభాగాలు ఉండగా 157 సీట్లు... ఆర్ట్స్‌లో 15 విభాగాలకు 56 సీట్లే భర్తీ కావడం గమనార్హం. 2023లో 326.. గతేడాది 296 సీట్లు భర్తీ కాగా... ఈ ఏడాది ప్రవేశాలు మరింతగా తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**6 విభాగాలకు ఆరుగురే..**

హిందీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, గ్రామీణాభివృద్ధి, సామాజిక కృషి, పాలిమార్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్‌లో కేవలం ఒకరు చొప్పున మాత్రమే అడ్మిషన్ పొందడం గమనార్హం.

**రెండో విడతలో పెరిగేనా..**

మొదటి విడత ప్రవేశాలకు ఈనెల 27తో గడువు ముగిసింది. రెండో విడతకు 29 (నేటి) నుంచి కౌన్సెలింగ్ ఆరంభమవుతుంది. 'తొలి విడతలో ప్రవేశం పొంది రిపోర్ట్ చేసిన సుమారు 30 మంది ఫీజు చెల్లించలేదు. 29న ఫీజు చెల్లించినా ప్రవేశానికి అనుమతి ఉంటుంది. ఈ విడతలో మరింత మంది విద్యార్థులు చేరే అవకాశం ఉంది' అని వర్సిటీ రిజిస్ట్రార్ రమేష్‌బాబు పేర్కొన్నారు.



**వైకాపా ప్రభుత్వ నిర్వాకంతో..**

వైకాపా హయాంలో వర్సిటీల పరిస్థితి దయనీయంగా ఉండేది. విద్యార్థులకు చెల్లించే ఉపకారవేతనాలు బోధన రుసుం విశ్వవిద్యాలయాల ఖాతాలో జమ చేయకుండా ప్రచార ఆర్భాటం కోసం వసతిదీవెన, విద్యాదీవెన పథకాలు ప్రవేశపెట్టారు. సదరు పథకాల కింద విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ఆ సొమ్ము జమ చేస్తామన్నారు. అవి కూడా సక్రమంగా చెల్లించకపోవడంతో పేద తల్లిదండ్రులకు చదివించడం భారంగా మారింది. అప్పటి నుంచి ప్రవేశాలు తగ్గుతూ వస్తున్నాయి.

# జల కాలుష్యం.. తగ్గించడం అవశ్యం

తిరుపతి : నీటిని కలుషితం చేసే పారిశ్రామిక, వ్యవసాయ వ్యర్థాలైన సీసం, పాదరసం, ఆర్సెనిక్, కాడ్మియం వంటి వాటితో మానవ ఆరోగ్యానికి, జలచరాలకు ఎంతో హాని కలుగుతుంది. రసాయన రంగులతో రూపొందించిన వినాయక విగ్రహాల నిమజ్జనంతోనూ జలకాలుష్యం పెరుగుతోంది. దీన్ని తన వంతుగా కొంతైనా తగ్గించాలని భావించింది శ్రీపద్మావతి మహిళా వర్సిటీ ఇంటిగ్రేటెడ్ బయోటెక్నాలజీ విద్యార్థిని డి.కుందనసాయి. ఈమె ఆలోచనను ఆవిష్కరణగా మార్చడానికి వర్సిటీ టీబీఐలోని నిధి ప్రయాస్ స్కీం రూ.5 లక్షల నిధులు మంజూరు చేసింది. వీటితో ఒక పరికరాన్ని రూపొందించింది.

**ఆల్గేతో డివైజ్..**

మైక్రోఆల్గే, అయస్కాంత కణాలు, మొక్కల ఆధారిత ఫైబర్లతో కుందనసాయి ఓ పరికరాన్ని రూపొందించింది. ఇది నీటిలోని భార లోహాలను పీల్చుకుని శుద్ధజలాలను ఇస్తుంది. 600 లీటర్ల నీటిలో



పేరుకుపోయిన వంద శాతం సీసం, 95 శాతం రాగి, 60 శాతం కాడ్మియం, 85 శాతం కోబాల్ట్ లను 48 గంటల్లో తొలగిస్తుంది.

**ప్రథమ బహుమతి సాధించా**

సైన్స్ అంటే ఇష్టంతో నీటి కాలుష్య నివారణపై ఏడాదిపాటు పరిశోధనలు చేసి ఈ డివైజ్‌ను రూపొందించా. అమెరికన్ ఎంబసీ ఆధ్వర్యంలో భువనేశ్వర్‌లో జరిగిన అకాడమీ ఫర్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ కార్యక్రమంలో మొదటి బహుమతి సాధించా. హైదరాబాద్ టీహబ్‌లో జరిగిన ఐకాన్ భారత్ పోటీల్లోనూ ప్రథమ బహుమతి నాకే వచ్చింది. ఆచార్య నాగార్జున వర్సిటీలో జరిగిన ఇన్నోవేటర్స్ పోటీల్లో ఉత్తమ పురస్కారం దక్కింది. చదువు పూర్తయ్యాక స్టార్టప్ నెలకొల్పుతా. కుందనసాయి

# రక్తపోటు.. చక్కెర కాటు

తిరుపతి: మారిన జీవనశైలి.. జంక్‌ఫుడ్, మద్యం, ధూమపానం వంటి అలవాట్లకు తోడు నిద్రలేమి, శారీరక శ్రమ కొరవడటంతో ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసులను రక్తపోటు, మధుమేహం చుట్టుముడుతున్నాయి. ఈ విషయం ఇటీవల ప్రభుత్వం చేసిన ఎన్‌సీడీ 3.0 సర్వేలో తేటతెల్లమైంది. రెండు జిల్లాల్లో అధిక రక్తపోటు, మధుమేహం బాధితుల సంఖ్య పెరుగుతోందని గణాంకాలు చెబుతున్నాయి. ఇవి ప్రమాద ఘంటికలను మోగిస్తున్నాయి.

**ఏం చేయాలంటే..** 20 ఏళ్లు దాటిన వారు ఏడాదికి ఒకసారైనా గ్లూకోజు పరీక్ష చేయించుకోవాలి.

పరగడుపున రక్తంలో గ్లూకోజు మోతాదు 100–125 మధ్యలో ఉ



ంటే ముందస్తు మధుమేహంలోకి అడుగుపెట్టినట్లే.

మధుమేహం నిర్ధారణ అయితే తొలిరోజు నుంచే వైద్యులు సూచించిన ఔషధాలు వినియోగించాలి.

రోజూ వ్యాయామం, సమయానికి ఆహారం తీసుకోవాలి.

జిల్లాలో స్క్రీనింగ్ లక్ష్యం: 17,71,424

ఇప్పటివరకు పూర్తి: 16,58,756

గుర్తించిన బాధితుల సంఖ్య అధిక రక్తపోటు: 75,639

మధుమేహం: 63,424 రెండూ ఉన్నవారు: 92,019

నోటి క్యాన్సర్: 1 రొమ్ము : 1 గర్భాశయ ముఖద్వార క్యాన్సర్: 1

# 'గుట్ట'నక్కల పాలు

చిత్తూరు : చిత్తూరు మండలంలో ఆక్రమణలకు అంతే లేకుండా పోతోంది. కనిపించిన కొండలు, గుట్టలు, చెరువు పోరంబోకు భూములను ఇష్టానుసారం కబ్జా చేస్తున్నారు. తాజాగా ఓ పంచాయతీ కీలక నేత చెరువు సమీపంలోని కొండగుట్టను అన్యాక్రాంతం చేశారు. జిల్లా కేంద్రంలోనే ఈ తంతు జరుగుతున్నా.. రెవెన్యూ, జలవనరుల శాఖాధికారులు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.

చిత్తూరు మండలం దొడ్డిఅనంతాపురానికి చెందిన ఓ అధికార పార్టీ నేత ఇదే పంచాయతీలో 5.వెంకటాపురం చెరువు సమీపంలోని 15 ఎకరాల కొండగుట్టను దున్ని ఆక్రమణకు పాల్పడ్డారు. ప్రశ్నించిన వారిని బెదిరిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.

**విలువ.. పెరగడంతోనే**

చిత్తూరు–తచ్చూరు, బెంగళూరు–చెన్నై జాతీయ రహదారులు చిత్తూరు మండలం మీదుగా వెళ్లడంతో భూముల విలువ అమాంతం పెరిగింది. దీంతో అధికార పార్టీ నేతలు వైకాపా నాయకులతో కుమ్మక్కై ప్రభుత్వ భూములు కనిపించినా కబ్జాలకు తెరలేపుతున్నారు. వీఆర్‌ఏ, వీఆర్వోలతో గ్రామంలో పరిశీలించి ఏదైనా ఉంటే చర్యలు తీసుకుంటామని తహసీల్దారు జయప్రకాష్ తెలిపారు.

# అభివృద్ధి ఆగి.. ఆదాయం తగ్గి!

రాయదుర్గం: రాయల కాలం నాటి ఆలయాల అభివృద్ధికి గ్రహణం పట్టుకుంది. రాయదుర్గం పరిధిలో ప్రసిద్ధ శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో చేపట్టిన కోనేరు, ప్రహరీ తదితర నిర్మాణ పనులు కొన్నాళ్లుగా ఆగిపోయాయి. నిధులు మంజూరై రెండేళ్లవుతున్నా ఆశించిన మేరకు పనులు జరగటం లేదని భక్తులు వాపోతున్నారు. దీంతో భక్తులకు అసౌకర్యంగా మారింది. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి రూ.2.65 కోట్లు మంజూరవగా... దేవాదాయశాఖ నుంచి రూ.1.50 కోట్లు కేటాయించారు. మొత్తం రూ.4.15 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు ఇప్పటి వరకు 40 శాతమే పూర్తి అయ్యాయి. బిల్లుల మంజూరులో జాప్యం కారణంగా గుత్తేదారు మిగతా 60 శాతం పనులు చేయలేదని తెలిసింది.

**అసౌకర్యంగా మారి..**

శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి, జంబుకేశ్వరస్వామి ఆలయాల ఎదుట గతంలో రూ.లక్షలు కేటాయించి నిర్మిస్తున్న దుకాణ సముదాయం పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం కంపచెట్లు పెరగడంతో నిత్యం పశువులు సంచరిస్తున్నాయి. పనులు పూర్తిచేసి వినియోగంలోకి తెస్తే



ఆదాయం పెరుగుతుంది. దాన్ని ఆలయ నిర్వహణకు కేటాయించడానికి వీలుకలుగుతుంది.

జంబుకేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో రూ.23 లక్షలతో ఆరేళ్ల కిందట భువనేశ్వరి ఆలయాన్ని నిర్మించినప్పటికీ విగ్రహ ప్రతిష్ఠలో జాప్యం ఏర్పడుతోంది. దాతలు ముందుకొచ్చినా అధికారులు పట్టించుకోలేదని ఆరోపణలున్నాయి. ఇటీవల ప్రభుత్వం ఆలయాలకు పాలకవర్గాలను ఏర్పాటు చేసింది. ఇప్పటికైనా ఆగిన పనులు పూర్తయ్యేలా పాలకవర్గాలు, అధికారులు కృషి చేయాలని భక్తులు కోరుతున్నారు.

**పనులు పూర్తయ్యేలా చర్యలు**

గుత్తేదారుతో మాట్లాడి వెంకటేశ్వరస్వామి ఆలయ పనులు పూర్తయ్యేలా కృషి చేస్తాం. భువనేశ్వరీదేవి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠతోపాటు నిలిచిపోయిన వ్యాపార సముదాయాల పనులు పూర్తి చేయించడానికి తగిన చర్యలు తీసుకుంటాం. నరసింహారెడ్డి, కార్యనిర్వహణాధికారి

# రైతుల ఇంట.. సిరుల పంట

తాళ్లూరు : గతేడాది వాణిజ్య పంటల్లో ప్రధానమైన మిర్చి, పొగాకుల సాగు గిట్టుబాటు కాక రైతులు తీవ్రంగా నష్టాల ఊబిలో కూరుకుపోయారు. మరోవైపు దిగుబడులు తక్కువగా రావడం కారణంగా పెట్టుబడులు సైతం దక్కలేదు. ఆ రెండు పంటలకు ప్రత్యామ్నాయంగా సాగు చేసేలా ప్రోత్సహించి చైతన్యపర్చాలని రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించింది. దీంతో జిల్లా వ్యవసాయాధికారి సూచనలతో సిబ్బంది రైతులకు అవగాహన కల్పించి ప్రత్యామ్నాయ పంటల సాగుపై చైతన్యం కల్పించారు. దీంతో సాగర్ ఆయకట్టు పరిధిలోని భూములు, ఆరకొరగా సాగునీటి వసతి కలిగిన భూముల్లో మొక్కజొన్న సాగు చేపట్టారు.

**తాళ్లూరు మండలంలోనే ఎక్కువ..**

ప్రస్తుత ఖరీఫ్‌లో జిల్లాలోని దర్శి, సంతనూతలపాడు, గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గాల్లో అధిక విస్తీర్ణంలో మొక్కజొన్న సాగులో ఉంది. ఈ సీజన్‌లో సాధారణ విస్తీర్ణం 3,120 హెక్టార్లుగా నమోదుకాగా, గతేడాదిలో 2345 హెక్టార్లో సాగైంది. జిల్లాలోకెల్లా తాళ్లూరు ప్రాంత రైతులు ఎక్కువగా మొక్కజొన్న వేశారు. తాళ్లూరు, కేవీపాలెం, శివరాంపురం, కొత్తపాలెం, మాధవరం, తూర్పుగంగవరం, బెల్లంకొండవారిపాలెం, లక్కవరం గ్రామాల రైతులు అయిదువేలకు పైగా ఎకరాల్లో సాగు చేపట్టారు. సాగర్ నీరు విడుదల చేయడంతో ఈ పంటపై రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.

**ఎకరాకు రూ.40 వేల వరకు ఆదాయం**

ఎకరా విస్తీర్ణంలో మొక్కజొన్న సాగు చేస్తే పంట చేతికొచ్చే సరికి రూ.30 వేల వరకు పెట్టుబడులు అవుతాయి. ఈ పాటికే రైతులు సుమారు రూ.పదిహేనువేల వరకు ఖర్చు చేసి కంటికి రెప్పలా పంటను కాపాడుకుంటున్నారు. పరిస్థితులు అనుకూలంగా కొనసాగితే 35 నుంచి 40 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తాయంటున్నారు. గతేడాది మాదిరిగా కనీస ధరలు దక్కినా రూ.70 వేల వరకు ఫల సాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. ఇలా చూస్తే ఎకరాకు రూ.40 వేలకు పైగా ఆదాయం వస్తుందని ఆశిస్తున్నారు.

# గూడన్నారు.. గోడు వినలేదు..!

ఎచ్చెర్ల: సొంత ఇళ్లు లేని ప్రభుత్వ ఉద్యోగులకు తక్కువ ధరకు గృహాలు నిర్మించేందుకు 2010లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ రాజీవ్‌స్వగృహ కార్పొరేషన్ పేరుతో ఎచ్చెర్ల మండలం షేర్‌మహ్మద్‌పురం పంచాయతీలోని కొండపై వంద ఎకరాల భూమిని ప్రభుత్వం కొనుగోలు చేసింది. అనమిత్ర టౌన్‌షిప్ పేరిట ప్లాట్లుగా విడదీసి ఇచ్చింది. ఇంత వరకు బాగానే ఉన్నా మౌలిక వసతుల కల్పించకపోవడంతో ఇక్కడ నివసిస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**చీకట్లు.. ఇక్కట్లు..** ఈ టౌన్‌షిప్‌లో రోడ్లు, వీధి దీపాలు, తాగునీటి సౌకర్యం లేవు. రాజీవ్‌స్వగృహ అనమిత్ర హౌసింగ్ వెల్ఫేర్ సొసైటీ పేరిట సంఘాన్ని ఏర్పాటు చేసుకున్న నివాసితులు ప్రతినెలా కొంత నిధులు వేసుకొని వీధి దీపాల నిర్వహణ, విద్యుత్తు ఛార్జీల చెల్లింపు, మౌలిక సౌకర్యాలతో పాటు ఇతర కార్యకలాపాలకు వినియోగిస్తున్నారు. తాగునీటి పథకం మూలకు చేరడంతో వ్యక్తిగత బోర్లు వేసుకుని వినియోగించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక్కడ నివసిస్తున్న వారిని ఎవరూ పట్టించుకోకపోవడంతో హౌస్ మ్యాపింగ్ లేక, ఆధార్, రేషన్, ఇతర గుర్తింపు కార్డులు పొందేందుకు వీలు కావడం లేదు. మురుగునీటి నిర్వహణ ప్లాంట్, డంపింగ్‌యార్డు, ప్రహరీ, గేటు వంటివి ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు. కాంగ్రెస్ హయాంలో ప్రభుత్వ ఉద్యోగులు ఆన్‌లైన్‌లో రూ.3,500 రిజిస్ట్రేషన్ రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్న ప్రకటనతో జిల్లాలో ఐదు వేలమంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. ఇళ్లు నిర్మాణానికయ్యే ఖర్చులో 25 శాతం దరఖాస్తు దారుడు ముందే చెల్లించి మిగిలింది బ్యాంకు నుంచి రుణంగా పొంది నిర్మాణం పూర్తిచేస్తామని ప్రకటించారు.

ఫేజ్-1లో 50 ఎకరాల్లో 500 ఇళ్లు నిర్మించేందుకు ప్లాట్లు వేయగా 54 మంది మాత్రమే 25 శాతం రుసుం చెల్లించి ఇళ్లు సొంతం చేసుకున్నారు. మరో 135 ఇళ్లు పునాదులు, శ్లాబుల స్థాయిలోనే అసంపూర్తిగా ఉండిపోగా, 322 స్థలాలు ఖాళీగా ఉన్నాయి. 2014లో తెదేపా ప్రభుత్వం వేలం వేసి 175 ఖాళీ స్థలాలు విక్రయించింది. ఇంకా 147 మిగిలాయి. తర్వాత వచ్చిన వైకాపా పట్టించుకోలేదు. అనమిత్ర టౌన్‌షిప్‌లో సీసీ, బీటీ రోడ్లు, అండర్ డ్రైనేజీ, వీధి దీపాలు, తాగునీటి సరఫరా సౌకర్యాల కల్పనకు సంబంధించిన పనులు రూ. 13.5 కోట్లతో కొనసాగుతున్నాయి. నవంబర్ నాటికి పూర్తిచేసేలా పనులు చేపడుతున్నాం.

# ఇసుక.. కొరత రానీయక!



ఒంగోలు : జిల్లాలో ఇసుక రేవులు అందుబాటులో లేకపోవడంతో రవాణా ఛార్జీల పేరుతో బయట మార్కెట్ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారు. కాస్త వర్షాలు కురిసి నదుల్లోకి నీరు చేరితే ఇసుక లభ్యత లేకుంటే రెట్టింపు ధరలు వసూలు చేస్తున్నారు. గత అనుభవాల దృష్ట్యా అధికార యంత్రాంగం ముందస్తు ఇసుక నిల్వలపై దృష్టిసారించింది. జిల్లాలోని అన్ని యార్డుల పరిధిలో రానున్న రెండు నెలల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొరత తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

జిల్లాలోని ఇసుక విక్రయాలకు సంబంధించి ఒంగోలులో ఒకటి, గిద్దలూరులో రెండు, మార్కాపురంలో మూడు, యర్రగొండపాలెంలో రెండు, కనిగిరిలో రెండు, దర్శిలో రెండు చోట్ల యార్డులు ఏర్పాటు చేశారు. యార్డుల నిర్వాహకులకు కేటాయించిన మేరకు నెల్లూరు జిల్లా సంగం బ్యారేజీ నుంచి ఇసుకను తీసుకొచ్చి విక్రయాలు జరుపుతున్నారు. తమ వద్దే ఇసుక కొనుగోలు చేయాలని యార్డుల నిర్వాహకులు రాజకీయ నాయకుల అండతో వినియోగదారులపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఆన్‌లైన్‌లో ఎవరైనా ఇసుక బుక్ చేసుకుని తెచ్చుకొనే వెసులుబాటు ఉన్నా బయట నుంచి ఇసుక లారీలను రానీయడం లేదు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు విక్రయించడంలేదు. టన్నుకు రూ.100 నుంచి రూ.300 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు.

ప్రధానంగా పశ్చిమ ప్రకాశం ప్రాంతంలో అధిక ధరలు వసూలు చేస్తున్నారు. రానున్న కాలంలో ఇసుకకు కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున జిల్లాలోని 12 యార్డుల పరిధిలో 75 వేల నుంచి 85 వేల టన్నుల నిల్వలు ఉండేవిధంగా చర్యలు చేపట్టారు. జిల్లాలో రోజుకు 600 టన్నుల నుంచి వేయి టన్నుల వినియోగం జరుగుతుంటుంది. చాలా వరకు డిపోల పరిధిలో కొనుగోళ్లు జరిగినా పాలేరు, గుండ్లకమ్మ నదీ పరివాహకాల నుంచి కొంతమేర ఇసుక తీసుకొస్తున్నారు.

**కాలనీ ఇళ్లకు 10 వేల టన్నులు**

జిల్లాలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలు సజావుగా సాగేవిధంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా 10 వేల టన్నుల ఇసుకను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఇప్పటికే గృహనిర్మాణశాఖ అధికారులు ఇచ్చిన ప్రతిపాదనల మేరకు సరఫరాకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వర్షాలు కురిసి ఇసుక లభ్యత తగ్గిన నేపథ్యంలో ముందస్తుగానే తాము నిల్వలు చేసినట్లు భూగర్భ గనులశాఖ జిల్లా అధికారి రాజశేఖర్ పేర్కొన్నారు. రానున్న కాలంలో ప్రజలకు ఇసుక కొరత రాకుండా చర్యలు తీసుకుంటామని వివరించారు.

# సర్కారు శాఖలు... వెళ్లారో షాకులు!



ఒంగోలు : జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంలో పలు ప్రభుత్వ శాఖలు ఉండగాబీ అందులో సగం కార్యాలయాలు ప్రారంభం నుంచి అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. స్థానిక కలెక్టరేట్ ఎదురుగా ఉన్న రిమ్స్‌ను కొత్తగా నిర్మించిన భవనంలోకి తరలించారు. దీంతో అప్పట్లో పాత రిమ్స్ సముదాయం ఖాళీ అయింది. తద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి అద్దెల భారం నుంచి విముక్తి కల్పించేందుకు 2011లో అప్పటి కలెక్టర్ పాత రిమ్స్‌లోని సముదాయంలో 20 ప్రభుత్వ శాఖల నిర్వహణ నిమిత్తం ఆయా విభాగాలకు అనుగుణంగా గదులు కేటాయించారు. కాలక్రమేణా పాత రిమ్స్ పరిసర ప్రాంతాల్లో అపరిశుభ్రత నెలకొంది. చిన్నపాటి వర్షానికే గుంతల్లోకి నీరు చేరి వాహన రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఈ మేరకు సముదాయంలో కార్యాలయాల నిర్వహణకు అనుకూలంగా లేకపోవడంతో ఇటీవల రెండు, మూడు శాఖలు నగరంలోని ఇతర అద్దె భవనాల్లోకి తరలించారు.

**అక్కడ కార్యాలయాలు ఇవే...**

ఉద్యానవన, ఉపాధి, మత్స్యశాఖ, వ్యవసాయశాఖ సబ్ డివిజన్, వైద్య విధాన పరిషత్తు, ఆరోగ్యశ్రీ, మలేరియా, ఆయుష్, హోమియోపతి, సైనిక, నైపుణ్యాభివృద్ధి, నెహ్రూ యువకేంద్రం, పర్యాటక, డివిజనల్ కో-ఆపరేటివ్, ఏపీఈడబ్ల్యూఐడీసీ, విద్య, సంక్షేమ ఇంజినీరింగ్ కార్యాలయాలు, పరిశ్రమలు, డిప్యూటీ డీఈవో, స్టెప్, మైనార్టీ, జిల్లా గురుకుల విద్యాలయాలు, బీసీ స్టడీ సర్కిల్, ఏపీఎంఐడీసీ, ఓపెన్ స్కూల్, వయోజన విద్యాశాఖ కార్యాలయాలు నిర్వహిస్తున్నారు.

**నిర్వహణ పట్టదా..?**

పాత రిమ్స్ ఆవరణలో ఇప్పటికీ సుమారు 15 కీలకమైన ప్రభుత్వ శాఖల కార్యాలయాలు నిర్వహిస్తున్నారు. మొదట్లో కార్యాలయాల పరిసర ప్రాంతం పరిశుభ్రతతోపాటు మౌలిక వసతుల నిర్వహణ నిమిత్తం నెలవారీ కనీస అద్దెను సంబంధిత వైద్య,ఆరోగ్యశాఖకు చెల్లించాలని నిబంధన పెట్టారు. దీంతో ప్రారంభం సమయంలో కొన్నేళ్లపాటు అద్దె జమ చేశారు. అందుకు సంబంధితశాఖ నుంచి వైద్య, ఆరోగ్య శాఖ ఖాతాకు జమయ్యేవిధంగా పీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేసేవారు. కాలక్రమేణా వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్యాలయాల నిర్వహణలో భాగంగా అద్దె చెల్లింపుల నిమిత్తం అప్‌లోడ్ చేసినా బిల్లులు విడుదల కాలేదు. దీంతో జిల్లా అధికార యంత్రాంగానికి కార్యాలయాల నిర్వహణ కష్టంగా మారింది. కార్యాలయాలకు వెళ్లే ఇరువైపులా అంతర్గత రహదారులు గుంతలు పడ్డాయి. చిన్నపాటి వర్షానికి నీరు చేరి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పైగా ఆవరణలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి పోవడంతో పాటు పారిశుద్ధ్యం నిర్వహణ అధ్వానంగా మారింది. ఉద్యోగులతోపాటు ప్రజల అవసరాల నిమిత్తం ఆవరణలో నిర్మించిన మరుగుదొడ్లకు తాళాలు వేయడంతో నిరుపయోగంగా మారాయి. కార్యాలయాలకు చెందిన ప్రభుత్వ వాహనాలు సైతం మరమ్మతులకు నోచుకోక తుప్పుపట్టి పోయాయి.

# అక్రమాల 'సదరం'గం!

ఒంగోలు : నకిలీ దివ్యాంగ పత్రాలు ఇచ్చిన వైద్యులపై చర్యలకు రంగం సిద్ధమవుతోంది. నకిలీ సదరం ధ్రువపత్రాలు ఇచ్చిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇటీవల నవ్యాంధ్ర వికలాంగుల సేవాసమితి అధ్యక్షుడు షేక్ కాలేషా ముఖ్యమంత్రి కార్యాలయంలో అర్జీ ఇచ్చారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి ఎం.రవిచంద్ర నెల రోజుల్లో చర్యలు తీసుకుని వివరాలు పీజీఆర్ఎస్ ఆన్‌లైన్ పోర్టల్‌లో ఉంచాలని వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. గత వైకాపా ప్రభుత్వంలో సదరం ద్వారా ఇచ్చిన ధ్రువీకరణ పత్రాల్లో పెద్దఎత్తున అక్రమాలు జరిగినట్లు గుర్తించిన కూటమి ప్రభుత్వం ఇటీవల పునఃపరిశీలన చేపట్టింది. ముందుగా దివ్యాంగ పింఛన్లు పొందుతున్నవారిలో మంచానికి పరిమితమైన వారిని మినహాయించి మిగిలిన వారి పత్రాలను సదరం ద్వారా పునఃపరిశీలన చేపట్టారు. వీరిలో మొత్తం 4,654 మంది అనర్హులున్నట్లు గుర్తించి నోటీసులు జారీ చేశారు. అర్హతలేని వారి పింఛను నిలిపివేతకు చర్యలు తీసుకుంటారని భావించారు. ఇంతలో కొంతమంది తమకు అర్హతలున్నా పింఛను నిలిపి వేతకు నోటీసులు ఇచ్చారని ప్రజాప్రతినిధుల ద్వారా ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా అర్హుల పింఛన్లు కూడా తీసేయబోతున్నారని అసత్య ప్రచారం సైతం చేశారు. అప్పీలు చేసుకున్నవారిని తిరిగి సదరం శిబిరానికి



పిలిపించి రెండోసారి స్క్రీనింగ్ చేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. వీరిలో 1,062 మంది వృద్ధాప్య పింఛనుకు కూడా అర్హులు కావడంతో ఆ జాబితాలోకి మార్చారు. మరో 3,592 మంది అనర్హుల జాబితాలో ఉన్నారు. మరో నాలుగు రోజుల్లో పునఃపరిశీలన పూర్తికానుంది. గత ప్రభుత్వంలో నాయకుల సిఫార్సు మేరకు ఒక వేలు, ఒక కన్ను వికలత్వం ఉన్నవారికి కూడా వైద్యులు 60 నుంచి 70 శాతం వరకు డిజేబిలిటి నమోదు చేసి పింఛన్లు పొందడానికి వీలు కల్పించారు. రీ అసెస్‌మెంట్ ప్రకారం బోగస్ అని నిర్ధారణ అయిన పింఛన్లపై త్వరలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది.

# సంకల్ప బలం.. కళల సాకారం

తిరుపతి : విత్తనానికి జీవం కల్పించినట్లే కృషితో సంకల్పానికి రూపకల్పన చేయాలి. అప్పుడే కష్టాలెన్ని ఎదురైనా విజయతీరాలు చేరవచ్చంటున్నారు ఈ విద్యార్థినులు. ఊహతెలియని వయసులో తల్లిదండ్రుల్ని కోల్పోయినా ఉన్నత విద్యనభ్యసిస్తున్నారు ప్రవల్లిక, రేవతి, దీపిక.. కటిక పేదరికంతో తల్లిదండ్రులు తమను చదివించలేక శరణాలయంలో చేర్పించినా.. అవకాశాలు సద్వినియోగం చేసుకుంటూ పీజీ విద్యనభ్యసిస్తున్నారు జ్యోత్స్న, త్రివేణి. శ్రీపద్మావతి మహిళా వర్సిటీ సంగీతం, నృత్యం, కళల విభాగంలో ఎంఏ భరతనాట్యం కోర్సు చదువుతున్న వీరి జీవితంలో ఎన్ని అడ్డంకులెదురైనా నృత్యకారిణులుగా రాణించాలనే సంకల్పంతో సాగుతున్నారు. హైదరాబాదులోని శ్రీసత్యసాయి సేవాసంఘ్ సహకారంతో ప్రాథమికవిద్యను ప్రారంభించి పీజీ స్థాయికి ఎదిగారు. వారు తమ అనుభవాలు పంచుకున్నారు.

**పేదరికం అడ్డు కాకూడదని : జ్యోత్స్న**

మాది శ్రీకాకుళం. అమ్మ గృహిణి. నాన్న చిన్న ప్రైవేటు ఉద్యోగం చేస్తారు. పేద కుటుంబం కావడంతో మమ్మల్ని చదివించలేని పరిస్థితిలో తల్లిదండ్రులు శ్రీసత్యసాయి సేవాసంఘ్‌లో చేర్పించారు. ఆసక్తి కొద్దీ నృత్యం కోర్సులో చేరా. కళలు అంటే క్రమశిక్షణ. మనిషి తన జీవితాన్ని ఎలా గడపాలో కళలు మనకు నేర్పిస్తాయి. హైదరాబాదు, తిరుపతిలో



భరతనాట్య ప్రదర్శనలిచ్చా.

**తల్లిదండ్రుల ప్రేమ తెలియదు : రేవతి**

మాది మహబూబ్‌నగర్ జిల్లా ఆత్మకూరు. నాలుగేళ్ల వయసులోనే తల్లిదండ్రులు చనిపోయారు. ప్రాథమిక విద్యనుంచి పీజీ వరకు సత్యసాయి సంస్థ సహకారారంతోనే చదువుతున్నాం. కళలపై ఉన్న ఇష్టంతో ఎంఏ భరతనాట్యం కోర్సులో చేరా. అనేక ప్రదర్శనలిచ్చా. కొంచెం ఆసక్తి ఉంటే కళల్లో రాణించవచ్చు.

**అబ్దుల్ కలాం స్ఫూర్తితో: ప్రవల్లిక**

నాకు రెండేళ్లు ఉండగా ప్రమాదవశాత్తు తల్లిదండ్రులు చనిపోయారు. మేనత్త సహకారంతో సత్యసాయి సేవాసంఘ్‌లో చేరా. సిద్దిపేటలో ఇంటర్, గుల్బర్గాలో డిగ్రీ భరతనాట్యం కోర్సు చేశా. మహిళా వర్సిటీలో ఎంఏ భరతనాట్యం కోర్సు చదువుతున్నా. సంకల్పబలంతో ప్రపంచ ఖ్యాతి సాధించిన మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం నాకు స్ఫూర్తి.

**ఆశయాన్ని బలపరచుకోవాలి: త్రివేణి**

మాది శ్రీకాకుళం జిల్లా. అమ్మ గృహిణి, నాన్న ప్రైవేటు ఉద్యోగి. మేం ముగ్గురు సంతానం. పేదరికం కారణంగా నాన్న నన్ను సత్యసాయి సంస్థలో చేర్పించారు. కష్టాలు వస్తుంటాయి పోతుంటాయి. వాటిని తలచుకుని బాధపడితే ఏదీ సాధించలేం. భవిష్యత్తులో గొప్ప నృత్యకళాకారిణి కావాలనే లక్ష్యంతో కృషి చేస్తున్నా. చదువుతోపాటు యోగా, కరాటేలో శిక్షణ తీసుకుంటున్నా.

**మొలకెత్తని విత్తనంగా ఉండకూడదు : దీపిక**

మనలో మనం గమనించని ఎన్నో అద్భుత శక్తులున్నాయి. వాటిని వెలికితీసే ప్రయత్నం చేయనంతకాలం మొలకెత్తని విత్తనంగా ఉండిపోతాం. అలా ఉండటం నాకు ఇష్టం లేదు. తొమ్మిదేళ్ల వయసులో అమ్మ, 13 ఏళ్ల వయసులో నాన్న చనిపోయారు. ఉన్నత స్థానానికి వెళ్లాలంటే గట్టి ప్రయత్నం చేయాలని చదువుపై దృష్టిపెట్టా. జిల్లా, రాష్ట్రస్థాయిలో ఎన్నో ప్రదర్శనలిచ్చా. భవిష్యత్తులో దేశం గర్వించే నృత్యకళాకారిణి కావాలనేదే నా లక్ష్యం.

# పేరు సం'క్షేమం'.. తీరు సం'క్షామం'

ఏలూరు : భీమడోలు మండలం గుండుగొలనులోని ఎస్సీ బాలికల వసతి గృహం ఆరేళ్ల కిందట శిథిలమై కూలిపోయింది. అప్పట్నుంచి స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలోని రెండు గదుల్లో 65 మంది బాలికలు వసతి పొందుతున్నారు. పాత భవనం ఆవరణలోని అధ్వాన మరుగుదొడ్లే వినియోగిస్తున్నారు.

జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు సమస్యల ఊబిలో కూరుకుపోయి కొట్టుమిట్టాడుతున్నాయి. చాలా చోట్ల భవనాలు శిథిలావస్థకు చేరాయి. పెచ్చులూడి ప్రమాదకరంగా మారాయి. మరుగుదొడ్లకు తలుపుల్లేవు. కిటికీలకు దోమ తెరల్లేవు. వర్షాకాలంలో దోమలు విజృంభిస్తే.. విద్యార్థులు రోగాల బారిన పడే ప్రమాదముంది. కొన్నిచోట్ల అరకొరగా దుప్పట్లు ఇవ్వగా.. మరికొన్నిచోట్ల అసలు ఇవ్వలేదు. అద్దె భవనాల్లో సరైన వసతుల్లేక పిల్లలు అల్లాడిపోతున్నారు.

**కూటమి పాలనలో ఉపశమనం..**

వైకాపా సర్కారు నిర్లక్ష్యం కారణంగా సంక్షేమ వసతి గృహాల నిర్వహణ తీసికట్టుగా మారింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, 13 బీసీ బాలుర వసతి గృహాలకు ఒక్కోదానికి రూ.1.50 లక్షలు చొప్పున కేటాయించింది. 52 ఎస్సీ వసతి గృహాలకు 5.75 కోట్లు మంజూరు చేసింది. ఆ నిధులతో అధికారులు సదుపాయాలు



మెరుగుపరుస్తున్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటామని సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు విశ్వమోహన్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి నాగరాణి తెలిపారు. ఉంగుటూరు మండలం కైకరంలోని ఎస్సీ బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరింది. ఎక్కడికక్కడ శ్లాబు పెచ్చులూడుతోంది. కిటికీలకు తలుపులు, దోమ తెరల్లేవు. జంగారెడ్డిగూడెం బీసీ బాలుర వసతి గృహంలో పరుపులు, దోమ తెరలు చిరిగిపోయాయి. చేతి పంపు పని చేయడం లేదు. ముసునూరు బీసీ బాలుర వసతి గృహం భవనం శ్లాబు పెచ్చులూడుతోంది. చిన్నపాటి వర్షానికే చెమ్మగిల్లుతోంది.

## అడగలేవని.. మందులు మరిచారా?

పుట్టపర్తి : రైతుసేవా కేంద్రాల్లో పశువైద్యం గగనమైపోయింది. 2019 నుంచి 2024 మధ్య అధికారంలో ఉన్న వైకాపా... రైతు భరోసా కేంద్రాల్లో పశువైద్యాన్ని అందుబాటులోకి తెచ్చామని గొప్పలు చెప్పింది. వాటిని నిర్వహించడానికి అవసరమైన నిధుల కేటాయింపు, మందులు అందించాలన్న స్పష్టమైన విధానం రూపొందించలేదు. సిబ్బందిని మాత్రమే కేటాయించి గాలికొదిలేసింది. 2023 నుంచి అరకొర మందులను సరఫరా చేసి బంద్ చేసింది. దీంతో అవి నిరుపయోగంగా మారాయి.

మడకశిర నియోజకవర్గంలోని 12 పశువైద్యశాలల్లో ఇద్దరు వైద్యులే ఉన్నారు. కానీ 51 రైతు సేవా కేంద్రాల్లో 51 మంది సహాయకులున్నారు. ఏ ఒక్క కేంద్రంలోనూ మందులు లేవు. కర్ణాటక సరిహద్దు ప్రాంతం కావడంతో వ్యాధులు సోకిన పశువులను రైతులు అక్కడికే వెళ్లి సొంత ఖర్చుతో మందులు తెచ్చుకుంటున్నారు.

**అక్కడ సిబ్బంది కొరత.. ఇక్కడ ఖాళీగా..**

శ్రీసత్యసాయి జిల్లాలోని 32 మండలాల్లో పశువులకు వైద్యం అందించేందుకు మండల కేంద్రాలు, ప్రధాన గ్రామాల్లో 66 ఆసుపత్రులున్నాయి.



15 ప్రాంతీయ పశువైద్య కేంద్రాలు, 23 గ్రామీణ ఉప కేంద్రాలు, హిందూపురంలో ఒక పాలిక్లినిక్ అందుబాటులో ఉన్నాయి. వాటికి ఏడాదిలో రెండు నుంచి మూడుసార్లు మందులు సరఫరా చేస్తున్నారు. కానీ సిబ్బంది కొరత వేధిస్తోంది. పశువులను మండల కేంద్రాలకు తరలించాలంటే రైతులు వ్యయప్రయాస పడాల్సి వస్తోంది. రైతు సేవా కేంద్రాల్లో గ్రామ పశు సహాయకులు అందుబాటులో ఉన్నా ఫలితం లేకపోతోంది. ఇక్కడ మందులు అందుబాటులో లేవు.

**సర్దుబాటు చేస్తున్నాం : శుభదాస్, పశుసంవర్ధకశాఖ జిల్లా జేడీ**

రైతు సేవా కేంద్రాలకు మందుల సరఫరా లేనిమాట వాస్తవమే. ప్రభుత్వం పశువైద్యశాలలకు మందులు ఇస్తోంది. అవసరమైన చోట వాటిని సర్దుబాటు చేస్తున్నాం. సిబ్బంది తక్కువ ఉన్నచోట ఆర్ఎస్కేల్లోని సహాయకులు సహకారం అందిస్తారు.

**శ్రీసత్యసాయి జిల్లాలో ఇలా..**

రైతు సేవా కేంద్రాలు: 412
గ్రామ పశు సహాయకులు: 323
ఆవులు: 2.81 లక్షలు
గేదెలు: 96 వేలు
గొర్రెలు: 26.29 లక్షలు
మేకలు: 4.45

## కొండల్లో కొలువుల సాగు

తుని : చుట్టూ పచ్చని కొండల మధ్య ఉన్న ఆ ఊరును చూడగానే ఎంతో ముచ్చట వేస్తుంది. కానీ అభివృద్ధి అంతంతమాత్రమే. నేటికీ బస్సు సౌకర్యం కూడా లేదు. ఆర్థిక, సామాజిక సమస్యలతో ఆ గ్రామస్థులు విసిగిపోయారు. చదువే తమ జీవితాలను మారుస్తుందని గట్టిగా నమ్మారు. పాతికేళ్ల నాటి వారి కల నేడు నిజమైంది. ప్రస్తుతం అక్కడ 150 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. అదే.. తుని నియోజకవర్గంలోని కేవో మల్లవరం.

**అలా మొదలైంది..**

గ్రామంలో సుమారు 4వేల జనాభా ఉంది. ఏమాత్రం అభివృద్ధి అంతంత మాత్రమే. అందరికీ వ్యవసాయమే ఆధారం. ఆరుతడి పంటలే పండుతాయి. ఆర్థికంగా ఎప్పుడూ సమస్యే. తమ బిడ్డలను బాగా చదివించి, ఉద్యోగులుగా చూడాలని 25 ఏళ్ల క్రితం గ్రామస్థులు సంకల్పించుకున్నారు. సర్కారు కొలువు సాధించేలా చిన్నప్పటి నుంచి ప్రోత్సహించారు. వారి కృషితో 15 ఏళ్ల క్రితం ఓ పదిమంది ఉద్యోగాలు సాధించారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని మిగిలిన వారు అదే బాటలో పయనిస్తున్నారు. ఇటీవల 9 మంది ఉపాధ్యాయులుగా ఎంపిక కాగా, మరో ముగ్గురు కానిస్టేబుల్ ఉద్యోగం సాధించారు. ఆర్మీ, నేవీ, పోలీసు, రైల్వే, విద్యా, వైద్యశాఖల్లో పనిచేస్తున్నారు.

**కలిసి సాధించాం..**

ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో చదువుకున్నాం. ఎన్ని కష్టాలొచ్చినా మా లక్ష్యం మరిచిపోలేదు. వివాహమైన తర్వాత కూడా కలిసి సాధన చేశాం. తాజాగా ఇద్దరం ఉపాధ్యాయులుగా ఎంపికయ్యాం.
– ఎన్.నాగేశ్వరరావు, లీలా శివజ్యోతి, దంపతులు

**చిన్నప్పటి నుంచి సాధన..**

చిన్నప్పటి నుంచి స్నేహితులం. క్రీడాకోటాలో కొలువు సాధించాలని నిర్ణయించుకున్నాం. చిన్నప్పటి నుంచి ఆటల్లో పోటీ పడేవాళ్లం. బీ-పీఈడీ చేసి, ఏళ్లుగా సాధన చేస్తున్నాం. ఇప్పుడు పీఈటీలుగా ఎంపికయ్యాం.
– సుర్ల కృష్ణవేణి, చందక శ్రావణి, స్నేహితులు

## స్మార్ట్ చిక్కులు.. పంపిణీకి తిప్పలు

కాకినాడ : స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీకి చిక్కులు తప్పడం లేదు. పట్టణాల్లో మ్యాపింగ్ సమస్యతో తమకార్డు ఏ దుకాణం పరిధిలో ఉందో తెలుసుకోవడానికి కార్డుదారులు ముప్పుతిప్పలు పడుతున్నారు. గత ప్రభుత్వంలో మూడు, నాలుగు చౌక దుకాణాల పరిధిలోని రేషన్‌కార్డులను ఒక ఎండీయూ ఆపరేటర్‌కు మ్యాపింగ్ చేశారు. ఈ క్రమంలో కొన్నికార్డులు వేర్వేరు దుకాణాలకు మారిపోయాయి. దీని ప్రకారం స్మార్ట్‌కార్డులను కేటాయించారు.దీంతో ఏ డీలరు వద్ద ఉందో తెలుసుకోడానికి నానా ఇక్కట్లు పడుతున్నారు.

**ముందుకు సాగని ప్రక్రియ**ఎక్కడినుంచైనా రేషన్(పోర్టబులిటీ) తీసుకునే విధానం అమల్లో ఉండటంతో కార్డుదారులు సమీపంలోని దుకాణాల నుంచి సరకులు పొందుతున్నారు. స్మార్ట్‌కార్డులు మాత్రం గతంలో మ్యాపింగ్ చేసిన దుకాణాల్లోనే అందుబాటులో ఉంటున్నాయి. అక్కడకు వెళ్లి అడుగుతుంటే డీలర్లు జాబితా ఇస్తున్నారు. వీటిలో పేర్లు లేకపోతే మరిన్ని దుకాణాలు తిరగాల్సి వస్తోంది. కార్డు ఉందో లేదోనని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఈ నెల 1 నుంచి జిల్లా వ్యాప్తంగా 1,060 చౌక దుకాణాల పరిధిలో పంపిణీ ప్రారంభించారు. జిల్లాకు 6,36,245 స్మార్ట్‌కార్డులు రాగా, శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు 1,11,563 కార్డులు అంటే 18 శాతం పంపిణీ చేశారు. గొల్లప్రోలు మండలంలో 0.06 శాతం, పిఠాపురంలో 1.99 శాతం, గండేపల్లిలో 5.17 శాతం, యు.కొత్తపల్లి మండలంలో 6.92 శాతం మాత్రమే పంపిణీ జరిగింది. పిఠాపురం నియోజకవర్గానికి పౌరసరఫరాల ఉప తహసీల్దారు లేకపోవడం దీనికి కారణమని అధికారులు చెబుతున్నారు. సామర్లకోట, తుని, కరప, జగ్గంపేటలో 35 నుంచి 38 శాతం మందికి అందించారు.

**త్వరగా అందించేలా చర్యలు**స్మార్ట్‌రేషన్‌కార్డు ఏ చౌకదుకాణం పరిధిలో ఉందో ఆన్‌లైన్‌లో తెలుసుకునే వెసులుబాటు కల్పించారు.

## కొలువుల వేటకు కొత్త పుస్తకాలేవీ?



అనంతపురం : పోటీ పరీక్షల్లో రాణించాలంటే వర్తమాన అంశాలపై ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి. జనరల్ నాలెడ్జి, జనరల్ స్టడీస్, కరంట్ అఫైర్స్, వివిధ సబ్జెక్టు పుస్తకాలు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నూతన పుస్తకాలు అవసరమే. అప్పుడే పోటీ పరీక్షల్లో గట్టెక్కి ఉద్యోగం సాధించగలుతారు. పౌరగ్రంథాలయాల్లో కూడా పోటీ పరీక్షల విభాగాలు ఏర్పాటు చేశారు. కానీ ఆ పరీక్షలకు సరిపడే పుస్తకాలు కరవయ్యాయి. పాత పుస్తకాలతో కుస్తీ పట్టాల్సిన పరిస్థితి. కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ విడుదల చేయడంతో గ్రంథాలయ శాఖ కేవలం డీఎస్సీ పరీక్షలకు మార్కెట్‌లో దొరికే పుస్తకాలు గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచారు. డీఎస్సీకి పోటీ ఎక్కువగా ఉన్నందున అభ్యర్థులు కోచింగ్ బాటపట్టారు.

**త్వరలో రానున్న ప్రకటనలు..!**

అటవీశాఖలో సెక్షన్ ఆఫీసరు, ఎల్ఐసీలో అసిస్టెంట్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్, ఏఏఓ, ఏఈ పోస్టులకు ప్రకటన ఇప్పటికే విడుదలైంది. బ్యాంకింగ్, దేవాదాయశాఖ, గ్రంథాలయ సంస్థల్లో వివిధ కేడర్ల ఉద్యోగాలు ప్రకటనలు రానున్నాయి. ఏపీపీఎస్సీ ద్వారా గ్రూప్-2 ఉద్యోగాలు కూడా భర్తీ చేయనున్నారు. మెగా డీఎస్సీ ముగిసిన తరువాత టెట్, మార్చి లోపు మరోసారి డీఎస్సీ నిర్వహిస్తున్నట్లు సంకేతాలు వస్తున్నాయి. ఆయా ఉద్యోగాలకు సంబంధించిన పుస్తకాలు గ్రంథాలయాల్లో అందుబాటులో లేకపోవడం దారుణం. పౌరగ్రంథాలయాలు అంటేనే పురాతన గ్రంథాలు, నవలలు, దిన, వార, పక్ష, మాస పత్రికలు మాత్రమే గుర్తుకొస్తాయి. పాతపుస్తకాలు, పత్రికలు మాత్రమే కనిపిస్తాయి. నేటి యువత ఉద్యోగాలు సాధించడానికి కొత్త పుస్తకాలను అందుబాటులో ఉంచాలని పలువురు అభ్యర్థులు కోరుతున్నారు.

**పార్కుల బాటలో ..**పుస్తకాలు గ్రంథాలయాల్లో లభ్యత ఉంటే అవి ఉద్యోగార్థులతో కళకళలాడేవి. ఆపరిస్థితి లేక ఎక్కువ శాతం గ్రంథాలయాలపై ఆసక్తి చూపడం లేదు. ఉద్యానవనాలు, రీడింగ్ హాళ్లకు వెళ్లి సొంతంగా కొనుగోలు చేసిన పుస్తకాలతో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. కొత్త పుస్తకాలు గ్రంథాలయంలో ఉన్నా ఒకటి, రెండు మాత్రమే ఉంటాయి. ఒకరిద్దరికే అవి సరిపోతాయి. గ్రంథాలయానికి వెళ్లినా పుస్తకాలు దొరక్క వెనుదిరిగి రావాల్సిన పరిస్థితి. సమయం వృథా కూడా. అక్కడికి వెళ్లే అభ్యర్థుల సంఖ్య తగ్గిపోయింది. పేద విద్యార్థులు, పుస్తకాలు కొనలేని స్థితిలో ఉన్న వారు గ్రంథాలయాలకు వెళ్తున్నారు. **పుస్తకాలు అందుబాటులో ఉంచుతాం**డీఎస్సీ అభ్యర్థులకు అవసరమైన పుస్తకాలు అందుబాటులోకి తెచ్చాం. పలువురు అభ్యర్థులు ఉద్యోగాలు కూడా సాధించారు. రాబోయే ఉద్యోగ ప్రకటనలకు అనుగుణంగా అవసరమైన కొత్త పుస్తకాలు అందుబాటులో ఉంచుతాం. రమ, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి

## నారీమణుల సేవాపథం




తాడిపత్రి : మహిళలంతా ఏదో కొంత తమకు చేతనైనంత సాయం అభాగ్యులకు చేయాలనుకున్నారు. కొందరుగృహిణులు, ఉద్యోగాలు, స్వయం ఉపాధి పనులతో జీవనం సాగించేవారంతా ఏడాదిన్నర కిందట 'ఫెమినైన్ హెల్పింగ్ హ్యాండ్స్' అనే సంస్థను ప్రారంభించి ఆపదలో ఉన్న వారికి ఆర్థికసాయం, వారికి అవసరమైనవి అందిస్తూ ఆదర్శంగా నిలిచారు.

**ఆలోచన మొదలైందిలా..**

తాడిపత్రికి చెందిన నాగరాగిణి, మరో ముగ్గురు మహిళలతో కలిసి 2024లో 'ఫెమినైన్ హెల్పింగ్ హ్యాండ్స్' సంస్థను ప్రారంభించారు. మొదట నలుగురు చందాలు వేసుకుని ఆపదలో ఉన్న వారికి సాయం అందించారు. దీన్ని వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసేవారు. తర్వాత సంస్థ పట్ల స్ఫూర్తి పొంది 195 మంది మహిళలు సభ్యులుగా చేరి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు. వీరిలో ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికులు వైద్యులు, ప్రైవేట్ ఉద్యోగులు ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోలేకపోయినా, చదువుకు సాగించడానికి ఇబ్బందులున్న వారి వివరాలను తమ వాట్సప్ గ్రూపులో పోస్ట్ చేస్తారు. అనంతరం సభ్యులంతా కలిసి చందాలు వేసుకుని ఆ కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుంటారు. ఒకటిన్నర సంవత్సరంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి పలువురితో మన్ననలు అందుకోవడం విశేషం.

**సభ్యుల సామాజిక సేవలు**

తాడిపత్రిలోని సౌభాగ్య అనాథ ఆశ్రమంలో ఉన్న విద్యార్థులకు పాఠశాల దూరంగా ఉంటంతో నడిచి వెళ్లలేక తీవ్ర అవస్థలు పడుతున్నారని గుర్తించి రూ.30వేలు విలువ చేసే 6 సైకిళ్లను అందజేశారు.

కడప రోడ్డులో సౌజన్య అనే మహిళ ఆర్థిక ఇబ్బందులతో తమ కుమారులను చదివించకోలేక ఇబ్బంది పడుతోందని గుర్తించి రూ.20వేలు, అలాగే సంజీవనగర్‌కు చెందిన నూరి అనే మహిళ కుమారుడికి రూ.20వేలు పాఠశాల ఫీజు కట్టి చదువుకునేందుకు ఆసరా కల్పించారు.

తాడిపత్రిలోని పలు కాలనీల్లో దివ్యాంగులకు 10 మూడు చక్రాల సైకిళ్లను అందించారు. తరచూ ఆలయాల వద్ద ఉన్న యాచకులకు అన్నదానం చేస్తుంటారు.

హైదరాబాద్‌కు చెందిన హర్షిత అనే మహిళా అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం చేయించుకునేందుకు అవస్థలు పడుతోందని గుర్తించారు. ఆమెకు ఔషధాల కోసమని రూ.17 వేలు అందించారు.

స్నేహితుల సహకారంతో సత్కార్యం : నాగరాగిణి, ఫెమినైన్ హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకురాలు

ఆపదలో ఉన్నవారికి తమ వంతు సాయం అందించాలని స్నేహితులతో కలిసి చర్చించా. దీనికి వారొప్పుకొని ముందకొచ్చారు. ప్రస్తుతం ఎక్కడ ఆపదని తెలియగానే అందరం కలిసి తమ వంతుసాయం అందిస్తున్నాం. ఇంకా సంస్థను అభివృద్ధి చేసి పేద విద్యార్థులకు ఎక్కువగా సాయం చేస్తాం.

## తక్కువ ధరకే మందు బిళ్లలు

అనంతపురం : పేద, మధ్య తరగతి కుటుంబాలకు తక్కువ ధరలోనే మందులు అందుబాటులో ఉంచేందుకు మండలానికో జనరిక్ ఔషధ దుకాణాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఇటీవల సీఎం చంద్రబాబు ప్రకటించారు. దుకాణాల ఏర్పాటుకు సంబంధించి కార్పొరేషన్ల ద్వారా రుణాలు ఇవ్వాలని వెల్లడించారు. బీఫార్మసీ, ఎంఫార్మసీ పూర్తైన వారితో దరఖాస్తులు ఆహ్వానించాలని నిర్ణయించారు. దీంతో నిరుద్యోగ యువతలో ఆశలు చిగురించాయి.

రక్తపోటు, చక్కెర వ్యాధి, గ్యాస్ట్రిక్ వంటి రుగ్మతలతో 80 శాతం మంది నిత్యం ఏదోక ఔషధం వాడుతున్నారు. కొన్ని కుటుంబాలు మందుల కొనుగోలు చేసేందుకు ప్రతి నెలా రూ.వేలు ఖర్చు చేస్తున్నారు.

రక్తపోటు, చక్కెర వ్యాధులకు సంబంధించి పలు కంపెనీలకు చెందిన పది మాత్రలు మందుల దుకాణాల్లో కొనుగోలు చేయాలంటే వాటి ధర రూ.100 నుంచి రూ.130 ఉండగా జనరిక్‌లో రూ.20 నుంచి 30కే లభ్యమవుతాయి.

ఫార్మసీ చదువుకున్న యువత ఒక దుకాణం ఏర్పాటుకు రూ.8 లక్షల వరకు రుణం, అందులో రూ.4 లక్షలు వరకూ రాయితీ కల్పించాలని నిర్ణయించారు.దీంతో నిరుద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది,

**ఉమ్మడి జిల్లాలో 26..**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 26 జనరిక్ కేంద్రాలున్నాయి. అనంతపురంలో ఐదు, పెద్దవడుగూరు 1, బొమ్మనహాళ్ 1, గుంతకల్లు



2, కళ్యాణదుర్గం 2, పామిడి 1, రాయదుర్గం 1, హిందూపురం 4, కదిరి 2, మడకశిర 1, పెనుకొండ 1, పుట్టపర్తి 2, రొల్ల 1 ఉన్నాయి. వీటిని సీనియర్ సిటిజన్లు, మహిళా సమాఖ్య సభ్యులు, అగ్రికల్చర్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులు నిర్వహిస్తుండగా మరికొన్ని వ్యక్తిగతంగా ఏర్పాటు చేసుకుని నిర్వహిస్తున్నారు. త్వరలోనే నూతనంగా జనరిక్ దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానించేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటోంది.

## దశాబ్దాలుగా అదే వరస

చీమకుర్తి : ఇటీవల రూపుదిద్దుకున్న ఎన్నో రహదారులకు జాతీయ హోదా దక్కినా..ఒంగోలు – కర్నూలు రహదారికి ఆ మహా భాగ్యం దరిచేరడం లేదు. ఇద్దరు ఎంపీలు, నలుగురు ఎమ్మెల్యేలు ప్రాతినిథ్యం వహిస్తున్నా నేటికీ ఎలాంటి ఫలితం లేదు. దీంతో ఈ ఛిద్ర రహదారిపై అష్టకష్టాలు పడుతూ జిల్లావాసుల ప్రయాణం సాగుతోంది. ఒంగోలు – కర్నూలు రోడ్డుకు జాతీయ హోదా అన్నది దశాబ్దాలుగా ప్రతిపాదనలకే పరిమితమవుతోంది. పశ్చిమ ప్రకాశంలో పలు రోడ్లు జాతీయ రహదారులుగా మారుతూ నాలుగు వరసలుగా విరాజిల్లుతుంటే ఎంతో ప్రాముఖ్యమున్న ఈ రోడ్డును మాత్రం ఆ జాబితాలో చేర్చడం లేదు. ఒంగోలు నుంచి బేస్తవారపేట కూడలి వరకు ఉన్న 107 కిలోమీటర్ల రోడ్డుకు జాతీయ హోదా ఇవ్వాలన్న డిమాండ్ ఉంది. అయితే ఒంగోలు – చీమకుర్తి మధ్య 21 కిలోమీటర్ల దూరం ప్రయాణించాలంటే కారులో సైతం నలభై నిమిషాలు



పడుతుందంటే పరిస్థితి ఎంత దుర్భరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

**ఎందరో ప్రాతినిథ్యం..:** ఒంగోలు నుంచి చీమకుర్తి మండలం వరకూ బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోకి వస్తుంది. అక్కడి నుంచి బేస్తవారపేట కూడలి వరకు ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఉంది. ఇద్దరు ఎంపీలు ప్రాతినిథ్యం వహిస్తున్నా జాతీయ హోదా మాత్రం నేటికీ కలగానే మిగిలింది. అదేవిధంగా సంతనూతలపాడు, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు శాసనసభ్యులు సైతం నిత్యం ఆపసోపాలు పడుతూ జిల్లాకేంద్రానికి వస్తుంటారు. వీరేకాక ఒంగోలు నుంచి రాయలసీమ, పశ్చిమ ప్రకాశం ప్రాంతానికి నిత్యం వేలాదిమంది రాకపోకలు సాగిస్తుంటారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పలు రాష్ట్ర రహదారులు జాతీయ రహదారులుగా మారి సర్వాంగ సుందరంగా తయారవుతున్నాయి. ఒంగోలు – పొదిలి మధ్య శిథిల రహదారిలో ప్రయాణిస్తూ ఏడాదికి కనీసం 25 మంది వరకూ మృత్యువాత పడుతున్నారు. ఇక క్షతగాత్రుల సంఖ్యకు అయితే లెక్కేలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు హోదా కల్పించడంపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

## ఆశల అలలు తీరం చేరేనా!

జిల్లా అభివృద్ధిలో మరో మణిహారం చేరనుంది.. తూర్పు తీరంలో పూసపాటిరేగ మండలం చింతపల్లి వద్ద మరో గొప్ప మత్స్య ఓడరేవు నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు. ఇతర రాష్ట్రాలకు వలస వెళ్తున్న మత్స్యకారులకు ఉపాధి దక్కనుంది. కూటమి ప్రభుత్వం వచ్చాక విశాఖ తరహాలో పూర్తిస్థాయి 'ఫిషింగ్ హార్బర్' ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. దీంతో ప్రజల్లో కొత్త ఆశలు చిగురించాయి. పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో వేలాది మంది మత్స్యకారులు చేపల వేటతో జీవనం సాగిస్తున్నారు. వేటకు వెళ్లే వీరంతా తమ బోట్లను తీరానికి చేర్చాలన్నా, చేపలను నిల్వ చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నా ఫిష్ ల్యాండింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు కొన్నాళ్లుగా ఉన్నాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో చింతపల్లి వద్ద ఆరు ఎకరాల్లో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణానికి ఆమోదం తెలిపినా.. అయిదేళ్లూ నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో మత్స్యకారులు నష్టపోతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మత్స్య ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు తరలిస్తూ వృద్ధి సాధించాలన్న లక్ష్యంతో ఫిషింగ్ హార్బర్ ప్రణాళికను తెరపైకి తెచ్చింది. దీని ఏర్పాటుకు తీర ప్రాంతంలో 22 ఎకరాల స్థల సేకరణకు యోచిస్తున్నారు. సెంట్రల్ కోస్టల్ అధికారులు పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేశారు.



జిల్లాలో వేటాడిన మత్స్య సంపద వాహనాలతో విశాఖ హార్బర్‌కు తరలించి విక్రయిస్తున్నారు. దీంతో రవాణా ఖర్చు, సమయం వృథా అవుతున్నాయి. హార్బర్ ఏర్పాటైతే మత్స్యకారులు హార్బర్‌లోనే చేపలు విక్రయించవచ్చు. ఇతర రాష్ట్రాలకూ తరలించొచ్చు. మరోవైపు పర్యాటకంగానూ జిల్లా అభివృద్ధి చెందుతుంది. బహుముఖ లాభదాయక మత్స్య కేంద్రంగా నిలుస్తుందని ఆ శాఖ వర్గాలు భావిస్తున్నాయి.

**ఇదీ పరిస్థితి...**

సముద్ర తీరం : 29 కి.మీ
పంచాయతీలు : 16
మత్స్యకార జనాభా : 27వేలు
వేటపై ఆధారపడిన
కుటుంబాలు : 6 వేలు
జిల్లాలో మోటరైజ్డ్ బోట్లు: 714
చింతపల్లిలో మోటరైజ్డ్: 487
సంప్రదాయ వేట పడవలు: 361

ఇవీ ప్రయోజనాలు..

రోడ్ల వసతులు మెరుగవుతాయి
కోల్డ్ స్టోరేజీలతో వ్యర్థాలు తగ్గుతాయి.
మత్స్య ఉత్పత్తులకు గిట్టుబాటు ధర వస్తుంది.
ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి లభిస్తుంది.
పరిశ్రమలు ఏర్పాటవుతాయి.
పర్యాటక రంగానికి ఊతం వస్తుంది.
అభివృద్ధి హబ్‌గా మారుతుంది.

అనుమతులు రాగానే ప్రారంభిస్తాం..
–శ్రీనివాసరావు, ఎఫ్‌డీవో మత్స్యశాఖ

తపల్లిలో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ ఏర్పాటు వర్చువల్‌గా ప్రారంభమైనా గత ప్రభుత్వం పూర్తిచేయలేదు. ప్రస్తుత ప్రభుత్వం ఫిషింగ్ హార్బర్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోంది. ఇందుకు 22 ఎకరాలు అవసరం. ఇటీవల సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ కోస్టల్ ఇంజినీరింగ్ ఆఫ్ ఫిషరీస్ అధికారులు ఈ ప్రాంతంలో స్థలానికి పరిశీలించి నివేదికను పంపించారు. అనుమతులు రాగానే స్థల సేకరణ పనులు చేపడతాం.




## పుత్తడిబొమ్మలా అందంగా ముస్తాబైన ఆషురెడ్డి..!

గ్లామర్ వలకబోయడం లోనే కాదు సాంప్రదాయంగా కనిపించి అభిమానులను ఆకట్టుకోవడంలో కూడా ముందుంటుంది ప్రముఖ సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ ఆషురెడ్డి. తన అందంతో.. వాక్చాతుర్యంతో అందరినీ అబ్బురపరిచే ఈ ముద్దుగుమ్మ.. అప్పుడప్పుడు సాంప్రదాయంగా కనిపించి అందరినీ అలరిస్తూ ఉంటుంది. ఈ క్రమంలోనే తాజాగా బతుకమ్మ సెలబ్రేషన్స్ ఒకవైపు.. దేవీ నవరాత్రులు మరొకవైపు ఘనంగా జరుగుతుండగా.. ఈ సందర్భంగా పుత్తడి బొమ్మలా సాంప్రదాయంగా రెడీ అయ్యి అందరి చూపును తన వైపు తిప్పుకుంది. పట్టు పరికిణిలో కనిపించి అందుకు తగ్గట్టుగా జువెలరీ ధరించిన ఈమె చాలా సాంప్రదాయంగా కనిపిస్తోంది. ఆషురెడ్డిని తొలిసారి ఇలా చూస్తున్నాం అంటూ ఆమె అభిమానులు సైతం ఆమె అందానికి మంత్రముగ్ధులవుతున్నారు.



ఆషురెడ్డి ఒక షోలో భాగంగా సెలబ్రేషన్స్ చేసుకుంటూ ఈ ఫోటోలను షేర్ చేసింది.. అందులో స్రవంతి చొక్కారపు కూడా చాలా అందంగా కనిపిస్తోందని చెప్పవచ్చు.. ముఖ్యంగా ఈ ఇద్దరు సాంప్రదాయంగా కనిపించి అభిమానులను తమ అందంతో కట్టిపడేస్తున్నారు. ఆషురెడ్డి కెరియర్ విషయానికే వస్తే.. ఎక్కడో అమెరికాలో సాఫ్ట్వేర్ గా ఉద్యోగం చేసుకుంటూ కెరియర్ ను కొనసాగిస్తున్న ఈమె పవన్ కళ్యాణ్ కి డై హార్డ్ ఫ్యాన్ అన్న విషయం అందరికీ తెలిసిందే. అయితే ఆయన కోసమే తాను ఉద్యోగం వదిలేసి వచ్చానని ఇప్పటికే ఎన్నోసార్లు చెప్పింది కూడా.. అలా ఉద్యోగం మానేసి ఇండస్ట్రీలోకి అడుగు పెట్టిన ఈమె.. ఇక్కడే పలు ఆల్బమ్ సాంగ్స్ చేస్తూ మరింత పాపులారిటీ అందుకుంది. ముఖ్యంగా తన అందంతో జూనియర్ సమంత అనే బిరుదును కూడా దక్కించుకుంది ఆషురెడ్డి. నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ గ్లామర్ ఫోటోలను షేర్ చేస్తూ అటు వెకేషన్స్ కూడా ఎంజాయ్ చేస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం సుధీర్ హోస్టా వ్యవహరిస్తున్న ఫ్యామిలీ స్టార్ట్స్ అనే షోలో సుధీర్ తో పాటు హోస్టా వ్యవహరిస్తూ కెరియర్ ను కొనసాగిస్తోంది. అంతేకాదు గతంలో బిగ్ బాస్ హౌస్ లోకి కూడా అడుగుపెట్టిన ఈమె.. అక్కడ కూడా తన పెర్ఫార్మెన్స్ తో అందరినీ అబ్బురపరిచింది. ఇదిలా ఉండగా.. ప్రముఖ సింగర్ రాహుల్ సిప్లిగంజ్ తో ఈమె ప్రేమలో ఉందని.. త్వరలోనే పెళ్లి కూడా చేసుకోబోతున్నారు అంటూ వార్తలు వైరల్ అవ్వగా.. అందులో నిజం లేదని కొట్టిపారేసింది.

## ఇదంతా అతడి నమ్మకం వల్లే: త్రిప్తి దిమ్రీ

తన కెరీర్ గేమ్ ఛేంజింగ్ హిట్‌ని అందించిన దర్శకుడిని ఏ నటీమణి అయినా మర్చిపోగలరా? ఇప్పుడు త్రిప్తి దిమ్రీ కూడా అందుకు మినహాయింపు కాదు. ఈ బ్యూటీ నటి అయ్యాక, వరుసగా సినిమాల్లో నటిస్తోంది. కానీ ఆశించిన గుర్తింపు దక్కలేదు. లైలా మజ్నూ, ఖాళా, బుల్బుల్ లాంటి చిత్రాల్లో నటించింది. కానీ ఆ సినిమాలను ఎవరూ పట్టించుకోలేదు. ఆ సమయంలో త్రిప్తి అస్సలు ఊహించలేదు. తన లైఫ్ గేమ్ ఛేంజింగ్ సినిమాని ఒక తెలుగు దర్శకుడు అందిస్తాడని.. అది కూడా రణబీర్ కపూర్ లాంటి పెద్ద హీరో సినిమాలో నటించే అవకాశం. ఒకే ఒక్క యానిమల్ చిత్రం త్రిప్తి దిమ్రీ దశను మలుపు తిప్పేసింది. యానిమల్‌లో చేసింది చిన్న పాత్రలోనే అయినా అది తన కెరీర్ గేమ్ ఛేంజర్ గా మారింది. ఈ సినిమా విడుదలైన తర్వాత త్రిప్తి దిమ్రీ ఎవరు? అంటూ గూగుల్ లో ఆరాలు తీసారు. మీడియా విస్తృతంగా తన గురించి ప్రచారం చేసింది. అంతేకాదు త్రిప్తి దిమ్రీ



నటించిన గత చిత్రాలు లైలా మజ్నూ, ఖళా , బుల్బుల్ లను కూడా ప్రజలు చూడటానికి ప్రయత్నించారు. జీవితం 360 డిగ్రీల మలుపు తీసుకుందని చెప్పింది త్రిప్తి. యానిమల్ విడుదలయ్యాక అనూహ్యంగా త్రిప్తి నేషనల్ క్రష్ అనే టైటిల్ ని కూడా సొంతం చేసుకుంది. సందీప్ వంగా ఆ రోజు తనను నమ్మి జోయా అనే పాత్రను ఆఫర్ చేయకపోతే ఏం జరిగేదో త్రిప్తి ఊహించుకుంటోంది. అందుకే వీలున్న ప్రతిసారీ సందీప్ ని తలచుకుంటోంది. తన జీవితాన్ని మార్చేసిన సినిమాగా యానిమల్‌కు క్రెడిట్ దక్కుతుందని త్రిప్తి చెప్పారు. ఫిలింఫేర్‌తో ఇంటర్వ్యూలో త్రిప్తి మాట్లాడుతూ..యానిమల్ ఒక వరం. లైలా మజ్నూ సమయంలో నాకు లభిస్తుందని భావించిన గుర్తింపు, వాస్తవానికి యానిమల్‌తో వచ్చింది. ఇది చాలా చిన్న పాత్ర కాబట్టి గుర్తింపు వస్తుందా? అని అనుకున్నాను.. కానీ దర్శకుడు సందీప్ వంగా సర్ నాపై నమ్మకం ఉంచారు. ఈ సినిమా నాకు చాలా మంచి అవకాశమని అన్నారు. ఆయన చెప్పినదంతా సరిగ్గా జరిగింది. ఇది గొప్ప ఆశీర్వాదం.. నా నటనకు ప్రేమ కురిసింది. యానిమల్ కారణంగా ప్రజలు తిరిగి నా గత చిత్రాలు బుల్బుల్, ఖాలా, లైలా మజ్నూ చూడటం నాకు సంతోషాన్నిస్తోంది అని అన్నారు. సెట్‌లో భయపడతారా? అన్న ప్రశ్నకు త్రిప్తి సమాధానం ఇచ్చింది.

నేను ప్రతి సినిమాకి భయపడతాను.. మొదటి ఐదు రోజులు ఈ భయం. ఎదుటి వ్యక్తిని నేను అర్థం చేసుకున్నానా లేదా? అంటూ భయపడుతుంటాను. కొద్దిరోజులు అలవాటయ్యాక ఆస్వాధించడం మొదలవుతుంది. నటిగా స్వీయ విమర్శ సహజం. అది ప్రక్రియలో భాగం అని తెలిపింది. కెరీర్ విషయానికి వస్తే.. త్రిప్తీ తదుపరి ప్రభాస్‌తో స్పిరిట్‌లో నటిస్తుంది. భూల్ భూలయ్యా 3 సహనటి మాధురీ దీక్షిత్‌తో మా బెహెన్ అనే చిత్రానికి సంతకం చేసింది. సందీప్ వంగా యానిమల్ పార్క్‌లోను నటించాల్సి ఉంది.

## నారా రోహిత్ సినిమా తెగ చూసేస్తున్నారు..!



నారా రోహిత్ హీరోగా వెంకటేష్ నిమ్మలపూడి డైరెక్షన్ లో తెరకెక్కిన సినిమా సుందరకాండ. ఈ సినిమాలో శ్రీదేవి, వ్రితి వఘని ఫిమేల్ లీడ్ గా నటించారు. ఆగష్టు 27న థియేట్రికల్ రిలీజైన ఈ సినిమా పాజిటివ్ టాక్ తెచ్చుకుంది. ఫ్యామిలీ అంతా కలిసి చూసే సూపర్ ఎంటర్టైనర్ గా క్రిటిక్స్, రివ్యూయర్స్ కూడా ప్రశంసించారు. ఐతే ఆ టైం లో తెలుగు రాష్ట్రాల్లో పడిన వర్షాల వల్ల బాక్సాఫీస్ దగ్గర అంత పర్ఫార్మ్ చేయలేదు. నారా రోహిత్ కెరీర్ లో ఈ సినిమా ఒక మంచి సక్సెస్ అవుతుందని అనుకోగా టాక్ బాగున్నా వర్షాల కారణంగా సినిమా కమర్షియల్ గా వర్క్ అవుట్ కాలేదు.

**ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా సుందరకాండ..** ఐతే ఈ సినిమా రీసెంట్ గానే ఓటీటీలో రిలీజైంది. జియో హాట్ స్టార్ లో ఈ సినిమా డిజిటల్ రిలీజైంది. ఐతే థియేట్రికల్ రిలీజ్ ఐతే వర్షాల కారణంగా పెద్దగా చూడలేదు కానీ ఓటీటీ రిలీజ్ లో సినిమాను అందరు తెగ ఎంజాయ్ చేస్తున్నారు. ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా వచ్చిన సుందరకాండ సినిమా ఆడియన్స్ ని కడుపుబ్బా నవ్విస్తుంది. థియేట్రికల్ రిలీజ్ కూడా ఇదే రేంజ్ సక్సెస్ ఆశించారు. కానీ ఆ టైం లో ప్రకృతి సహకరించలేదు. ఐతే హిట్ సినిమా ఎక్కడైనా ప్రేక్షకాదరణ పొందుతుంది. ఈ క్రమంలోనే నారా రోహిత్ సుందరకాండ సినిమా డిజిటల్ రిలీజ్ తర్వాత సందడి చేస్తుంది. సోషల్ మీడియాలో ఈ సినిమా గురించి స్పెషల్ డిస్కషన్స్ జరుగుతున్నాయి. జియో హాట్ స్టార్ లో స్ట్రీమింగ్ అవుతుంది సుందరకాండ సినిమా డిజిటల్ రిజల్ట్ మాత్రం సూపర్ సక్సెస్ అని చెప్పొచ్చు.

**సినిమాలో సత్య కామెడీ..** సుందరకాండ సినిమాకు ఓటీటీ ఆడియన్స్ నుంచి వస్తున్న రెస్పాన్స్ కి సూపర్ హ్యాపీగా ఉన్నారు. సినిమాలో సత్య కామెడీ కూడా ఆడియన్స్ ని సూపర్ గా ఎంటర్టైన్ చేసింది. సో మంచి సినిమా ఒకవేళ పరిస్థితుల వల్ల థియేట్రికల్ వెర్షన్ క్లిక్ అవ్వకపోయినా ఓటీటీ లో మాత్రం సినిమా సక్సెస్ అవుతుందని మరోసారి సుందరకాండ ప్రూవ్ చేసింది. నారా రోహిత్ రీసెంట్ గా భైరవం సినిమా చేశాడు. బెల్లంకొండ శ్రీనివాస్, మంచు మనోజ్ తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకున్నాడు. ఆ సినిమా యాక్షన్ మూవీగా వచ్చింది. ఐతే సుందరకాండ కంప్లీట్ ఫ్యామిలీ మూవీగా వచ్చింది. అందుకే ఆ సినిమా చూసి ఆడియన్స్ అంతా సూపర్ అనేస్తున్నారు. సుందరకాండ రెస్పాన్స్ తో నారా రోహిత్ కూడా తన నుంచి ఆడియన్స్ ఎలాంటి సినిమాలు కోరుతున్నారో క్లారిటీ వచ్చింది. సో అలాంటి సినిమాలతోనే నారా రోహిత్ నెక్స్ట్ సినిమాలు ప్లాన్ చేసుకుంటే బెటర్ అని చెప్పొచ్చు.

## సామ్ కనిపిస్తే వెంటపడటమే..!





సౌత్ స్టార్ హీరోయిన్ సమంత ఈమధ్య ఎక్కువగా ముంబైలోనే ఉంటుంది. బాలీవుడ్ వెబ్ సీరీస్ లు చేస్తూ వస్తున్న అమ్మడు ఇప్పుడు అక్కడ సినిమాలను కూడా చేయాలని ఫిక్స్ అయ్యింది. తెలుగులో ఛాన్స్ లు రావట్లేదా అంటే వస్తున్నా కూడా సమంతకు నచ్చే కథలు దొరకట్లేదట.

ఐతే సమంత ఈమధ్యనే తన ప్రొడక్షన్ ట్రాలాలా బ్యానర్ లో శుభం సినిమా చేసింది. ఆ సినిమాతో అమ్మడు నిర్మాతగా తన లక్ టెస్ట్ చేసుకుంది. కమర్షియల్ గా సూపర్ హిట్ అవ్వకపోయినా శుభం ఒక మంచి ప్రయత్నం అనిపించుకుంది.

**సమంత సీరియస్ అయినా కూడా..** ఐతే సమంత ఎక్కడ కనిపిస్తే అక్కడ ఫోటోలు క్లిక్ అనిపిస్తారు. ప్రెస్ మీట్ లు, సినిమా ప్రమోషన్స్ అయితే ఓకే కానీ ఆమె జిం కి వెళ్లి వస్తుంటే పాపరాజీలు ఆమెను వదలట్లేదు. వెంట పడి మరీ ఆమె ఫోటోలు క్లిక్ అనిపిస్తున్నారు. అంతకుముందు ఆల్రెడీ సమంత ఈ విషయంపై కాస్త సీరియస్ అయినా కూడా ఆమెను వదలట్లేదు. మామూలుగా అయితే కొందరు హీరోయిన్స్ ఈ పాపరాజీలను కావాలని పెట్టుకుంటారు. అందుకే వాళ్లు జిమ్, ఎయిర్ పోర్ట్ ఇలా పబ్లిక్ లో ఎక్కడ కనిపించినా ఫోటోస్ తీస్తుంటారు. కానీ సమంత విషయంలో ఆమె వద్దంటున్నా కూడా వీళ్లు వదలట్లేదు. ముఖ్యంగా ఫ్యామిలీ మ్యాన్, సిటాడెల్ డైరెక్టర్ రాజ్ తో సమంత చెట్టాపట్టాలేసుకుని తిరుగుతుంది అన్న టాక్ ఉంది. ఇద్దరి మధ్య సంథింగ్ సంథింగ్ అంటూ గుసగుసలు వినిపిస్తున్నాయి. కానీ ఎవరు ఈ విషయంపై ఓపెన్ అవ్వట్లేదు.

ఐతే రాజ్ తో ముంబైలో సమంత కనిపించిన ప్రతిసారి ముంబై మీడియా తెగ హడావిడి చేస్తుంది.

**ఇష్టం లేకుండా ఫోటోలు తీయడం..** లేటెస్ట్ గా ఆమె జిమ్ నుంచి బయటకు వస్తున్న టైం లో కూడా అదే జిమ్ నుంచి రాజ్ కూడా రావడం వల్ల సమంత కనీసం పాపరాజీలను పట్టించుకోకుండా వెళ్లిందట. అయినా సరే సమంత వెంట పడి ఆమెని ఫోటో తీయాలని తెగ ప్రయత్నిస్తున్నారు. సమంత ఈ విషయంలో చాలా డిజప్పాయింటెడ్ గా ఉందని తెలుస్తుంది. స్టార్స్ అయినా సరే వాళ్లకి ఇష్టం లేకుండా ఫోటోలు తీయడం అన్నది కరెక్ట్ కాదు. చూస్తుంటే ఈ విషయంపై సమంత ఏదో ఒక టైం లో గట్టిగా రియాక్ట్ అయ్యేలా ఉంది. సమంత సినిమాల విషయానికి వస్తే అమ్మడు బాలీవుడ్ లోనే నెక్స్ట్ సినిమా చేస్తుందని టాక్. తెలుగులో తన బ్యానర్ లోనే మా ఇంటి బంగారం సినిమా లైన్ లో ఉంది. ఆ సినిమా తర్వాత సమంత తెలుగులో కూడా వరుస ప్రాజెక్ట్స్ చేయాలని చూస్తుంది.

## 18 ఏళ్ల కెరియర్ సక్సెస్ కి కారణం సినిమాలు కాదు..

ప్రముఖ స్టార్ హీరోయిన్ తమన్నా గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. శ్రీ అనే సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగు పెట్టి 'హ్యాపీడేస్' సినిమాతో తనకంటూ ఒక గుర్తింపును సొంతం చేసుకుంది. ఆ తర్వాత రచ్చ, బద్రీనాథ్, తడాఖా, సైరా నరసింహారెడ్డి, ఊసరవెల్లి ఇలా ఎన్నో చిత్రాలలో నటించి భారీ పాపులారిటీ అందుకుంది. ముఖ్యంగా టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో ఉండే అందరి స్టార్ హీరోలతో కలిసి నటించిన ఈమె. బాలీవుడ్ లోనే కూడా అవకాశాలు అందుకుంటూ బిజీగా మారిపోయింది. ఇకపోతే ఈ మధ్య ఈమె నటించిన సినిమాలు పెద్దగా వర్కౌట్ కాకపోవడంతో ఇటు టాలీవుడ్ అటు బాలీవుడ్ లో స్పెషల్ సాంగ్స్ చేస్తూ.. ప్రేక్షకులను అలరిస్తోంది. ఇకపోతే 18 ఏళ్ల సినీ కెరియర్ లో ఇప్పటికీ ఇంత స్టార్ స్టేటస్ ను సొంతం చేసుకోవడానికి కారణం సినిమాలు కాదు అని చెప్పి అందరిని ఆశ్చర్యపరిచింది. ఇన్నేళ్ల తన సినీ కెరియర్ సక్సెస్ కి కారణం సినిమాలు కాదు స్పెషల్ సాంగ్స్ అంటూ చెప్పి అబ్బురపరిచింది. అసలు విషయంలోకి వెళ్తే... ఒకవైపు సినిమాలు ,



వెబ్ సిరీస్ లు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్న అవకాశం వస్తే స్పెషల్ సాంగ్స్ లలో కూడా చేస్తూ ఆకట్టుకుంటుంది. ఈ క్రమంలోని ఇటీవల ఈమె చేసిన ఒక స్పెషల్ సాంగ్ భారీగా సక్సెస్ అవ్వడంతో తమన్నా పేరు మరోసారి గట్టిగా వినిపిస్తోందని చెప్పవచ్చు. ఈ క్రమంలోనే ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న తమన్న ఎన్నో ఆసక్తికర విషయాలు పంచుకుంది. తమన్నా మాట్లాడుతూ.. "నేను ఇప్పటికే ఎన్నో తెలుగు, తమిళ్, హిందీ సినిమాలలో నటించాను. అయితే ఆ చిత్రలేవీ కూడా నాకు మంచి గుర్తింపుని అందివ్వలేదు. కానీ ఎప్పుడైతే తెలుగులో అల్లు అర్జున్ తో బద్రీనాథ్ సినిమా చేశానో.. ఆ సినిమాలో చేసిన ఐటమ్ సాంగ్ కి భారీ గుర్తింపు వచ్చింది. అప్పటినుంచి చాలామంది దర్శక నిర్మాతలు నన్ను స్పెషల్ సాంగ్ల కోసమే నన్ను సంప్రదించేవారు. అలా అప్పటినుంచి టాలీవుడ్ తో పాటు బాలీవుడ్ అలాగే ఇతర సౌత్ చిత్రాలలో కూడా నేను స్పెషల్ సాంగ్స్ చేస్తున్నాను. ఒకరకంగా చెప్పాలి అంటే ఇన్నేళ్ల కెరియర్లో నాకు మంచి సక్సెస్ ఇచ్చింది మాత్రం స్పెషల్ సాంగ్స్ వల్లే.. సినిమాల వల్ల కాదు అంటూ అసలు నిజం బయటపెట్టి అందరిని ఆశ్చర్యపరిచింది తమన్నా. అంతేకాదు సినిమాల కంటే కూడా తనకు ఎక్కువ క్రేజ్ వచ్చిన స్పెషల్ సాంగ్స్ చేయడానికే ఆసక్తి చూపిస్తున్నాను అంటూ కూడా తెలిపింది. తమన్నా సినిమాల విషయానికొస్తే.. చివరిగా ఓదెలా 2 సినిమాలో నటించింది. ఈ సినిమా ప్రేక్షకులను పెద్దగా ఆకట్టుకోలేదు . అటు తమిళంలో అరుణ్మనై 4లో కూడా నటించింది. ఇప్పుడు బాలీవుడ్ లో రోమియో, రేంజర్, వివన్ తో పాటు మొత్తం నాలుగు చిత్రాలలో నటిస్తోంది ఈ ముద్దుగుమ్మ. మరి ఈ చిత్రాలన్నీ ఈమెకు ఎలాంటి గుర్తింపును అందిస్తాయో చూడాలి.

## కలలోనూ ఊహించలేదు.. తారక్ మూవీ కోసం ఇప్పుడే చెప్పను: రుక్మిణీ

రుక్మిణీ వసంత్.. నిన్న మొన్నటి వరకు కన్నడ సినీ ఇండస్ట్రీలో ఈ పేరు ఫుల్ గా వినిపించింది. అక్కడ తీసిన సప్త సాగరాలు దాటి సిరీస్ చిత్రాలతోపాటు బఘీర వంటి సినిమాలతో ఆమె మంచి పాపులారిటీ సంపాదించుకున్నారు. ఇప్పుడు టాలీవుడ్, కోలీవుడ్ లో కూడా సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. పలు సినిమాల్లో నటిస్తున్నారు. రీసెంట్ గా కోలీవుడ్ స్టార్ హీరో శివ కార్తికేయన్ లీడ్ రోల్ లో తెరకెక్కిన మదరాసితో ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన రుక్మిణీ.. తన యాక్టింగ్ తో ప్రశంసలు అందుకున్నారు. ఇప్పుడు అక్టోబర్ 2వ తేదీన కాంతార చాప్టర్ 1తో సందడి చేయనున్న అమ్మడు.. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో పలు విషయాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ముందుగా కాంతార ప్రీక్వెల్ మూవీ ఛాన్స్ కోసం మాట్లాడారు. తాను నటించిన సప్తసాగరాలు దాటి, ఏస్ మూవీలను రిషబ్ శెట్టి చూశారని, ప్రీమియర్స్ కు వచ్చి తన



నటనను మెచ్చుకున్నారని తెలిపారు. కాంతార చాప్టర్ 1లో యాక్ట్ చేసే అవకాశం తనకు వస్తుందని కలలో కూడా ఊహించలేదని చెప్పుకొచ్చారు రుక్మిణీ వసంత్. ఆయన తన సినిమాల ప్రీమియర్స్ చూసి ఛాన్స్ ఇచ్చారని భావిస్తున్నట్లు చెప్పారు. కాంతార టీమ్ తన ఫోన్ చేసి ఇందులో యాక్ట్ చేస్తారా అని అడిగినప్పుడు అప్పుడు వచ్చిన ఆనందాన్ని మాటల్లో వర్ణించలేనని తెలిపారు. కాంతార ప్రీక్వెల్ 4,5 శతాబ్దాల మధ్య జరిగే కథ అని, అప్పటి పరిస్థితులకు తగినట్లు నటించాలని రుక్మిణీ వసంత్ చెప్పారు. సినిమా కోసం గుర్రపు స్వారీ, కత్తి యుద్ధంలో శిక్షణ పొందడం ఎంతో సరదాగా అనిపించిందని, తాను మూవీలో కొన్ని యాక్షన్ సన్నివేశాలు చేశానని చెప్పారు. షూటింగ్ టైమ్ లో రిషబ్ శెట్టిని చూసి కొన్నిసార్లు షాక్ అయినట్లు తెలిపారు. హీరో, డైరెక్టర్ గా ఆయన ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తారని ప్రశంసల వర్షం కురిపించారు. ఆ తర్వాత తాను ఎన్టీఆర్ – ప్రశాంత్ నీల్ కాంబోలో రానున్న సినిమా, యశ్ టాక్సిక్ గురించి ఇప్పుడే ఏం చెప్పలేనని అన్నారు. కెరీర్ లో ఏ ఆఫర్ కూడా వదులుకోలేనని చెప్పారు. ఫ్యూచర్ లో రకరకాల క్యారెక్టర్స్ చేస్తానని, ఆడియన్స్ తన జర్నీ జడ్జ్ చేయాలని తెలిపారు. ఫ్యాన్స్ అంతా క్రష్ అంటున్నారని, లేబుల్స్ మాత్రం నార్మల్ అని తెలిపారు. వాళ్లంతా తన క్యారెక్టర్ కు కనెక్ట్ అవ్వడం హ్యాపీ అని చెప్పారు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536